తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
కడప
: fb.com/vaartha Digital
Published from Kadapa, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
16-12-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 315 పేజీలు: 10+4 వెల: 6.50



SHOWROOMS: ANDHRA PRADESH: RENAULT KURNOOL Ph: 8527234838. RENAULT ONGOLE Ph: 9582547709.



సోమవారం న్యూఢిల్లీలో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో భేటీ అయిన మంత్రి నారా లోకేష్

# కేంద్రమంత్రి జయంత్ చౌదరితో మంత్రి నారా లోకేష్ భేటీ

**విజయవాడ,డిసెంబరు 15,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్ చౌదరితో భేటీ అయ్యారు. విశాఖపట్నంలో జాతీయ నైపుణ్య శిక్షణ సంస్థ ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా లోకేశ్ విజ్ఞప్తి చేశారు. విశాఖ జిల్లా పెదగంట్యాడలో 5 ఎకరాల స్థలాన్ని ఈ సంస్థ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే గుర్తించిందని లోకేష్ కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సంస్థ ఏర్పాటుతో అధ్యాపకుల అభివృద్ధి, పరిశ్రమల అవసరాలకు తగిన నైపుణ్య శిక్షణ, గ్రీన్ స్కిల్స్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ వంటి అంశాల్లో ఇది ప్రాంతీయ కేంద్రంగా సేవలందిస్తుందని వివరించారు. అలాగే రాష్ట్రంలో ఎన్‌సిబిఇటి అర్హతలను పెద్ద ఎత్తున స్వీకరించేందుకు ప్రత్యేక అనుమతి మంజూరు చేయాలని కోరారు. అంతకుముందు పార్లమెంట్ ప్రాంగణానికి చేరుకున్న లోకేష్‌కు పలువురు ఎంపీలు, మంత్రులు స్వాగతం పలికారు. టిడిపి పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో ఎంపీలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సమావేశంలో లోకేష్ వెంట కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఇతర ఎంపీలు పాల్గొన్నారు.



సోమవారం శాంతివనంలో చెట్ల సంరక్షణ కేంద్రం పరిశీలిస్తున్న సిఎం చంద్రబాబు

# విశాఖకు త్వరలో ప్రపంచ ఛాంపియన్లు రాబోతున్నారు

## ఎక్స్‌వేదికలో మంత్రి లోకేష్

**విజయవాడ,డిసెంబరు 15,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియాలో చేసిన ఒక పోస్ట్ ఇప్పుడు సర్వత్రా ఆసక్తిని రేకెత్తిస్తోంది. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన, త్వరలో విశాఖపట్నానికి ప్రపంచ ఛాంపియన్లు రాబోతున్నారని వెల్లడించారు. ఈ ప్రకటనతో రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా వైజాగ్ ప్రజల్లో తీవ్ర కుతూహలం నెలకొంది. "వైజాగ్... సిద్ధంగా ఉండు. ఈ నెలలోనే ప్రపంచ ఛాంపియన్లు వస్తున్నారు. వారెవరో ఎవరైనా ఊహించగలరా?" అంటూ లోకేశ్ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ చిన్న పోస్ట్ ఇప్పుడు పెద్ద చర్చకు దారితీసింది. వస్తున్నది క్రీడా రంగానికి చెందినవారా, లేక టెక్నాలజీ లేదా వ్యాపార రంగంలోని దిగ్గజాలా అనే దానిపై ఊహాగానాలు మొదలయ్యాయి. సాధారణంగా ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి పనుల గురించి వెల్లడించే లోకేశ్, ఇలా సస్పెన్స్ క్రియేట్ చేస్తూ పోస్ట్ పెట్టడంతో అందరిలోనూ ఆసక్తి పెరిగింది. విశాఖను అంతర్జాతీయంగా మరింత ఉన్నత స్థాయిలో నిలబెట్టేందుకే ఈ కార్యక్రమం అని పలువురు భావిస్తున్నారు. ఆ ప్రపంచ ఛాంపియన్లు ఎవరు, వారు ఏ రంగంలో నిష్ణాతులు అనే వివరాలు తెలియాలంటే మంత్రి నుంచి రాబోయే అధికారిక ప్రకటన వరకు వేచి చూడాల్సిందేనంటున్నారు.

# సహకరించండి..

>>విధానం తీసుకొచ్చాం అని వివరించారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే నైపుణ్య గణనకు కేంద్ర సహాయం కావాలని లోకేష్ కోరారు. దీనికి కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ సానుకూలంగా స్పందించారు. రాష్ట్రంలో యువ పారిశ్రామికవేత్తలు, ఔత్సాహిక వ్యవస్థాపకులకు అద్భుతమైన వేదికగా ఏర్పాటుచేసిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు మీట్ వై స్టార్టప్ హబ్ మద్దతుగా నిలవాలనివిజ్ఞప్తిచేశారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లో ఎవి జిసిఎక్స్ఆర్, వేవ్ ఎక్స్ ఫ్రేమ్‌వర్క్‌కింద ఎఇన్నో ఎక్స్‌సార్ యానిమేషన్, ఏఆర్/విఆర్ ఇమ్మెర్సివ్ టెక్నాలజీస్ కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు సహకారం అందించండి. ఇండియా ఎఐమిషన్ కింద రాష్ట్రంలో ఎఐ విస్తృతి వేగవంతానికి మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి లోకేష్ వెంట కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, ఎంపిలు ఉన్నారు.

# దాఖలు చేసిన ఎన్ఐఎ

>> పేరును కూడా ప్రస్తావించింది. ముగ్గురు పాకిస్థానీ ఉగ్రవాదులు ఫైజల్ జాట్, అలియాస్ సులేమాన్‌షా, హబీబహ తాహిర్ అలియాస్ జిబ్రాన్ హంజా ఆఫ్గానీలు ఆపరేషన్ మహాదేవ్‌లో హతమైనట్లు తెలిపింది. ఉగ్రదాడులకు ఆశ్రయం కల్పించిన ఫర్వేజ్ అహ్మద్ బషీర్ అహ్మద్ జోథర్‌లపేర్లను పొందుపరిచింది. సుమారు ఎనిమిదినెలలపాటు సమగ్ర శాస్త్రీయ దర్యాప్తు నిర్వహించిన ఎన్ఐఎ ఈ కేసులో పాక్‌ప్రమేయం ఉందని వెల్లడించింది. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న ఉగ్రవాదులను ఆపరేషన్ మహాదేవ్‌లో అంతం చేసిన సంగతి తెలిసిందే. గుజ్జర్, బక్కర్‌వాల్ సామాజికవర్గాలనుంచి ఉగ్రవాదులకు పక్కా సమాచారం అందుతుండేదని ఈస్థానికులే ఉగ్రవాదులకు తాత్కాలిక ఆశ్రయం కల్పించారని రవాణా సదుపాయం, క్షేత్రస్థాయిలో మార్గ నిర్దేశనంచేసినట్లు కోర్టుకు సమర్పించిన అభియోగ పత్రంలో వివరించింది.

# ఆధ్యాత్మికత ద్వారా విశ్వ చైతన్యం

>> కలిసి చంద్రబాబు దాదాపు నాలుగు గంటల పాటు ఆశ్రమాన్ని సందర్శించారు. కన్హాశాంతి వనంలో ఆధ్యాత్మిక, పర్యావరణ, విద్య, ఆరోగ్యపరమైన సదుపాయాలను గురించి సిఎంకు దాజీ వివరించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ధ్యాన మందిరం, వెల్‌నెస్ సెంటర్, యోగా సదుపాయాలు, హార్ట్‌ఫుల్నెస్ ఇంటర్నేషనల్ స్కూల్, పుల్లెల గోపీచంద్ అంతర్జాతీయ శిక్షణ అకాడమీని ఈ సందర్భంగా సిఎం పరిశీలించారు. అదే విధంగా చెట్ల సంరక్షణ కేంద్రం, వర్షపు నీటి సంరక్షణ, వ్యవసాయ క్షేత్రాలను కూడా సిఎం చంద్రబాబు సందర్శించారు. ధ్యాన మందిరం సందర్శన అనంతరం దాని రూపకల్పన, సామర్థం, ఆధ్యాత్మిక ప్రాముఖ్యత గురించి సిఎం తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దాజీ నివాసానికి వెళ్లిన సిఎం చంద్రబాబు దేశ విదేశాల్లో ఆశ్రమం ద్వారా అందుతోన్న సేవలు, నిర్వహిస్తున్న కార్యకలాపాలను గురించి తెలుసుకున్నారు. ఆధ్యాత్మికత ద్వారానే విశ్వ చైతన్యం సాధ్యమవుతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ సందర్భంగా అన్నార శాంతి వనంలో ప్రపంచంలోనే అతిపెద్ద ధ్యాన కేంద్రం ఉంది. అలాగే వెల్‌నెస్ సెంటర్, యోగా చేసుకునేందుకు సౌకర్యం, హార్ట్‌ఫుల్‌నెస్ ఇంటర్నేషనల్ స్కూల్, పుల్లెల గోపీచంద్ స్టేడియం వంటివి ఉన్నాయి. వీటిని దాజీతో కలిసి సిఎం చంద్రబాబు సందర్శించారు. అలాగే శాంతివనంలో జరుగుతోన్న శాస్త్రీయ, వృక్షశాస్త్ర పరిశోధనల గురించి ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. శాంతి వనంలో చేపడుతున్న జీవ వైవిధ్యం, పర్యావరణ కార్యక్రమాలను వీక్షిస్తూ సిఎం చంద్రబాబు రెయిన్‌ఫారెస్ట్‌ను సందర్శించారు. రెయిన్ ఫారెస్ట్ రూపకల్పన, దానికి ఉన్న ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను సీఎంకు దాజీ వివరించారు. అలాగే ధ్యాన మందిరం వెలుపల ఉన్న వర్షపు నీటి సంరక్షణ ప్రాంతమైన బాబూజీ వనాన్ని సిఎం సందర్శించారు. హార్ట్‌ఫుల్‌నెస్ గోపీచంద్ ఇంటర్నేషనల్ ట్రైనింగ్ అకాడమీని, ప్రపంచ స్థాయి శిక్షణా కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు మాట్లాడుతూ...కన్హా శాంతి వనంలో ఆధ్యాత్మికత ఉట్టిపడే వాతావరణం ఉందన్నారు. విద్యా రంగంలో కొత్త ప్రమాణాలు పాటిస్తూ... హార్ట్‌ఫుల్‌నెస్ ఇంటర్నేషనల్ స్కూల్ చేపడుతున్న కార్యక్రమాలు బాగున్నాయన్నారు. కన్హా శాంతి వనం స్వర్గాన్ని తలపించేలా ఉందని, పర్యావరణాన్ని కాపాడుతూ శాంతి వనాన్ని తీర్చిదిద్దిన తీరు అద్భుతమని వ్యాఖ్యానించారు. రేపటి తరం నాయకులను తీర్చిదిద్దేలా హార్ట్‌ఫుల్‌నెస్ ఇంటర్నెషనల్ స్కూల్ నడుపుతున్నారని సిఎం ప్రశంసించారు. ఎపి ముఖ్యమంత్రి శాంతివనాన్ని సందర్శించడం సంతోషాన్నిస్తోందని శ్రీరామ చంద్ర మిషన్ ప్రెసిడెంట్ దాజీ అన్నారు. అలాగే విద్య, ఆరోగ్య సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ వంటి రంగాల్లో సేవలను అందిస్తున్నామని దాజీ తెలిపారు.

# విశిష్ట అతిథులు

>> మధ్య ధృఢమైన ఆర్థిక, వ్యూహాత్మక మైత్రీ బంధం, భాగసామ్యం కొనసాగుతున్నాయని బాహ్యప్రపంచానికి తేటతెల్లంచేసేందుకే వీరిరువురినీ గణతంత్ర వేడుకల విశిష్ట అతిథులుగా ఆహ్వానించాలని నిర్ణయించారు. కాగా ఈఏడాది గణతంత్ర దినోత్సవ వేడుకల విశిష్ట అతిథిగా ఇండోనేసియా అధ్యక్షుడు ప్రోబోవో సుబియాంటో హాజరయిన సంగతి తెలిసిందే.ఐరోపా కూటమితో భారత్ స్వేఛ్ఛా వాణిజ్య ఒప్పందంకోసం ఇటీవలే చర్చలు వేగవంతం అయ్యాయి. ఈయూ ట్రేడ్ కమిషనర్ మారోస్ సెఫ్కోవిక్ ఈనెల రెండోవారంలోనే భారత్‌లో పర్యటించనున్నారు. ఐరోపాలోని చౌకబారు వ్యవసాయ సంబంధిత ఉత్పత్తులు భారత్‌లోకి వస్తే స్వదేశీ ఉత్పత్తులకు విఘాతం కలుగుతుందని అంచనావేస్తోంది. ఈకారణంగానే కొంతమేర చర్చల్లో జాప్యం జరిగింది. అయితే ఇపుడు మళ్లీ వేగం పుంజుకున్నాయి. డెయిరీ ఉత్పత్తులు, ఆటోమొబైల్ రంగానికి సంబంధించి కార్బన్ ట్యాక్స్‌వంటివి కొన్నిఅడ్డంకులుగా మారుతున్నాయి. ఇపుడు వీరిద్దరు విశిష్ట అతిథులుగా హాజరయితే స్వేఛ్ఛా వాణిజ్య ఒప్పందం మరింత వేగంగా ఖరారవుతుందని ట్రేడ్ నిపుణులు భావిస్తున్నారు. ప్రతిఏటా నిర్వహించే గణతంత్ర వేడుకలకు విశిష్ట అతిథులుగా విభిన్న దేశాధినేతలను ఆహ్వానించడం సాంప్రదాయంగా వస్తోంది.

# అమరజీవి స్మృతివనం

>> ర్పించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఒక కులానికి చెందిన వ్యక్తి కాదు తెలుగు ప్రజల ఆస్తి. తెలుగుజాతి గుర్తింపు కోసం పోరాడి, జీవితాన్నే త్యాగం చేశారు. ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాటం చేసి ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నారు. 1952లో మద్రాస్‌లోని బులుసు సాంబమూర్తి ఇంట్లో నిరాహార దీక్ష ప్రారంభించారు. నమ్మిన సిద్ధాంతం కోసం పోరాడి ప్రాణత్యాగం చేశారు. పొట్టి శ్రీరాములు మృతితో తెలుగువాళ్లు బయటకు వచ్చి పోరాడారు. చివరికి తెలుగు వాళ్లకు రాష్ట్రం ఇస్తామని అప్పటి ప్రధాని ప్రకటించారు. అందుకే పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ చేసిన రోజును స్మరించుకుంటున్నాం. పొట్టి శ్రీరాములు జయంతి ఉత్సవాలను ఏడాదిపాటు జరుపుకుంటున్నాం. త్యాగంచేసిన వ్యక్తి కుటుంబసభ్యులను గౌరవించుకోవడం మన సంప్రదాయం. అమరావతిలో పొట్టి శ్రీరాములు స్మృతివనం ఏర్పాటుచేస్తున్నాం. 6.8 ఎకరాలు కేటాయించాం, 58 అడుగుల విగ్రహం ఏర్పాటు చేస్తున్నాం. ఆనాడు ఎన్టీఆర్ యూనివర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరుపెట్టారు. పొట్టి శ్రీరాములు ప్రాణాలువిడిచిన భవనాన్ని స్మారక కేంద్రంగా మారుస్తాం. ఆయన ఆత్మార్పణ దినాన్ని అధికారికంగా ప్రకటించాం."సంపద సృష్టించటానికి ఏకైక విధానం పిపిపి అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. గత ప్రభుత్వం తెచ్చిన 3 రాజధానులు విధానం మహాకుట్ర అని చంద్రబాబు దుయ్యబట్టారు. రాష్ట్ర రాజధాని ఏదీ అంటే చెప్పుకోలేని పరిస్థితి తెచ్చి అపహాస్యం చేశారని ఆక్షేపించారు. ఇవాళ ఏపీ రాజధాని అమరావతి అని గర్వంగా చెప్పుకుంటున్నామన్నారు. అమరావతిలో పొట్టిశ్రీరాములు స్మృతి వనం ఏర్పాటు చేస్తున్నట్లు సిఎం చంద్రబాబు వివరించారు. ఈ విగ్రహం స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైజ్‌గా నిలుస్తుందని స్పష్టం చేశారు. పొట్టి శ్రీరాములకు గుర్తింపు కోసం పోరాడిన ఏకైక పార్టీ తెలుగుదేశం అని తేల్చిచెప్పారు. పొట్టి శ్రీరాములు ప్రాణాలు వదిలిన భవనాన్ని అన్ని విధాలా పరిరక్షిస్తామని తెలిపారు. నెల్లూరులో పొట్టిశ్రీరాములు పుట్టిన ఇంటిని ఓ మెమోరియల్‌గా తీర్చిదిద్దుతామని సీఎం ప్రకటించారు. ఇంటికో పారిశ్రామికవేత్త నినాదాన్ని ఆర్యవైశ్యులు అందిపుచ్చుకోవాలన్నారు. అలాగే మూడు ప్రాంతాలను అభివృద్ధి చేసి తెలుగు జాతిని అగ్రస్థానంలో నిలబెడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. తెలుగు జాతిని నెంబర్1గా నిలబెట్టినప్పుడే పొట్టిశ్రీరాములుకు నిజమైన నివాళి అని గుర్తు చేశారు. మరో 22 ఏళ్లలో తెలుగుజాతి నెంబర్1గా నిలిచి తీరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**పొట్టి శ్రీరాములుకు గుర్తింపు ఇచ్చింది ఎన్టీఆర్..**

పొట్టిశ్రీరాములు త్యాగానికి గుర్తింపుఇచ్చినవ్యక్తి ఎన్టీఆర్. 1985లో తెలుగువర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరు పెట్టారు. 2003,మార్చి 10న నెల్లూరు జిల్లాకు ఆయన పేరు పెట్టి కేంద్రానికి పంపాం. ఆ తర్వాతే కేంద్రం జిల్లా పేరును పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాగా నోటిఫై చేసింది. అలాగే చెన్నైలో ఆయన ఆత్మార్పణ చేసిన భవనాన్ని సంరక్షించాలని నిర్ణయించాం. భావితరాలకు గుర్తుండేలా దానిని మెమోరియల్ గా తీర్చిదిద్దుతాం. అలాగే ఆర్య వైశ్యుల సెంటిమెంట్‌ను కూటమి ప్రభుత్వం ఎప్పుడూ గౌరవిస్తుంది. ఆర్య వైశ్యుల కులదైవం వాసవీ కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నాం అన్నారు.

**మూడు రాజధానులు మహా కుట్ర..**

గత పాలకులు మూడు రాజధానుల పేరుతో మహా కుట్ర చేశారు. ప్రపంచమంతా మనల్ని అపహాస్యం చేశారు. మన రాష్ట్రం పేరు, రాజధాని పేరు కూడా చెప్పుకోలేని పరిస్థితి. కూటమి ప్రభుత్వం వచ్చాక మన రాజధాని అమరావతి అని గర్వంగా చెప్పగలుగుతున్నాం. అభివృద్ధి వికేంద్రీకరణ చేసి తెలుగు జాతిని ముందుకు తీసుకెళ్తున్నాం. అమరావతిని ప్రపంచం మెచ్చే నగరంగా తయారుచేస్తున్నాం. తిరుపతి, విశాఖలను మేటి నగరాలుగా తీర్చిదిద్దుతాం. ఇటీవల ఆర్బీఐ ఇచ్చిన నివేదిక ప్రకారం ఫలాలు, చేపలు పండించే ప్రాంతంగా ఏపీ అగ్రస్థానంలో నిలిచింది. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు, పరిశ్రమలు తరలి వస్తున్నాయి. 18 నెలల్లోనే రూ.21 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామని సీఎం చంద్రబాబు తెలిపారు. ప్రజల్ని మభ్య పెట్టేందుకు మెడికల్ కాలేజీల అంశాన్ని కొందరు రాజకీయం చేస్తున్నారు. మెరుగైన చదువు, సేవలు కావాలంటే పిపిపినే సరైన విధానమని పార్లమెంటరీ కమిటీ స్పష్టం చేసింది. పిపిపి విధానంలోనే రహదారులు, ఎయిర్ పోర్టులు వంటి సదుపాయాలు అందరికీ అందుబాటులోకి వచ్చాయి. ఇప్పుడు పి4 తెచ్చాం. 2047 నాటికి ప్రపంచంలోనే తెలుగు జాతిని అగ్రస్థానంలో నిలబెట్టాలన్నదే తమ లక్ష్యమని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# మాన్సాస్ ఎడ్యుసిటీ

>> ఎదుర్కొంటోంది. ఏటా కేవలం 8వేల మంది ఏరోస్పేస్ ఇంజనీర్లు మాత్రమే పట్టభద్రులవుతున్నారు. ఈ నైపుణ్యాల కొరతను అధిగమించే లక్ష్యంతో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో 160 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఎడ్యుసిటీని నిర్మించ నున్నారు. ఇది ఏవియేషన్, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలకు అంకితమైన దేశంలోని మొట్టమొదటి సమీకృత విద్యా, ఆవిష్కరణల కేంద్రంగా (ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ అండ్ ఇన్నోవేషన్ హబ్) నిలవనుంది. ఇందులో ప్రపంచ ప్రఖ్యాత యూనివర్సిటీల బ్రాంచ్‌క్యాంపస్‌లు, పరిశోధన కేంద్రాలు, స్టార్టప్‌ల కోసం ఇంక్యుబేషన్ సదుపాయాలు ఏర్పాటు చేయనున్నారు. మేకిన్ ఇండియా, జాతీయ విద్యా విధానం వంటి లక్ష్యాలకు అనుగుణంగా ఈ ప్రాజెక్టును తీర్చిదిద్దనున్నారు.

# తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్మరణీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు: వైఎస్ జగన్

**విజయవాడ, డిసెంబరు 15,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్మరణీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని వైఎస్.జగన్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. నేడు ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుకు ప్రాణత్యాగం చేసిన మహనీయుడు.. అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకొని వైఎస్.జగన్ నివాళులర్పించారు. "తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీక శ్రీ పొట్టి శ్రీరాములు. తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి, ప్రాణాలర్పించిన అమరజీవి, తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్మరణీయుడు. నేడు పొట్టి శ్రీరాములు గారి వర్ధంతి సందర్భంగా నివాళులు" అని వైఎస్.జగన్ ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు.

# దేవుడికి విశ్రాంతి ఇవ్వరా?

>> సాగించాలని, దేవుడికి విశ్రాంతి వేళలు ఉంటాయని కానీ ఆసమయంలోనూ ప్రత్యేక పూజలు కొనసాగిస్తున్నారని వారు ఆరోపించారు. విచారణజరిపిన చీఫ్‌జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఆలయ అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేసింది. దేవతలకు విశ్రాంతినివ్వకుండాప్రత్యేక పూజలుచేయాల్సి అవసరం ఏమిటని చీఫ్‌జస్టిస్ దర్మాసనం ప్రశ్నించింది. ఆలయ నియమాలు, సాంప్రదాయాలు, వేళలను కచ్చితంగా పాటించాల్సిందేనని ఆలయ అధికారులను ఆదేశించింది. ఆలయ నిర్వాణ కమిటీతో సహా సంబంధిత పార్టీలకు నోటీసులు ఇవ్వాలని దర్యాప్తుకమిటీని సుప్రీం బెంచ్ ఆదేశాలు జారీచేసింది. ఆలయ నిర్వహణ ఖమిటీ యుపి ప్రభుత్వానికి కూడా సుప్రీం నోటీసులు జారీచేసి వివరణ ఇవ్వాలని ఆదేశించింది.

# వచ్చే రోజుల్లో హెల్త్ డేటాతో ఎఐ అనుసంధానం

## డిజిటలైజేషన్‌లో ఎపి ముందంజ

## రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ వెల్లడి

**విజయవాడ, డిసెంబరు 15 ప్రభాతవార్త ప్రతినిధి:** వైద్య ఆరోగ్య శాఖ వద్ద ఉన్న హెల్త్ డేటా ఆధారంగా కృత్రిమ మేధ (ఎఐ)ను అనుసంధానం చేయబోతున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ వెల్లడించారు. తద్వారా ప్రజలు, రోగులకు ప్రివెంటివ్ కేర్, ప్రిడిక్టివ్ ఎనాలిస్, ఆయా ప్రాంతాల్లో రోగాల తీవ్రతను అంచనా వేసేందుకు, వైద్య సేవలు మెరుగుపరచడం సులువు అవుతుందని తెలిపారు. విజయవాడలో సోమవారం రీజినల్ మల్టీ స్టేక్ హోల్డర్స్ కన్వర్జన్స్ వర్క్ షాప్ అన్ నేషనల్ ఏఐ స్ట్రాటజీ ఫర్ హెల్త్ (ఎన్ఎఐఎస్ హెచ్) అంశంపై ఒకరోజు కార్యశాల జరిగింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఐసిఎంఆర్, కేంద్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహించిన ఈ సదస్సులో తమిళనాడు, తెలంగాణ, కేరళ, కర్ణాటక, ఒడిశా, చత్తీస్‌గఢ్, అండమాన్ నికోబార్, లక్షద్వీప్ నుంచి వైద్య ఆరోగ్య, ఐటీ శాఖల ముఖ్య అధికారులు పాల్గొన్నారు. కార్యశాలలో చర్చించిన వివరాలను వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ చక్రధరరావు, రాష్ట్ర వైద్య మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఎండీ గిరిశా, ఆయుష్ కమిషనర్ దినేష్ కుమార్, ఆర్టీజీఎస్ అడిషనల్ సీఈఓ శౌర్యమన్ పటేల్ విలేకర్ల సమావేశంలో మాట్లాడారు.

**ఫిబ్రవరిలో జాతీయ స్థాయిలో ఏఐపై ముసాయిదా ఖరారు**

ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఆదేశాల మేరకు ఆరోగ్య సేవల్లో డిజిటలైజేషన్‌లో తీసుకున్న చర్యలవల్ల ఎపి ముందంజలో ఉందన్నారు. అలాగే సిఎం చంద్రబాబు సంకల్పం మేరకు ఎమర్జింగ్ టెక్నాలజీ (ఏఐ/ఎంఎల్/ ఎల్ఎల్ఎం)లో ఎపి ముందు ఉండాలనే లక్ష్యంతో వైద్య ఆరోగ్య శాఖ తరఫున తాము అవసరమైన చర్యలు తీసుకోబోతున్నామని తెలిపారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం ఎఐ వినియోగంలో జాతీయ స్థాయిలో ఓ ముసాయిదా (డ్రాఫ్ట్)ను తయారు చేసేందుకు దేశ వ్యాప్తంగా జోనల్ స్థాయిల్లో కార్యశాలలు (సదస్సులు) నిర్వహిస్తుందని తెలిపారు. వచ్చే ఫిబ్రవరిలో ఇండియా ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ ద్వారా డ్రాఫ్ట్ ఖరారు అవుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఖరారుచేసే డ్రాఫ్ట్ ఆధారంగా రాష్ట్రాల స్థాయిలో విడిగా ఆరోగ్య రంగంలో ఏఐ అమలు వ్యూహాన్ని ఖరారు చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే అమల్లో ఉన్న డేటా ఆధారిత సేవలను కూడా కేంద్రం పరిగణనలోనికి తీసుకుని జాతీయ స్థాయిలో ఏఐ వినియోగం ఎలా ఉండాలన్న దానిపై ముసాయిదా తయారు అవుతుందని తెలిపారు.

**వాట్సప్ గవర్నెన్స్ అనుసంధానం**

ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఖాతాలను వ్యక్తిగతంగా తెలుసుకోవడానికి, జనరేట్ చేసుకోవడంపై మనమిత్ర (వాట్సప్ గవర్నెన్స్) లో అనుసంధానం చేయబోతున్నామని పేర్కొన్నారు. ఎమర్జింగ్ టెక్నాలజీ వినియోగించి కంటిన్యూస్ కేర్ 'సంజీవిని' ద్వారా ప్రజలు, రోగులకు సేవలు అందించబోతున్నట్లు చెప్పారు. ఇప్పటికే సంజీవిని కింద రోగులకు కుప్పం నియోజకవర్గంలో సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే కుప్పంలో అవుట్ బౌండ్ కాల్ సెంటర్ ద్వారా రోగులకు నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలి, వైద్యులను ఎక్కడ కలవాలన్న దానిపై వ్యక్తిగతంగా సంజీవిని ద్వారా సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఆర్టీఐహెచ్ (రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్)లో హెల్త్ టెక్ ఇన్నోవేషన్ ఛాలెంజ్2025 ద్వారా టెక్నాలజీని వివిధ పద్ధతుల్లో అవసరమైనచోట్ల వినియోగించేందుకు 297 అప్లికేషన్లు వచ్చాయని తెలిపారు. వీటిని పరిశీలిస్తున్నామన్నారు.

**డెత్ అలర్ట్ ద్వారా ఎప్పటికప్పుడు వివరాల సేకరణ**

తురకపాలెంలో మెలియోడయోసిస్ వ్యాప్తి, జరిగిన మరణాలపై జిల్లా స్థాయిలో సమాచారం ఉన్నా రాష్ట్ర స్థాయికి చేరుకోవడంలో జరిగిన జాప్యం పునరావృతం కాకుండా ఉండేందుకు ఆన్‌లైన్‌లో డెత్ అలర్ట్ విధానాన్ని ప్రవేశపెట్టినట్లు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ తెలిపారు.

స్క్రబ్ టైఫస్ జ్వరాల కేసుల గుర్తింపునకు ఆర్టీజీఎస్ అవేర్‌తో అనుసంధానంచేస్తూ డిసీజ్ సర్వైలెన్స్, ర్యాపిడ్ రెస్పాన్స్ టీంల ద్వారా అవసరమైన చర్యలు, ఈ వ్యాధి మూలాలు తెలుసుకునేందుకు వైద్యరంగ నిపుణులతో చర్చించామని పేర్కొన్నారు. నమూనాలను జీనోమ్ సీక్వెన్సింగ్ చేయడం ద్వారా మూలాలపై పూర్తి సమాచారం వెలుగులోనికి వస్తుందని తెలిపారు. ఆరోగ్య సేవలో ఎఐ వినియోగంపై సదస్సులో వివరించిర కార్తీక్ అడపాడబ్ల్యూహెచ్ రీజినల్ అడ్వయిజర్ కార్తీక్ అడపా ఐఎఎస్ సదస్సులో మాట్లాడుతూ ఆరోగ్య సేవల్లో ఏఐను అనుసంధానం చేస్తే జరగబోయే సానుకూల పరిణామాల గురించి సభికులకు వివరించారు. వారి నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. భవిష్యత్తు మొత్తం ఏఐదేనని పేర్కొన్నారు.

## వారం - వర్జ్యం

16-12-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మార్గశిరమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, కృష్ణపక్షం
ద్వాదశి రా.11.57
స్వాతి మ.2.09, మూల కార్తె
వర్జ్యం : రా.8.27-10.16
దు.ఉ.8.43-9.28, 2) రా.10.05-10.50
శుభసమయం : లేదు
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** వచ్చిన ఒక సదవకాశమును సద్వినియోగ పరుచుకోగలిగితే మేలు జరుగుతుంది.మిత్రుల కలయిక.

**వృషభం:** విధుల నిర్వహణలో గానీ, వ్యాపారములలో గానీ, మంచి మార్పులు చోటుచేసుకుంటాయి. ప్రయాణాలు లాభిస్తాయి.

**మిథునం:** రాజకీయములు, సంఘములు, యూనియన్లు మొదలగు కార్యములకు అనుకూలం.కాంట్రాక్టులు లభిస్తాయి.

**కర్కాటకం :** బంధువులతో కుటుంబ సభ్యులతో కలిసి దేవాలయ సందర్శన చేస్తారు. ఆర్థికంగా మెరుగుపడుతుంది.

**సింహం:** మీరు చేపట్టే కార్యక్రమములకు చిన్న, చిన్న ఆటంకములు, ఎదురు అవుతాయి. వాహనయోగం కలదు.

**కన్య :** మీ అభిప్రాయములను కొన్ని సలహాలను ఉన్నతాధికారులు సైతం పాటించడం మీకు సంతృప్తిని కలిగిస్తుంది.

**తుల :** గతములో మీరు పోగుట్టుకున్న ఉద్యోగమును తిరిగి పొందగలుగుతారు. ఆస్తి విషయంలో ఒప్పందాలు కుదురుతాయి.

**వృశ్చికం:** మీ అధికార పరిధి, ఆర్థిక స్థితిగతులు మంచి ఫలితములనిస్తాయి. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**ధనుస్సు:** చిన్ననాటి స్నేహితులను, తండ్రి సమకాలికులను కలుసుకోనుట జరుగుతుంది.స్వల్ప ధనలాభం పొందుతారు.

**మకరం:** అవకాశము ఉండీ సమాచారము అందని లోపమువలన ఆత్మీయులకు సాయపడలేనందుకు విచారిస్తారు.

**కుంభం:** సహోదర వర్గముతో ఏకత్వమును సాధించు యత్నములు ఓ దశకు చేరుకుంటాయి. రాజకీయరంగాలలోని వారికి విదేశీ పర్యటనలు.

**మీనం :** ముఖ్యమైన కార్యక్రమముల చర్చలు, అమలు చేయు పనులు వాయిదా పడతాయి. సోదరుల కలయిక.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోరి, హైదరాబాద్

# హాస్టళ్లకు వెళ్లండి

>> ముందుగా రుచి చూడాలని,తర్వాత విద్యార్థులందరితో కలసి భోజనం చేయాలని మంత్రి స్పష్టంచేశారు.విద్యార్థుల సంరక్షణపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకంటామని మంత్రి హెచ్చరించారు.

**హాస్టళ్లను తరచూ సందర్శించండి**

ఏబిసిడబ్ల్యూఈవోలు,డిబిసిడబ్ల్యూఈవోలు,ఎంజేపి కన్వీనర్లు తరచూ తమ పరిధిలో ఉన్న హాస్టళ్లను, గురుకులాలను సందర్శించాలని మంత్రి సవిత ఆదేశించారు. హాస్టళ్లను ఉన్నతాధికారులు తరచూ సందర్శించడం వల్ల వార్డెన్లు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తారన్నారు. వార్డెన్లు రాత్రుళ్లు హాస్టళ్లలో ఉండేలా చర్యలు తీస్కోవాలని లేని వార్డన్లను ఉపేక్షించేంది లేదని విద్యార్థుల భద్రత ఎంతో ముఖ్యమని స్పష్టం చేశారు. జూమ్ కాన్ఫరెన్స్‌లో బిసి సంక్షేమ శాఖాధికారులు, అన్ని జిల్లాల ఏబిసిడబ్ల్యూఈవోలు, డిబిసిడబ్ల్యూ ఈవోలు, ఎంజేపి కన్వీనర్లు,ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

**పొట్టి శ్రీరాములుకు ఘన నివాళులు**

అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా సచివాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం ఉండాలనే దీక్ష చేపట్టి ఆత్మార్పణం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు.ఆయన వదిలిన ఊపిరే తెలుగు వారి శ్వాస అని అన్నారు.అమరజీవి పోరాట స్ఫూర్తి నేటి యువతకు ఎంతో ఆదర్శమని,ఆయన లక్ష్యసాధనకు అందరమూ కృషి చెద్దామిని మంత్రి సవిత పిలుపునిచ్చారు.

# పిపిపి మోడల్‌తో వైద్యంలో విప్లవం

>> తరగతికి, ప్రజలకు అందుబాటులో ఉన్న వనరులను తెలియజేయాలని కోరారు.

**కోటి సంతకాల సేకరణ ఓ మాయాజాలం**

వైఎస్సార్సీ 'కోటి సంతకాల సేకరణ' పేరుతో ప్రజలను మాయాజాలంలో మోసాడుతున్న విధానాన్ని మంత్రి అచ్చెన్నాయుడు ఘాటుగా విమర్శించారు. ఇలాంటి నాటకాలు పేద, మధ్యతరగతి ప్రజలను వంచించడమే కాక, వారి కష్టాలను రాజకీయ ప్రయోజనాలకు తిప్పే ప్రయత్నం మాత్రమే అని మంత్రి అన్నారు. కేవలం సంతకాల సేకరణతోనే గందరగోళం సృష్టించడం వైఎస్సార్సీకి వెన్నతో పెట్టిన విద్య అని ఎద్దేవా చేశారు. కేవలం రాజకీయ మాయాజాలం, ప్రజల కోసం నేరుగా ఉపయోగపడని వ్యర్థ ప్రయత్నమని ఆయన విమర్శించారు. కూటమి ప్రభుత్వం నిజమైన పనితో, ప్రజల శ్రేయస్సుకు, పేదవారి అభివృద్ధికి ముందడుగు వేస్తోంది, వైఎస్సార్సీ చేస్తున్న వ్యర్థ నాటకాలను ప్రజలు గమనించి, తిరస్కరించాలని పిలుపునిచ్చారు.

# బంధం పటిష్టం

>> పర్యటనలో వారు చూపించిన అభిమానం మరువలేనిదని ప్రధాని సోషల్‌మీడియాలోపోస్టుచేసారు. భారత్‌జోర్డాన్ సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లడంలో ప్రవాసభారతీయులు కూడా కీలకభూమిక పోషిస్తారన్నారు. రెండుదేశాలమధ్య నెలకొన్న ద్వైపాక్షిక సంబంధాలపై ప్రధాని జాఫర్ హసన్; దేశ రాజు కింగ్ అబ్దుల్లా2 ఇబిన్ అల్‌హుస్సేనీలతో కూడా చర్చలు జరిపి సమీక్షిస్తారు. ప్రవాసభారతీయ కుటుంబాలనుద్దేశించి కూడా మాట్లాడతారు. జోర్డాన్ పర్యటన ముగించుకున్న తర్వాత ఇథియోపియా, ఆ తర్వాత ఒమన్ దేశాలను కూడా పర్యటించే మోడీ తన పర్యటనలో మధ్యప్రాచ్యం, ఆఫ్రికా కూటమి దేశాలతో భారత్ దౌత్య,ఆర్థిక, సాంస్కృతిక సంబంధాలను బలోపేతంచేసుకునే దిశగా ఉంటాయని విదేశాంగశాఖ ప్రకటించింది. రెండుదేశాలమధ్య ద్వైపాక్షిక బంధం అనేది 1947 నుంచే కొనసాగుతోంది. పూర్తిస్థాయిలో సంబంధాలుమాత్రం 1950 నుంచి కొనసాగుతున్నాయి. మొట్టమొదటి పరస్పర సహకార ఒప్పందం 1947లోనే రెండుదేశాలమధ్య జరిగింది. 2018లో జోర్డాన్‌రాజు కింగ్ అబ్దుల్లా భారత్‌లోపర్యటించారు. 2015లో రాష్ట్రపతిహోదాలో ప్రణబ్‌ముఖర్జీ జోర్డాన్‌లోపర్యటించారు. 2018లో కూడా ప్రధానిమోడీ ఒకపర్యాయం ప్రకటించారు. తర్వాత 2020లో జాతీయభద్రతా సలహాదారు అజిత్ దోవల్ కూడా పర్యటనకువెళ్లారు.

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
కడప
: fb.com/vaartha Digital
Published from Kadapa, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
16-12-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 315 పేజీలు: 10+4 వెల: 6.50

మీ ఆర్థిక అవసరాల ఆశయసాధన
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

## దేవుడికి విశ్రాంతి ఇవ్వరా?

### పూజలకు బ్రేక్ లేదా?: 'సుప్రీం' ప్రశ్న



**న్యూఢిల్లీ, డిసెంబరు 15:** ఉత్తరప్రదేశ్‌లోని బృందావన్ ప్రాంతంలో ఉన్న ఒక ఆలయంలోని దర్శన వేళల్లో మార్పు కేసు విచారణలో సుప్రీంకోర్టు సీరియస్ వ్యాఖ్యలుచేసింది. బాంకే బిహారీజీ ఆలయంలో దర్శనవేళలు, పూజా విధానాల్లో మార్పులను సవాల్‌చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం భక్తులనుంచి డబ్బులు తీసుకుని ప్రత్యేక పూజలుచేయడంపై చీఫ్‌జస్టిస్ బెంచ్ అసహనం వ్యక్తంచేసింది. ఈ కేసులో దర్యాప్తునకు ఉన్నతస్థాయి ఆలయ నిర్వహణ కమిటీని నియమించింది.
బాంకే బిహారీజీ ఆలయ దర్శనవేళల్లోనే కాకుండా మతపరమైన పూజా విధానాల్లోనూ మార్పులుచేసారని పిటిషనర్ల న్యాయవాది శ్యామ్ దివాన్ న్యాయవాది తన్వి దూబే సుప్రీం ధర్మాసనానికి తెలిపారు. ఎన్నో ఏళ్లుగా వస్తున్న సాంప్రదాయం కొన

>>2

## పహల్గాం దాడి కేసు

## ఛార్జిషీటు దాఖలు చేసిన ఎన్ఐఎ

### 1597 పేజీల అభియోగపత్రం



**న్యూఢిల్లీ, డిసెంబరు 15:** పహల్గాం ఉగ్రదాడి కేసును దర్యాప్తుచేస్తున్న జాతీయ దర్యాప్తుసంస్థ ఎన్ఐఎ ఛార్జిషీటును దాఖలుచేసింది. గత ఏప్రిల్ 22వ తేదీ పహల్గాంను సందర్శించిన పర్యాటకులపై ముష్కరులు కర్కశంగా జరిపిన కాల్పుల్లో 26మందికిపైగా చనిపోయిన సంగతి తెలిసిందే. ఈకేసులో 1597 పేజీల అభియోగ పత్రాన్ని దాఖలుచేసింది. ఈ దాడివెనుక పాకిస్థాన్ కుట్ర, నిందితుల పాత్రలు సాక్ష్యాలను ఎన్ఐఎ తన అభియోగపత్రంలో వెల్లడించింది. పాక్ లష్కరేతోయిబా అనుబంధ సంస్థ ది రెసిస్టెన్స్ ఫ్రంట్ ఈ దాడికి కుట్రపన్ని అమలు చేసాయని ఎన్ఐఎ వెల్లడించింది. పాక్‌లోని సాజిద్ జాట్ అనే హ్యాండ్లర్

>>2

## రిపబ్లిక్ డేకు ఇద్దరు విశిష్ట అతిథులు

**న్యూఢిల్లీ డిసెంబరు 15:** వచ్చే ఏడాది గణతంత్ర వేడుకలకు విశిష్ట అతిథులుగా యూరోపియన్ యూనియన్ ప్రతినిధులను ఎన్డీయే ప్రభుత్వం ఎంపికచేసింది. యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాండర్‌లేయెన్, యూరోపియన్ మండలి అధ్యక్షుడు ఆంటోనియో కోస్టాలను ప్రత్యేక అతిథులుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. భారత్ గణతంత్ర వేడుకలకు తొలిసారిగా యూరోపియన్ యూనియన్‌కు చెందిన ఇద్దరు నేతలు హాజరవుతున్నారు. భారత్ ఐరోపా కూటమి మధ్య బలపడుతున్న వ్యూహాత్మక బంధాలకు నిదర్శనంగా భారత్ ఈనిర్ణయం తీసుకుంది. ఐరోపా కూటమితో స్వేచ్ఛాయుత వాణిజ్య ఒప్పందం సంప్రదింపులు జరుగుతున్న వేళ వీరిరాక మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది. భారత్ ఐరోపాల

>>2

## విశాఖలో జిఎంఆర్ మాన్సాస్ ఎడ్యుసిటీ

### 160 ఎకరాల్లో నిర్మాణం

**విజయవాడ,డిసెంబరు 15,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం కీలక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. దేశంలోనే తొలి ఏవియేషన్,ఏరోస్పేస్, డిఫెన్స్ ఎడ్యుకేషన్ సిటీని విజయనగరంజిల్లా భోగాపురంలో ఏర్పాటు చేయనుంది. జిఎంఆర్ మాన్సాస్ ఎడ్యుసిటీ పేరుతో రానున్న ఈ ప్రాజెక్టును రాష్ట్ర ఐటీ, విద్యాశాఖమంత్రి నారా లోకేశ్ రేపు విశాఖలోని రాడిసన్ బ్లూ రిసార్ట్‌లో లాంఛనంగా ప్రారంభించనున్నారు. దేశంలో విమానయానం, ఏరోస్పేస్, రక్షణ రంగాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఈ రంగాల మార్కెట్ విలువ 2034 నాటికి 57 బిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా. అయితే, ఈ వేగానికి తగ్గట్టుగా నైపుణ్యం కలిగిన మానవ వనరులు అందుబాటులో లేవు. దేశం ప్రస్తుతం పైలట్లు (1215), ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజనీర్లు, భద్రతా నిపుణుల కొరతను తీవ్రంగా

>>2



సోమవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో మంత్రి నారా లోకేష్ భేటీ దృశ్యం

# నైపుణ్య గణనకు సహకరించండి..

### కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరిన మంత్రి లోకేష్

### వివిధ ప్రాజెక్టులపై చర్చలు

**విజయవాడ,డిసెంబరు 15,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర రైల్వే, సమాచార, ప్రసార, ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖల మంత్రి అశ్వినీ వైష్టవ్‌తో రాష్ట్ర విద్య, ఐటీశాఖల మంత్రి లోకేష్ న్యూఢిల్లీలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు ప్రాజెక్టులపై చర్చించారు. రాష్ట్రంలో నైపుణ్య గణన కోసం అత్యాధునిక ఎఐ టెక్నాలజీతో రూపొందించిన నైపుణ్యం పోర్టల్ గురించి కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు వివరించారు. మంగళగిరిలో నిర్వహించిన పైలెట్ ప్రాజెక్ట్, అందులో ఎదుర్కొన్న సమస్యలు అధిగమించడానికి ఎఐ ఆధారిత ఇంటర్వ్యూ

>>2

**కేంద్రమంత్రి జయంత్ చౌదరితో మంత్రి లోకేష్ భేటీ** 2లో

# అమరావతిలో అమరజీవి స్మృతివనం

### 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్' పేరిట నిర్మాణం

### పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో తెలుగుజాతి ముందుకు

### అభివృద్ధి వికేంద్రీకరణతో మూడు ప్రాంతాల అభివృద్ధి

### శ్రీరాములు ఆత్మార్పణ దినం కార్యక్రమంలో సిఎం చంద్రబాబు



సోమవారం విజయవాడలో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహంవద్ద నివాళులు అర్పిస్తున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ,డిసెంబరు 15,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగుజాతి గుర్తింపు కోసం పోరాడి ప్రాణత్యాగం చేసిన ఏకైక నాయకుడు పొట్టిశ్రీరాములు అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఆయన జీవితం భవిష్యత్తు తరాలకు తెలియాలన్నారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన తర్వాత తెలుగుజాతి గుర్తింపు కోసం పోరాడిన మహనీయులని కొనియడారు. పొట్టిశ్రీరాములు ప్రాణత్యాగం తర్వాత తలెత్తిన ఉద్యమం చూసి విధిలేని పరిస్థితుల్లో నాటి ప్రధాని నెహ్రూ ప్రత్యేక రాష్ట్రం ప్రకటించారని చంద్రబాబు గుర్తు చేశారు. 2026 మార్చి 16 పొట్టిశ్రీరాములు శతజయంతి ఉత్సవాలు ఘనంగా జరుపుకుందామని ప్రకటించారు. పొట్టిశ్రీరాములు త్యాగం స్ఫూర్తి శాశ్వతంగా ఉండాలనే కుటుంబ సభ్యుల్ని గౌరవించుకుంటున్నామని తెలిపారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో పొట్టిశ్రీరాములు ఆత్మార్పణ దినం కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. అనంతరం అమరజీవి జీవిత విశేషాలను వివరిస్తూ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌తిలకించారు. పొట్టి శ్రీరాములువిగ్రహానికి పూలమాలవేసి చంద్రబాబు నివాళుల

>>2



# పిపిపి మోడల్‌తో వైద్యంలో విప్లవం

- దాదాపు 2 వేలకు పెరగనున్న మెడికల్ సీట్లు
- పేద, మధ్యతరగతికి 850 సీట్లు కేటాయింపు
- ఒక్క రూపాయి ఖర్చు చేయని జగన్ ప్రభుత్వం
- గత ఐదేళ్లలో వ్యయం చేసిన మొత్తం కేంద్ర నిధులే: మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ డిసెంబరు 15,ప్రభాతవార్తప్రతినిధి:** పిపిపి (పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్) మోడల్ ద్వారా వైద్య విద్యలో విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రకటించారు. కూటమి ప్రభుత్వం తీసుకువస్తున్న ఈ విధానం పేద ప్రజలకు, మధ్య తరగతి విద్యార్థులకు అనుకూలంగాఉండేలా రూపుదిద్దబడిందని ఆయన అన్నారు. వైఎస్సార్‌సి ధర్నా పేరుతో మాయాజాలం చేసేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ, ఈ పార్టీ గత ఐదు ఏళ్లలో రాష్ట్రాన్ని 20 ఏళ్ల వెనుకకి తానీడిచి, ప్రజలను నిర్లక్ష్యానికి వదిలేసిందని, కేవలం 11 సీట్లు మాత్రమే ప్రజలు ఇచ్చారని మంత్రి అచ్చెన్నాయుడు గుర్తు చేశారు. జగన్ మోహన్ రెడ్డి పులివెందుల ఎమ్మెల్యేగా మిగిలిపోయి, అసెంబ్లీకి రాకుండా చరిత్రలో నిలిచిపోతున్నారని, ఇలాంటి పార్టీకి ప్రజా ఉద్యమాలు చేసే అర్హత లేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం తీసుకువస్తున్న పిపిపి మోడల్ ద్వారా మెడికల్ కాలేజీల నిర్మాణం కేవలం 2 సంవత్సరాల్లో పూర్తవుతుందని, గతంలో అదేపనికి 20 యేళ్ల పడుతుందని వివరించారు. పిపిపి విధానం ద్వారా మొత్తం మెడికల్ సీట్లు 500 నుంచి 1700-2000కి పెరుగుతాయని, ప్రత్యేకంగా పేద, మధ్యతరగతి విద్యార్థుల కోసం 850 సీట్లు కేటాయింపుగా ఉంటాయని చెప్పారు. అదనంగా 220 సీట్లు ప్రభుత్వ కోటాలో 110 సీట్లు పెరుగుతాయని,పిపిపి ఆసుపత్రుల్లో అంతర్జాతీయ స్థాయి వసతులు, హైక్వాలిటీ సిబ్బంది, సూపర్ స్పెషాలిటీ డాక్టర్లు అందుబాటులో ఉంటారని, యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా ప్రజలకు ఉచిత వైద్యం అందిస్తామని ఆయన స్పష్టం చేశారు.

**వైఎస్సార్‌సి పాలనలో వైఫల్యాలు..**
గత ఐదేళ్లలో వైఎస్సార్‌సి పాలనలో మెడికల్ రంగంలో చేసిన విఫలతలనుకూడా మంత్రి అచ్చెన్నాయుడు ఎత్తిచూపారు. ఈ సమయంలో ఖర్చు చేసిన రూ. 1550 కోట్లు కేవలం కేంద్ర నిధులే, రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని, 18 శాతమే కాలేజీలు నిర్మాణంలో పూర్తయిందని తెలిపారు. జగన్ ప్రారంభించిన ఐదు కాలేజీలను నేషనల్ కౌన్సిల్ పాఠశాల స్థాయిలో నిర్మాణం అని గుర్తించి సీట్లు తగ్గించిందని, కోవిడ్ సమయంలో ఎమ్మెల్యేలు, మంత్రులు రాష్ట్రంలో లేరని, పేదవారు ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీస మౌలిక వసతులు కూడా పొందలేకపోయారని, ప్రజలకు కఠిన పరిస్థితులు ఎదురయ్యాయన్నారు.

**ప్రజలకు భవిష్యత్ లాభాలు..**
మహిళలు, పిల్లలు, పేదవారికి మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో, కూటమి ప్రభుత్వం పిపిపి మోడల్‌ద్వారా 2 సంవత్సరాల్లో మెడికల్ కాలేజీలు పూర్తిచేయగలుగుతుందని, మొత్తం సీట్లు 1700-2000కి పెరుగుతాయని, పేదవారికి ప్రత్యేకంగా 850 సీట్లు కేటాయించబడుతాయని, ఆసుపత్రుల్లో 1500 బెడ్స్ వరకు విస్తరణ జరుగుతుందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. వైఎస్సార్సీ చేసే నాటకాన్ని ప్రజలు తెలుసుకోవా లన్నారు. పిపిపి మోడల్ ద్వారా పేదలకు, మధ్య

>>2



సోమవారం అమ్మాన్‌లో జోర్డాన్‌రాజు కింగ్ అబ్దుల్లా ఇబిన్ అల్‌హుస్సేన్‌తో భేటీ అయిన ప్రధాని నమోడీ

# బంధం పటిష్టం

### అమ్మాన్‌లో ప్రధాని మోడీకి ఘనస్వాగతం

### జోర్డాన్ రాజు అబ్దుల్లా హుస్సేన్‌తో భేటీ

**అమ్మాన్, డిసెంబరు 15:** మూడుదేశాల పర్యటనకు బయలుదేరిన ప్రధాని నరేంద్రమోడీకి మొదటి పర్యటన జోర్డాన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అపూర్వస్వాగతం లభించింది. అమ్మాన్ ఎయిర్‌పోర్టులో జోర్డాన్‌ప్రధాని జాఫర్ హసన్ మోడీకి సాదరస్వాగతం పలికారు. భారత్ జోర్డాన్‌ల మధ్య దౌత్యసంబంధాలు 75 సంవత్సరాలు పూర్తిచేసుకున్న తరుణంలో ప్రధానిమోడీ పర్యటన ప్రాధాన్యతను సంతరించుకుంది. 75 వసంతాల రెండు దేశాల దౌత్యబంధం మరింత బలపడుతుందని, వ్యూహాత్మక భాగస్వామ్యంతో పాటు ఇరుదేశాల మధ్య వాణిజ్యం మరింత పెరుగుతుందనే తాను విశ్వసిస్తున్నట్లు ప్రధాని ఈసందర్భంగా పేర్కొన్నారు. జోర్డాన్‌రాజు కింగ్ అబ్దుల్లా ఇబిన్ అల్ హుస్సేన్ ఆహ్వానంమేరకు జోర్డాన్‌లో పర్యటిస్తున్న ప్రధానిమోడీ సోమవారం జోర్డాన్ రాజును కూడా మర్యాదపూర్వకంగా కలిసారు. భారతీయ సంతతికి చెందిన కుటుంబాలు ప్రధానికి ఘనస్వాగతం పలికారు.
ప్రధాని బసచేసిన హోటల్‌వద్దకు చేరిన వీరంతా భారత పతాకాలను చేతబట్టి మోడీ మోడీ అంటూ నినాదాలుచేసారు. భారత్‌జోర్డాన్‌ల మధ్య దౌత్య సాంస్కృతిక సంబంధాలను బలపడటానికి ప్రవాస భారతీయులేమూలం అని జోర్డాన్

>>2

# కొరికేస్తున్న చలి!

### అరకులో అతి తక్కువగా 4.4°

**విజయవాడ, డిసెంబరు 15, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రజలను చలి గజగజలాడిస్తోంది. రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. కోస్తాంధ్ర, యానంలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 1.6 నుంచి 3 డిగ్రీలు తక్కువగా నమోదవుతున్నాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో తీవ్రత ఎక్కువగా ఉంది. చిన్నరులు,వృద్ధులు,దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రానున్న మూడు రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా కనిష్ట ఉష్ణోగ్రతలు 2 నుంచి 4 డిగ్రీలు తగ్గే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. గత రాత్రి రాష్ట్రంలోనే అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులో కనిష్ట ఉష్ణోగ్రత 4.4 డిగ్రీలుగా నమోదైంది. డుంబ్రిగుడలో 5.1, జి.మాడుగులలో 5.5., ముంచంగటిపుట్టులో 6,హుకుంపేటలో 7.3,చింతపల్లిలో 7.5,పాడేరులో 8.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అల్లూరి సీతారామరాజు శ్రీసత్యసాయి అన్నమయ్య,అనంతపురం చిత్తూరు, పార్వతీపురం, మన్యం,నంద్యాల,కర్నూలు జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు 12 డిగ్రీలలోపే ఉంటున్నాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు కురుస్తుండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విజయవాడ- హైదారాబాద్ నడుమ 65వ జాతీయ రహదారి,ఎన్‌హెచ్- 15 దట్టంగా పొగమంచు ఉంటుంది. విజయవాడతో సహా ఎన్టీఆర్ జిల్లా అత్యల్ప ఉష్ణోగ్రతలుంటున్నాయి.9-11 నడుమ ఇవి ఉంటున్నాయంటున్నారు.



# హాస్టళ్లకు వెళ్లండి

### ఉన్నతాధికారులకు మంత్రి సబిత ఆదేశం

### విద్యార్థుల ఆరోగ్య భద్రత ముఖ్యం

### టెన్త్, ఇంటర్‌లో 100% ఫలితాలు వచ్చేట్లు చూడాలి

**సచివాలయం, డిసెంబరు15,ప్రభాతవార్త :** రాబోయే టెన్త్,ఇంటర్ పరీక్షల్లో వందశాతం ఫలితాలు రాబట్టాలని, ఇందుకోసం ఇప్పటినుంచే విద్యార్థులను సమాయాత్తం చేయాలని రాష్ట్ర బిసి, ఈడబ్ల్యుఎస్ సంక్షేమ, చేనేత,జౌళీ శాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. ఫలితాలతోపాటు విద్యార్థుల ఆరోగ్యం, సంరక్షణ ఎంతో ముఖ్యమన్నారు. విద్యార్థుల సంరక్షణపై నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత హాస్టల్ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఎబిసిడబ్ల్యూ ఈవోలు, డిబిసిడబ్ల్యూ ఈవోలు, ఎంజేపి కన్వీనర్లు,ప్రిన్సిపాళ్లతో రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణ,డైరెక్టర్ మల్లికార్జున,ఎంజేపి కార్యదర్శి మాధవీలతతో కలసి మంత్రి సవిత జూమ్ కాన ఫ్రరెన్స్ నిర్వహించారు. రాబోయే టెన్త్,ఇంటర్ పరీక్షల నేపథ్యంలో జిల్లాల వారీగా ఆయాన హాస్టళ్లు, ఎంజేపి గురుకులాల్లో తీసుకుంటున్న చర్యలగురించి మంత్రి అడిగి తెలుసుకున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి,వారిపై ప్రత్యేకశ్రద్ధ సారించాలన్నారు.

**విద్యార్థుల ఆరోగ్యం,భద్రత ఎంతో ముఖ్యం**
ప్రస్తుతం రోజు రోజుకూ పెరుగుతున్న చలి తీవ్రతను దృష్టిలోపెట్టుకొని విద్యార్థులకు తాజా,వేడి ఆహారం, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే ఇవ్వాలన్నారు. విశ్రాంత,తరగతి గదుల్లో దోమలు చొరబడకుండా ద్వారాలు,కిటికీలదగ్గర దోమతెరలు వాడాలన్నారు. వార్డెన్లు హాస్టల్లో భోజనాన్ని

>>2



సోమవారం కన్హాశాంతి వనాన్ని సందర్శిస్తున్న సిఎం చంద్రబాబునాయుడు, పక్కన రామచంద్ర మిషన్ అధ్యక్షుడు కమలేష్ డి పటేల్

# ఆధ్యాత్మికత ద్వారా విశ్వ చైతన్యం

### హైదరాబాద్ శివారులోని కన్హాశాంతివనం సందర్శించిన సిఎం చంద్రబాబు

**విజయవాడ,డిసెంబరు 15.ప్రభాతవార్తప్రతినిధి:** రంగారెడ్డి జిల్లా చేగూరులోని కన్హా శాంతి వనాన్ని సిఎం చంద్రబాబు సోమవారం సందర్శించారు. వనానికి విచ్చేసిన ముఖ్యమంత్రికి శ్రీరామచంద్ర మిషన్ అధ్యక్షుడు కమలేష్ డి పటేల్ ఘన స్వాగతం పలికారు. శాంతి వనాన్ని సందర్శించిన తరువాత దాజీతో సిఎం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కన్హా శాంతి వనంలో హార్ట్ ఫుల్నెస్ సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను గురించి చర్చించారు. శాంతి వనంలో జరుగుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గురించి ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి, పర్యావరణం, వ్యవసాయం, ధ్యానం, యోగా శిక్షణపై చంద్రబాబుకు దాజీ వివిధ అంశాలను వివరించారు. ఎపిలో హార్ట్ ఫుల్నెస్ కార్యాలయం ఏర్పాటు చేయడంపై దాజీతో ముఖ్యమంత్రి సమాలోచనలు చేశారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో మొత్తం 1400 ఎకరాల్లో కన్హా శాంతి వనాన్ని శ్రీరామచంద్ర మిషన్ అభివృద్ధి చేసింది. ప్రపంచంలోనే అతిపెద్ద మెడిటేషన్ సెంటర్‌ను ఈ ఆశ్రమంలో ఉంది. 8 లక్షలకు పైగా వివిధ జాతుల వృక్షాలతో బయోడైవర్సిటీ కేంద్రంగా ఈ ఆశ్రమం పెద్దఎత్తున పర్యాటకుల్ని ఆకర్షిస్తోంది. కన్హా ధ్యానమందిరం అధ్యక్షులు దాజీతో

>>2

**'ఓటు చోరీ'పై రగడ..**
రాహుల్, ఖర్గే వెంటనే క్షమాపణ చెప్పాలన్న బిజెపి సభ్యులు

**కొలంబియాలో లోయలో పడిన బస్సు**
17 మంది విద్యార్థులు దుర్మరణం

**ఢిల్లీని కమ్మేసిన పొగమంచు** 5లో

వార్త

ఒక మంచి పని చేసి ఊరుకో! దాని బాగోగుల గురించి చర్చించుకోవలసింది ఇతరులు నీవు కాదు.

-పైథాగరస్

# విశ్వ 'దీపావళి'!

భారతీయుల సంస్కృతి, జీవన విధానంలో వేలాది సంవత్సరాలుగా దీపావళి వెలుగులు నింపుతోంది. తాజాగా అంతర్జాతీయంగా యునెస్కో వారసత్వ సంపద జాబితాలెక్కి మరింత ప్రపంచవ్యాప్త సొబగులందుకుంటోంది. యునెస్కో ఇన్‌టాంజిబుల్ కల్చరల్ హెరిటేజ్ జాబితాలో ఈ పండుగను చేర్చారు. ఢిల్లీలో నిర్వహించిన సమావేశంలో యునెస్కో తన నిర్ణయాన్ని ప్రకటించింది. దీపావళి అనగానే నరకాసుర వధ అనంతరం జనం కేరింతలతో ఆనందమైఉత్సాహంతో ఇంటింటా దీపాలను వెలిగించి చేసుకున్న సంబరం గుర్తొస్తుంది. పురాణ కథలు వింటుంటే అలనాడు త్రేతాయుగంలో శ్రీరామచంద్రుడు 'దీపావళి'ని జరుపుకున్నట్లు పౌరాణిక కథకులు చెప్తుంటారు. అమావాస్య నాటి చీకట్లను తొలగించుకుని జిలుగువెలుగులు విరజిమ్ముతూ జనాన్నిఆనంద డోలికల్లో ముంచెత్తేదే దీపావళి. ఇప్పటికే భారత్‌కు సంబంధించిన కళా సాంస్కృతిక వారసత్వ సంపదలో 10అంశాలకు యునెస్కో గుర్తింపు లభించింది. కోల్‌కతా దుర్గాపూజ, కుంభమేళా, యోగా, వేదపఠన సంప్రదాయం, గుజరాత్‌లోని గర్బా నృత్యం రామాయణ ఇతిహాసగాథను ప్రస్ఫుటింపచేసే రామ్‌లీలా సంప్రదాయ ప్రదర్శనలతోపాటు 16వ అంశంగా నవ్య దీపావళి స్థానం దక్కించుకుంది. ఈ సంప్రదాయాలన్నీ చిరకాలంభద్రంగా కాపాడుకోవాల్సిందే. తరతరాలకు అందించాల్సిందే. భారతీయత నుంచి విడ దీయలేని, విడదీయరాని పండుగ. భారత్‌లో తొలిసారి జరిగిన యునెస్కో ఇంటాంజిబుల్ కల్చరల్ హెరిటేజ్ సమావేశంలో 80 దేశాలు సమర్పించిన 67 నామినేషన్లను కమిటీ పరిశీలించింది. 'దీపావళి'ని ప్రస్తుతించిన ఈ సందర్భంలో ప్రధాని నరేంద్రమోడీ ఈ పండుగను,దానికి వచ్చిన విశేష గుర్తింపును భారతీయ సంస్కృతి, నైతిక విలువలకు దగ్గర సంబంధమున్న పండుగగా మరింత ప్రతిభావంతంగా జరుపుకునేవారసత్వ సంప్రదాయానికి వచ్చినట్లుగా కొనియాడారు. ఈ విధమైన గుర్తింపుతో ప్రపంచవ్యాప్తంగా ఈ పండుగకు మరింత ప్రజాదరణ పెరుగుతుందని అభిలషించారు.కాగా ఈ విషయాన్ని ఈ వేడుకను ప్రపంచానికి బలంగా తెలియచేయడానికి ప్రత్యేక దీపావళి వేడుకలను నిర్ణయించడానికి కేంద్ర ప్రభుత్వం సమాయత్తమవుతోంది.యునెస్కో గుర్తింపుతో 'దీపావళి' విశ్వవేదికకు ఆలంబనగా మిరుమెట్లు గొలుపుతోంది. దీపాలు వెలిగించి 'తిమిరం మీద సమరా'నికి సన్నద్ధమైనట్లు వెలుగులు విరజిమ్మేదే ఈ పండుగ. ఈ పండుగను లక్ష్మీదేవి మన ముంగిటకొచ్చినట్లుగా కూడా భావిస్తారు.అందుకే ఆ రోజున ప్రతి ఒక్కరూ ఉదయాన్నే తమ లోగిళ్లను శుభ్రపరుచుకొని రంగవల్లులు, ఫలపుష్పా లతో అలంకరించి దీపాలు వెలిగిస్తారు. మహిమాన్వితమైన లక్ష్మి పూజ చేసి ఆ దేవతను ఆహ్వానిస్తారు. అలాంటి పండుగలు సంపద వృద్ధికి,వెలుగుల సంవృద్ధికి ప్రతీకలుగా విరాజిల్లుతుంటాయి. ఇంతటి ఆధ్యాత్మిక భావనలతో పాటు లౌకికంగా కూడా ప్రాశస్త్యమున్నఈ పండుగను ఇతర దేశాల్లో ఉన్న మన వాళ్లంతా ఆచరించి తరిస్తారు.ఇప్పుడు ఆ పండుగకు యునెస్కో గుర్తింపుతో విశ్వభావన మొదలౌతుంది. ప్రతి భారతీయుడికి, దీపావళి అనేది లోతైన భావోద్వేగం.ఇది తరతరాలుగా అనుభూతి చెందుతోంది. జీవిస్తోంది. ఆస్వాదిస్తోంది అంటూ దీపావళిని యునెస్కో గుర్తింపుకు స్వీకరించినవేళ కేంద్ర సాంస్కృతిక శాఖమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ఎంతో భావోద్వేగంతో ప్రసంగించారు.ఈగుర్తింపు నేపథ్యంలో యునెస్కో పునరుద్ధరణ, శాంతి చెడుపై మంచి విజయం సాధించాలన్న మానసిక భావనను మానవాళి వాంఛను గౌరవిస్తోందని అన్నారు. దీపావళిని యునెస్కో వారసత్వం సంపద జాబితాలో చేర్చినందుకు పాకిస్థాన్ దౌత్యవేత్త షోయాజ్‌స ద్వారా భారత్‌ను అభినందించారు. ఇదే సమ యంలో బంగ్లాదేశ్ ప్రతిపాదన తంగైల్ సంప్రదాయ చీర నేత కళ, అఫ్ఘానిస్థాన్ నుంచి బెహజాద్ శైలిలో సూక్ష్మ చిత్రలేఖనాన్ని కూడా యునెస్కో జాబితాలో చేర్చారు. పురుషులు ప్రత్యేకించి చేసే అబా బిస్త్ తయారీ కళ. అభ్యాసాలను కూడా యునెస్కో స్వీకరించడం సర్వే సర్వత్రా అందరూ సంతోషించారు.ఇరాక్, జోర్డాన్, కువైట్ దేశాలకు చెందిన కొన్ని సాంస్కృతిక కళాంశాలకు కూడా భారత్‌వేదికగాయునెస్కో తన జాబితాలోకి తీసుకోవడం శోభస్కరమైన కార్యాచరణగా భావించారు.యునెస్కో అంతర ప్రభుత్వ కమిటీసమావేశానికి భారత్ ఆతిథ్యమివ్వడం అదే సభలో యునెస్కో నిర్ణయాలు ప్రకటించడం భారతీయ కళా జగతికి ప్రాణం పోసినట్లయింది. దీపావళిని యునెస్కో మానవజాతి అవ్యక్త సాంస్కృతిక వారసత్వ సంపదగా లిఖించడం సర్వమానవాళికి పాటించదగిన వేడుకలా కీర్తించబడడమే. ఎంతోమంది వ్యాపారస్తులు కొత్తఆర్థిక సంవత్సరాన్ని ప్రారంభించే ధనలక్ష్మీ పూజలకు పక్రమిస్తారు.నూతనవాణిజ్య దస్త్రాలను ప్రారంభిస్తారు. దీపావళి అనగానే మానవ కుటుంబ బంధాలను సామాజిక బంధాలను ఒకే వేదికపై తెచ్చే వేడుకగా భాసిల్లుతుంది. ఒక విధంగా అజ్ఞానాంధకారంలో మునిగిన ప్రపంచాన్ని దీపావళి శాసిస్తుందని వెలుగులు నింపుతుందని ఆశిస్తుంటారు. అందుకే టపాసుల వంటి బాణసంచాలతో దేశం యావత్తూ దేదీప్యమానంగా వెలిగిపోతుంది. దీపావళి గుర్తుగా వరుసగా దీపాలను వెలిగిస్తారు.చెడుపై మంచిని సాధించిన విజయానికి గుర్తుగా 'దీపావళి'పండుగ జరుపుకుంటారని, 'తమసోమా జ్యోతిర్గమయా' అనేవేదవాక్కు ఈ సందర్భంలో ప్రస్తావనార్హం. చీకటిలోంచి నన్ను వెలుగులోకి నడిపించు అనే ప్రగతి శీల దృక్పథాన్ని ప్రతిఫలించేదే దీపావళి.

> అతి సామాన్యమైన జీవితం గడపడానికి ఆసక్తి, అధికమైన ఆలోచనా శక్తి గొప్పవారి జీవిత సూత్రాలు.
>
> వి. జాన్సన్



> ఒక వ్యక్తి గుణగణాలు పరీక్షించి చూడాలంటే అతనికి అధికారం ఇచ్చి చూడాలి.
>
> అబ్రహాంలింకన్



## ప్రజావాక్కు



### ఆదిలాబాద్‌కు పర్యాటక బలం

**ఆధ్యాత్మికతకు,** ప్రకృతి సౌందర్యానికివిడదీయలేని సంబంధం ఉంది. ఆధ్యాత్మిక ప్రశాంతతను కోరుకునే భక్తులకు కొండలపై కొలువైన దేవాలయాలు ప్రత్యేకఆకర్షణగా నిలుస్తున్నాయి.ఆదిలాబాద్ జిల్లాలోని కైలాస్ టేకిడీ శివాలయం, బహరాంపూర్ వెంకటేశ్వర స్వామి ఆలయం ఇటువంటి ఆధ్యాత్మిక కేంద్రాలుగా వెలుగులోకి వస్తున్నాయి. సహజ వనరులతో నిండిన కొండ ప్రాంతాల్లో నెలకొన్న ఈఆలయాలు భక్తులను విశేషంగాఆకర్షిస్తున్నాయి. కైలాస్ టేకిడీ శివాలయం శివభక్తులకు పవిత్ర క్షేత్రంగా పేరు గాంచింది. కొండపైఉన్న ఈఆలయానికి చేరుకునే ప్రయాణం భక్తులకు ఒక ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తుంది. రవాణా, చిన్నవ్యాపారాలు, వసతి సదుపాయాలు వంటి రంగాలు అభివృద్ధి చెందుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక చైతన్యం రావడానికి ఇది దోహదపడుతోంది.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### చిన్నారులపై లైంగిక దాడులను అరికట్టాలి

**సమాజంలో** చిన్నారులు భవిష్యత్తు పౌరులు మాత్రమే కాదు, నేటి బాధ్యతగా కూడా భావించాలి. కానీ ఇటీవల చిన్నారులపై లైంగిక దాడులసంఖ్య ప్రమాదకరంగా పెరుగుతోంది.యునిసెఫ్‌నివేదిక ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా 53శాతంబాలికలు లైంగిక వేధింపులకు గురవు తుండగా, వాటిలో90శాతం దాడులు కుటుంబసభ్యులు లేదా పరిచయస్తులచే జరుగుతుండటం మన మానవత్వాన్ని కలవరపెడుతోంది.ఇలాంటి దాడులు పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని బాగా దెబ్బతీస్తున్నాయి.బాధితులు భయంతో మౌనంగా ఉంటూ జీవితాంతం ఆ గాయాలతోనే బతకాల్సిన పరిస్థితి ఎదురవుతోంది.

- కె.ఎల్. రామారావు, హైదరాబాద్

### గురుకులాల్లో ఎలుకలు?

**తెలంగాణ** రాష్ట్రంలో ఉన్న వివిధ గురుకులాల్లో ఎలుకల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలి. భోజన శాల, స్టోర్ రూమ్, వంట సామాగ్రి, ఆహార పదార్థాలనుపాడు చేయడం, విద్యార్థులు నిద్రపోతున్నప్పుడు కొరకడం వంటివి ఎక్కువగా జరుగుతున్నాయి. ఆరోగ్య శాఖకు సంబంధించిన అధికారులు ఎలుకల నివారణకు బోన్‌లు, మందులు పిచికారీ వంటి తగిన చర్యలు తీసుకోవాలి.

- రాపాక రవీందర్, జనగాం

### రసాయనాలను నియంత్రించాలి

**ఆధునిక** వ్యవసాయంలో అధికదిగుబడి కోసం రసాయన పురుగుమందుల వాడకం అనివార్యమైంది. అయినప్పటికీ, వీటి అశాస్త్రీయ వినియోగం మానవఆరోగ్యంపై, పర్యావరణంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతోంది. ఈ స్థితిలో, వీటి వాడకాన్ని నియంత్రించి,సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం అత్యవసరం.రసాయన శేషాలు పంటలలో నిలిచిపోయి, వాటిని తినే ప్రజల్లో క్యాన్సర్, నాడీ వ్యవస్థ లోపాలు, వంధ్యత్వం వంటి దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు దారితీస్తున్నాయి. సరైన రక్షణ లేకుండా మందులు కొట్టే రైతులకు ఊపిరితిత్తులు, చర్మ సంబంధిత రుగ్మతలు వస్తున్నాయని పరిశోధనలు నిరూపించాయి. అంతేకాక, ఈ మందులు పంటలకు మేలు చేసే తేనటీగలు వంటి స్నేహపూర్వక కీటకాలను నాశనం చేసి, పరాగ సంపర్కానికి అడ్డుకట్ట వేస్తున్నాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ముప్పైఐదు పాస్ మార్కులు!

**ఆంధ్రప్రదేశ్** రాష్ట్రంలో విద్యాశాఖలో విప్లవాత్మకమైన మార్పులు చేస్తూ ఉన్నారు.భారత ప్రధానిగా ముచ్చటగా మూడుసార్లు ఎన్నికైన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారు పరీక్ష పై చర్చ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు చదువు చెబుతున్న ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు విధిగా అత్యధిక సంఖ్యలో పాల్గొనమనివిజ్ఞప్తి చేస్తూఉన్నారు. ప్రచారం మాధ్యమాల ద్వారా కోరుతూ ఉన్నారు. మరీ ముఖ్యంగా విద్యాశాఖ అధికారులు విద్యార్థిని విద్యార్థులు అత్యధిక సంఖ్యలో పాల్గొనేలా చేయమని రిజిస్ట్రేషన్ చేయమని చెబుతూ ఉన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఇది జరుగుతూ ఉన్నది.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### భారతదేశ ఆస్తి యువతే

**తెలంగాణ** రాష్ట్రంలో ఈరోజు ప్రజాస్వామ్య పండుగ నడుస్తోంది. ఒకవైపు ఐడియాస్ ఫర్ ఇండియా సంస్థ భారత దేశంలో ప్రజాస్వామ్యం తిరోగమనంలో ఉంది అంటూ అంటున్న వేళా యువత రాజకీయాలను బాగా ప్రభావితం చేస్తున్నారు. మరో వైపు యువతే విధాన నిర్ణయాలు చేసే స్థాయికి చేరుకున్నారు. అయితే అన్నిరాష్ట్రాలలో ఇదేకదా జరిగేది అని మీకు అనుమానం రావొచ్చు. కలాం గారు అన్నట్టు భారత దేశ ఆస్తి ఈ యువతే కాబట్టి ఈ యువత ప్రోత్సహించాలి.

- భారత అవినాష్, జనగామ

**మనవి** | **ఎడిట్ పేజీకి..**

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# యాచక రహిత దేశంగా భారత్?

**పట్టణాలలో మెట్రోనగరాలలో యాచక వృత్తిలో వున్నవారిని గుర్తించి వారికి ఉపాధి, ఉద్యో గ అవకాశాల కల్పనకు దోహదపడే 'స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాలలో' శిక్షణ ఇవ్వాలి. యాచక వృత్తిలో వున్న పెద్దలు పనుల్లో ఉండేట్లు యాచక వృత్తిలో వున్న బాలలు బడుల్లో ఉండేట్లు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం యాచక వృత్తిలో వున్నవారికి ఉచిత విద్య, వైద్యం అందించాలి. అలాగే బాలలకు విద్యా హక్కుచట్టం వర్తింప చెయ్యాలి. ఇంటర్మీడియేట్ వరకు ఉచిత విద్య, వృత్తి విద్య అందించాలి. వారి సామాజిక, ఆర్థిక సాంస్కృతిక, వికాసానికి దోహద పడే వృత్తి విద్యా కోర్సుల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించాలి. ప్రభుత్వం అధికారులు మున్సిపాలిటీల పరిధిలో నగరాలలో మెట్రోనగరాల్లో పోలీస్ అధికారులు యాచకులు ఎక్కువగా కేంద్రీకృతమైన ప్రదేశాలను గుర్తించి యాచక వృత్తి నిషేధచట్టాల అమలు, వారి పునరావాసం కోసం 'నోడాల్ అధికారిని' నియమించి యాచకులు బెడదను అరికట్టాలి.**

నేదునూరి కనకయ్య

సమాజంలో ఆడుక్కోవడం (యాచక వృత్తి) సంప్రదాయమైంది. నాటి రాజుల కాలం నుండి నేటి ప్రజాస్వామ్య వ్యవస్థ వరకు కొనసాగుతూనే వుంది. ఆనాడు ధర్మంకోసం ప్రజా రక్షణ కోసం ఉండేది కానీ నేడు యాచక వృత్తివిధానాలు మారాయి. నేటి ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ నాయకులు ఎన్నికల వేళ డబ్బుల కొరకు'నోట్ దేవో వోట్ లేవో' నినాదంతో యాచక వృత్తి కొత్త రూపురేఖలు మార్చుకుంది.1956లో హైదరాబాద్ నగరం ఎ.పి. రాజధానిగా ఏర్పాటైన రోజుల్లో యాచక వృత్తి ప్రభుత్వం దృష్టికి వచ్చింది. యాచకరహిత నగరంగా ఏర్పడటానికి ప్రభుత్వం యాచకవృత్తి (భిక్షాటన)పై ఆధారపడి జీవిస్తున్న వారిపై సర్వే చేసింది. 1956లో ప్రభుత్వం హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలలోయాచక వృత్తిపై ఆధారపడిన వారి సాంఘిక 'సామాజిక ఆర్థిక' ఆరోగ్య స్థితిగతులపై ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్స్ సంస్థ చేత సర్వే చేయించింది.1956లో భిక్షాటన వృత్తిలో వున్న వారిసంఖ్య 5000మంది వుండగా 2016 నాటికి 25000కు పెరిగింది. గత 60ఏళ్ల హైదరాబాద్ జిహెచ్ఎమ్‌సి పరిధిలో యాచకుల సంఖ్యలో పెరుగుదల400 శాతం వుంటే ఇదే సమయంలో హైదరాబాద్ జనాభా వృదిరేటు 500 శాతం నమోదైంది. దాదాపు హైదరాబాద్లో పెరిగిన జనాభాతో సమానంగా భిక్షగాళ్ల(యాచకుల)సంఖ్య పెరిగింది. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్స్ సంస్థ చేసిన సర్వేలో పలు ఆసక్తికరమైన అంశాలు వెలుగులోకి వచ్చాయి. వ్యక్తులు భిక్షాటనను వృత్తిగా ఎంపిక చేసుకోవడానికి గల కారణాలలో అంగవైకల్యం 'వృద్ధాప్యం' పేదరికం నిరుద్యోగం బతుకు తెరువు కోసం గ్రామాల నుండి వలస వచ్చిన వారు గ్రామాలలో వడ్డీ వ్యాపారుల ఆర్థిక ఒత్తిడి అప్పుల భాధలు తట్టుకోలేని వారు హైదరబద్ వచ్చి భిక్షాటన వృత్తిని జీవనోపాధిగా ఎంచుకున్నారని తమ అధ్యయనంలో వెల్లడించింది. 2008లో హైదరాబాద్ కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ వెల్ఫేర్ స్వచ్ఛంధ సంస్థ జరిపిన సర్వే ప్రకారం హైదరాబాద్లో యాచకవృత్తిపై ఆధారపడినవారు 10466వరకు ఉన్నారని వారి వార్షికాదాయం రూ.15కోట్లవరకు ఉంటుందని అంచనా వేసింది. వీరి ఆదాయంలో ఎక్కువ భాగం ఆహారం,నివాసం, తాగుడు 'డ్రగ్స్' సినిమా మొన్నగువాటి మీద ఖర్చు చేస్తున్నారని సంస్థ జరిపిన సర్వేలో తేలింది. యాచకవృత్తిలో(భిక్షాటన వృత్తి) వున్న 82 శాతం సమాజంలోని ఎస్సీ,ఎస్టీ, బిసి వర్గాలకు చెందిన వారేనని స్వచ్ఛంధ సంస్థ జరిపిన సర్వేలో తేలింది.వాస్తవంగా యాచక వృత్తి లోవున్న వారు2 శాతం మాత్రమే మిగతా వారుఇతర వృత్తులు చేసుకునే శక్తి వుండి కూడా బద్ధకించో మాఫియాగా మారో ఈ వృత్తిపై స్థిరపడ్డారని సర్వేలో తేలింది. దేశం గణనీయమైన అభివృద్ధి జరిగిన యాచకవృత్తి ఒక సామాజిక సమస్యగా నిలిచింది. దేశంలో భిక్షాటన పేరు మీద పలు అక్రమ కార్యకలాపాలు చోటుచేసుకుంటున్నాయి. కొందరు అక్రమార్కులు భిక్షాటన చేస్తున్న పిల్లలకు మత్తు మందు ఇచ్చి అక్రమ రవాణా చేస్తున్నారని వారిపై నిషేధిత ఔషధాలు ప్రయోగిస్తున్నారని సామాజిక వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేశంలో ఉపాధి అవకాశం లేనివారు పొట్టకూటి కోసం భిక్షాటన చేస్తున్నారు.వర్ధమాన పేద దేశాలతో పాటు అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా యాచకుల సమస్య ఉంది. భిన్న సంస్కృతులు,ఆచారాలు,జీవన విధానాలు, తీవ్ర జీవవైవిధ్యం ఉండే భారత్ లాంటి దేశంలో యాచకులపై కఠిన చర్యలు తీసుకోవడం కుదరని పని. అయితే శారీరకంగా ఆరోగ్యపరంగా ఎలాంటి సమస్యలు



లేని వారు భిక్షాటన చేయడాన్ని నేరంగా పరిగణించాలనీ భారత న్యాయస్థానాలు పలుమార్లు స్పష్టం చేశాయి. 1959లో బాంబే భిక్షాటన నిషేధిత చట్టం అమలుకునోచుకోలేదు. దేశవ్యాప్తంగా ఉన్న దేవాలయాలు,మసీదులు, చర్చిల వద్ద భిక్షగాళ్లు ఎక్కువ సంఖ్యలో ప్రత్యక్షమౌతున్నారు. దేశంలో 2011జనాభా లెక్కల ప్రకారం4లక్షల మందికి పైగా యాచకులున్నారు.వీరిలో పురుషులు 2.21లక్షలు, మహిళలు1.91 లక్షలు వున్నారని తేలింది. వెస్ట్ బెంగాల్‌లో 81 వేల మంది భిక్షాటనలో ప్రథమ స్థానంలో ఉన్నారు. ఉత్తరప్రదేశ్,బీహార్ మధ్యప్రదేశ్, రాజస్థాన్ తర్వాత స్థానాల్లో ఉన్నాయి.భిక్షాటన ముసుగులో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. పసి పిల్లలను ఎత్తుకవెళ్లి వారిని వికలాంగులను చేసి దేవాలయాలు, మసీదులు, చర్చిల వద్ద ప్రధాన కూడళ్లలో భిక్షాటన చేయిస్తున్న సంఘటనలు పోలీసుల దృష్టికి వచ్చాయి. ట్రాఫిక్ జంక్షన్లలో యాచకుల ద్వారా ఆక్సిడెంట్లు జరిగిన కేసులు కూడా నమోదైనాయి. పట్టణాలలో గంజాయి వర్తకులు భిక్షగాళ్లను ఉపయోగించి వారితో గంజాయిని మార్కెట్లో యధేచ్ఛగా విక్రయిస్తున్నారు. డ్రగ్స్,మాదకద్రవ్యాల అమ్మకందార్లు భిక్షగాళ్లను రక్షణ కవచంగా వాడుకొని వ్యాపారం చేస్తున్నారు. అలాంటి వారిని కట్టడిచేయాలని సుప్రీం కోర్టు ప్రభుత్వానికి సూచించింది. భిక్షాటనలో వున్నవారి సంఖ్యపై సర్వే చేయాలని, వారి పునరావాసానికి తీసుకునే చర్యల మీద అధ్యయనం చెయ్యాలని ప్రభుత్వానికి నిర్దేశించింది. దేశంలో వున్న పురపాలకసంఘాలు భిక్షాటనలో వున్నవారికి నివాసం,ఆహారం, ప్రాణరక్షణ మందులు ఉచితంగా అందించాలని అందుకు అవసరమయ్యే చర్యలు చేపట్టాలని సూచించింది.భిక్షగాళ్ల పునరావాసం సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం "స్మైల్" పేరిట పథకాన్ని ప్రవేశపెట్టింది. రాబోయే ఐదేళ్లలో20 వేల మంది భిక్షగాళ్లను భిక్షాటన వృత్తి నుండి విముక్తి కలిగించి గౌరవ ప్రదమైన జీవితాన్ని గడిపే విధంగా జీవనోపాధి అందించాలని నిర్ణయించింది. 'స్మైల్ పథకంలో హిజ్రాలను చేర్చారు.'హిజ్రాల పట్ల' సమాజంలో వున్న చిన్నచూపు పోగొట్టి వారికి జీవనోపాధి గౌరవ ప్రథమైన జీవితానికి భరోసా,భద్రత కల్పించాలని నిర్ణయించడమైంది.'యాచక వృత్తి' నిషేధిత చట్టాలు అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలేదే అయినప్పటికీ కొన్ని ప్రభుత్వాలు చట్టాల అమలులో ఉదాసీనత 'నిరక్ష్య వైఖరి' అవలంబిస్తున్నాయి. యాచకుల పునరావాసం, సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను రాష్ట్రప్రభుత్వాలు వినియోగించకపోవడం లేదా వేరే కార్యక్రమాల కొరకు నిధులను మళ్లిస్తున్నాయి.కర్ణాటక రాష్ట్రప్రభుత్వం బెంగుళూర్‌లో భిక్షగాళ్లు ఎక్కువ వున్న 70 ప్రాంతాలను గుర్తించింది. భిక్షాటన చేస్తున్న101మంది పిల్లలను సంరక్షణ కేంద్రాలకు తరలించింది. బెంగుళూరులో 720 మంది భిక్షాటనలో వున్నట్లు లీగల్ సర్వీసెస్ అథారిటీ గుర్తించింది.భిక్షాటన చేస్తున్న పిల్లల రక్షణ కొరకు1098 టోల్ ఫ్రీనెంబర్ ఏర్పాటు చేసింది. బీహారులో కూడా భిక్షాటన వృత్తి నిర్మూలన చర్యలు చేపడుతున్నారు. అమెరికా మాజీ అధ్యక్షులు ట్రంప్ అతని కూతురు ఇవాంఖ ఢిల్లీకి వచ్చిన సందర్భంగా 'భారత్‌ను యాచక రహిత దేశంగా' చెయ్యాలన్న ప్రతిపాదన వచ్చింది. ఇందుకు కేంద్ర ప్రభుత్వం' పైలెట్ ప్రాజెక్టుగా' రూ.100 కోట్లతో హైదరాబాద్‌ను ఎంపిక చేసింది.ఈనిధులను సద్వినియోగం చేసుకుంటే యాచకులను భిక్షాటన నుండి తప్పించవచ్చు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేదరిక నిర్మూలనా పథకాలను అమలుచేసి హరిజన,గిరిజన, బిసి,మహిళా మైనార్టీ వర్గాల సంక్షేమానికి యువత సాధికారిత సాధనకు పాటుపడాలి. మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం యాచకులు వర్తింప చేసి వారికి ఉపాధి అవకాశాలు కల్పించి పేదరికం నుండి విముక్తి కలిపించాలి. పట్టణాలలో మెట్రోనగరాలలో యాచక వృత్తిలో వున్నవారిని గుర్తించి వారికి ఉపాధి,ఉద్యోగ అవకాశాల కల్పనకు దోహదపడే 'స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాలలో' శిక్షణ ఇవ్వాలి.యాచక వృత్తిలో వున్న పెద్దలు పనుల్లో ఉండేట్లు యాచక వృత్తిలో వున్న బాలలు బడుల్లో ఉండేట్లు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.ప్రభుత్వం యాచక వృత్తిలో వున్నవారికి ఉచిత విద్య,వైద్యం అందించాలి. అలాగే బాలలకు విద్యా హక్కుచట్టం వర్తింప చెయ్యాలి. ఇంటర్మీడియేట్ వరకు ఉచిత విద్య,వృత్తి విద్య అందించాలి.వారి సామాజిక,ఆర్థిక సాంస్కృతిక,వికాసానికి దోహద పడే వృత్తి విద్యా కోర్సులద్వారా ఉపాధి అవకాశాలు కల్పించాలి.ప్రభుత్వం అధికారులు మున్సిపాలిటీల పరిధిలోనగరాలలోమెట్రో నగరాల్లో పోలీస్ అధికారులు యాచకులు ఎక్కువగా కేంద్రీకృతమైన ప్రదేశాలను గుర్తించి యాచక వృత్తి నిషేధచట్టాల అమలు, వారి పునరావాసం కోసం 'నోడాల్అధికారిని' నియమించి యాచకులు బెడదను అరికట్టాలి.యాచకుల కొరకు షెల్టర్లు నెలకొల్పాలి.షెడ్స్‌ల్లో మౌలికసదుపాయాలుకల్పించాలి. యచకులకు గుర్తింపుకార్డులు రేషన్‌కార్డులు ఇవ్వాలి. ●

# రాజకీయ వారసత్వానికి చరమగీతం లేదా?

బుగ్గన మధుసూదనరెడ్డి

రాజకీయ వారసత్వం అనే ఈ అనాగరిక పోకడకు తక్షణమే చరమగీతం పాడేలా ప్రజలంతాఉద్యమించాలి. ఎందుకంటే తమ వారసులను పెంచి పోషించడంతోనే, వారికి రాజకీయ తర్ఫీదు ఇవ్వడంలోనే కొంతమంది నాయకులకు, పాలకులకు పుణ్య కాలం కాస్త గడిచిపోతుంది. ఇక వీరికి ప్రజలకు సేవ చేయడానికి టైం ఎక్కడిది, తీరిక ఎక్కడి నుంచి వస్తుంది. కాబట్టి ప్రజలు వారసత్వ రాజకీయాలకు అవకాశం ఇవ్వకుండా వాటిని తిప్పి కొట్టాలి.అంటే ఎలక్షన్స్ సందర్భంలో అలా చేసేవారికి ప్రజలు ఎలాంటి పరిస్థితుల్లో ఓటు వేయరాదు. అలాగే అలా వారసత్వాన్ని బలవంతంగా ప్రజలపై రుద్దాలనుకునే వారిని ప్రజలు ప్రశ్నించాలి, నిలదీయాలి. ఎందుకంటే ఇలా దేశవ్యాప్తంగా వారసత్వ రాజకీయాలు మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లినంత కాలం ప్రజలకు ఒరిగేదేమి ఉండదు. మన నోట్లో మట్టి కొట్టడం తప్ప. అనాదిగా ఇలాంటి అనాగరిక వారసత్వ రాజకీయాల మూలాన ఇప్పటికే భారతదేశం అభివృద్ధికి నోచుకోకుండా సగం భ్రష్టు పట్టి పోయింది. ఉదాహరణకు కేంద్ర ప్రతిపక్ష పార్టీ అయిన కాంగ్రెస్ పార్టీయే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. జవహర్ లాల్ నెహ్రూ మొదలు ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ వరకు కూడా ఇలాంటి వారసత్వ రాజకీయ మాయాజాలంలో మన భారతవని ఇరుక్కుపోయింది అనేది జగమెరిగిన సత్యం. వాటి నుంచి నేటికీ భారత మాత ప్రజలు బయట పడలేకపోవడం అనేది ఈ ప్రజాస్వామ్యానికి సంబంధించి ఒక పెద్ద బలహీనతగా మారిపోవడం మన ప్రజలు చేసుకున్న ఒక దౌర్భాగ్య స్థితిగా,ఒక దురదృష్టకరమైన పరిణామంగా చెప్పవచ్చు. కాబట్టి ఇప్పటికైనా ప్రజలలో జ్ఞానోదయం కలిగి ఈ రాజకీయ వారసత్వానికి తమ ఓటు ద్వారా చరమగీతం పాడకపోతే మాత్రం మనమంతా ఇంకా,మరింతగా వెసలుబాటుతనానికి గురి అయ్యి ముమ్మందు భారీమూల్యం చెల్లించాల్సిన దారుణ పరిస్థితి మనకు ఉత్పన్నం అవ్వడం తథ్యం. కాబట్టి ఆలస్యం అమృతం విషం అంటారే ఆ విధంగా ఇప్పటికైనా అశేష ప్రజానీకం ఈ నిద్రాణావస్థ నుంచి మేల్కొని ఈ రాజకీయ వారసత్వానికి పాతర వేసేలా, సమాధి చేసేలా మనం చైతన్యమవ్వాలి. లేకపోతే మన పరిస్థితి చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకున్న చందలా తయారు అవుతుంది అనడంలో ఏ మాత్రం సందేహం లేదు. ఏదిఏమైన సుదీర్ఘ కాలంగా భారతదేశాన్ని పట్టి పీడిస్తున్న ఈ రాజకీయ వారసత్వం అనే మహమ్మారిని, రుగ్మతను రూపుమాపకపోతే మాత్రం మన ప్రజానీకానికి ఇక భవిష్యత్ అనేది ఒక శూన్యంగా, ప్రశ్నార్థకంగా మారిపోవడం తథ్యం.ఏమైనా అలాంటి దయనీయ పరిస్థితి మన భారతదేశ ప్రజానీకానికి తలెత్తకుండా ఉండాలంటే మాత్రం యావత్ ప్రజానీకం ఒకే త్రాటిపై నిలిచి ముక్తకంఠంతో ఈ వారసత్వ రాజకీయాల వాసన కూడా తగలకుండా ప్రతిఘటించాలి.అందుకు అందరూ చెయ్యి చెయ్యి కలిపి ఈ వారసత్వ రాజకీయాలను తరిమితరిమి కొట్టి కనీసం నామరూపాలు లేకుండా చూడాల్సిన గురుతర బాధ్యతఅందరి భుజస్కంధాలపై ఎంతైనా వుంది.అప్పుడే మన ముందు తరాల ప్రజలకు ఒక మంచి భవిష్యత్‌ను ఇచ్చిన వారమవుతాము. కాబట్టి మన ప్రజలంతా ఈ రాజకీయ వారసత్వంపై కన్నెర్ర చేసి మరీ మన ఉనికిని కాపాడుకోవాల్సిన మంచి శుభ తరుణం ఇదే! ప్రజాస్వామ్యం వర్ధిల్లాలి! రాజకీయ వారసత్వం అనే అనాగరిక పోకడకు తక్షణమే చరమగీతం పాడేలా ప్రజలంతా యుద్ధప్రాతిపదికన ఉద్యమించాలి! ●

# సంక్షోభం అంచున రైతులు

బొల్లిముంతసాంబశివరావు

నేడు ఆంధ్రప్రదే రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. సమస్యల వలయంలో కొట్టుకొట్టుమిట్టాడుతున్నారు. పంటలకు సరైన ధరలు లభించకపోవడం, పెట్టుబడికి తగినంత ఆదాయం రాకపోవడం, అప్పుల భారం, మార్కెట్ దోపిడీ, రుతుపవనాల మార్పు, కరువు,వరదలు, తెగుళ్లు, సరైన మౌలికసదుపాయాలు లేకపోవడం వంటి సమస్యలు ఆంధ్రప్రదే రైతులను ముట్టడించి ఉన్నాయి. రైతురోజువారి సంపాదన 27 రూపాయల కన్నా తక్కువ ఉందంటే రైతుల పరిస్థితి ఏమిటో తెలుస్తుంది. పంటల సేద్యపు ఖర్చులు పెరుగుతున్నా, పంటలకు న్యాయమైన ధరలు మాత్రం లభించడం లేదు. కేంద్రప్రభుత్వం ప్రకటిస్తున్న మద్దతు ధరలు రైతాంగ ప్రయోజనాలకు కాకుండా, బడావ్యాపారుల ప్రయోజనాలకు అనుగుణంగా ఉంటున్నాయి. అసలుకేంద్రం ప్రకటించే మద్దతు ధరల నిర్ణయమే రైతాంగ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉంది. సేద్యం ఖర్చు, కుటుంబ శ్రమ, కౌలుఖర్చు, అప్పులకు వడ్డీ తదితరాలు కలిపి పంటఖర్చును నిర్ణయించకుండా, పంటఖర్చు, కుటుంబ శ్రమను మాత్రమే లెక్కించి, దానిపై 50శాతం పెంచి మద్దతుధర ప్రకటించి స్వామినాథన్ సిఫార్సులు అమలు జరిపినట్లు కేంద్రప్రభుత్వం మోసంచేస్తున్నది. ఫలితంగా మద్దతుధర రైతుకు ప్రయోజనంగా ఉండడం లేదు. కేంద్రప్రభుత్వం మద్దతు ధరల ప్రకటన, ధాన్యం కొనుగోళ్ల నుంచి తప్పుకోవడానికి మూడు వ్యవసాయ చట్టాలనుచేసి, రైతాంగ తీవ్ర ప్రతిఘటన వల్ల వాటిని విరమించుకున్నట్లు ప్రకటించినా, దొడ్డిదారిన వాటిని అమలు జరుపుతూనే ఉంది. నేడు కొత్త విత్తన చట్టం ముసాయిదాను ప్రకటించి దాన్ని చట్టంగా మార్చి విత్తనంపై బహుళజాతి సంస్థల ఆధిపత్యాన్ని నెలకొల్పనుంది. వ్యవసాయాన్నిదేశ, విదేశీ కార్పొరేట్ సంస్థలకు అప్పచెప్పే విధానాలు అమలు చేస్తున్నది.అందులో భాగమే పంటలకు న్యాయమైన ధరలు ప్రకటించకపోవడం, వరి క్వింటాల్ వాస్తవ ఉత్పత్తి ఖర్చు 2,090రూపాయలు. స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం 3,135 రూపాయల మద్దతుధర ప్రకటించాలి. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరమేలు రకానికి 2,388 రూపాయలు,మిగతా పంటలకు ప్రకటించక మద్దతు ధరలు కూడా ఈవిధంగానే ఉన్నాయి. కేంద్రప్రభుత్వం మద్దతు ధరలు ప్రకటించి చేతులు దులుపుకుంటున్నది. మద్దతుధరల ప్రకారం పంటల కొనుగోళ్లను పక్కనపెడుతున్నది. కేంద్ర ప్రభుత్వ సంస్థలు కొన్నామంటే, కొన్నామన్న విధంగా వ్యవహరిస్తూ ఉన్నాయి. ఏరాష్ట్రంలోనూ కనీసం మద్దతుధర కూడా పంటలకు లభించడంలేదు.ఆంధ్రప్రదేశ్‌లో ఏపంటకు మద్దతుధర లభించడం లేదు. వరి రైతుల పరిస్థితి దుర్భరంగా మారింది.తుఫాన్, భారీవర్షాలకు పంట దెబ్బతినగా, మిగిలిన పంట అమ్ముకుందామంటే మార్కెట్లో ధర ఒక్కసారిగా పడిపోయింది. తాలు, తేమశాతం, మట్టి వంటి నిబంధనల పేరుతో రైతుకు మద్దతు ధర దక్కడం లేదు.నూర్చిన వెంటనే ధాన్యం కొనుగోలు చేయమని కేంద్ర ప్రభుత్వ సంస్థలు తిరస్కరించడంతో వరిరైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. చిన్న,సన్నకారు రైతులు అవసరాల రీత్యానూర్చిన వెంటనే అమ్మడం జరుగుతుంది.వారి అవసరాలను గమనించిన వ్యాపారులు 75బస్తాకుఅదనంగా మరో రెండు కేజీలు తీసుకుని రూ.1450 మాత్రమే ఇస్తున్నారు. ఫలితంగా రైతులు బాగా నష్టపోతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మీడియా సమావేశంలో మాట్లాడుతూ మనం పండించే వరిని మనమే తినడంలేదని, అలాంటి వరిని ప్రభుత్వం కొనుగోలు చేసి ఏమిచేస్తుందని ప్రశ్నించారు.బియ్యం తినడంవల్ల డయాబెటీస్తో పాటు ఇతరజబ్బులన్నీ వస్తాయని, రాబోయే రోజుల్లో ఎవరూ వరిని తినరని చెప్పారు. రైతులు క్రిమిసంహారక మందులు ఎక్కువ వాడుతున్నారని, వాటి కొనుగోలుకు ఎవరూ ముందుకు రావడంలేదని, ఈసంవత్సరం 55 లక్షలటన్నులు కొనుగోలు చేశామని, వచ్చే సంవత్సరం కొనుగోలు చేయమని చెప్పారు.ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన మాటలు చాలా వింతగా ఉన్నాయి. రాష్ట్రప్రజలే కాకుండా,దేశ, విదేశాల్లో కూడా ప్రజలు బియ్యాన్ని ఆహారంగా తీసుకుంటున్నారు. బియ్యం తినకుండా మరి ఏమితినాలో ముఖ్యమంత్రిగారు చెప్పలేదు.బియ్యం ఎవరూ కొనడం లేదనిచెప్పే చంద్రబాబు గారు, రేషన్ బియ్యంతో సహాపెద్దఎత్తున విదేశాలకు బియ్యం ఎగుమతి ఎలా జరుగుతున్నది. అమెరికా తదితర దేశాల నుంచి దేశంలోకి బియ్యం దిగుమతి ఎలా జరుగుతున్నది. బహుళజాతి సంస్థల దోపిడీ ప్రయోజనాల కోసం క్రిమిసంహారక మందులు దిగుమతి చేసుకుంటున్నది కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలేగదా!వాటిని ఎందుకు నియంత్రణ చేయలేకపోతున్నారు. చంద్రబాబు చెప్పే మాటలన్నీ ధాన్యం ఉత్పత్తిని విడనాడి విదేశాల నుంచి దిగుమతి చేసుకునే విధానం మాత్రమే.ఇది కేంద్రప్రభుత్వ విధానంలోభాగమే.గత మూడు సంవత్సరాలుగా పెసరకు మద్దతు ధర లభించడంలేదు.ఎకరాకు దిగుబడి 2నుంచి4క్వింటాళ్లు వస్తుంది. క్వింటాఉత్పత్తి ఖర్చు 5 వేలు. ప్రభుత్వ ప్రకటించిన మద్దతు ధర8,768 రూపాయలు. మద్దతు ధరకు ప్రభుత్వసంస్థలు కొనుగోళ్లు చేయడం లేదు. ప్రైవేట్ వ్యాపారులు 6 వేలకు మించి ధర ఇవ్వడంలేదు. కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకునే చర్యలు తీసుకోలేదు.మొక్కజొన్నకు కేంద్రప్రభుత్వం ప్రకటించిన మద్దతుధర 2,400రూపాయలు. మొక్కజొన్న కొనుగోళ్లను ప్రభుత్వ సంస్థలు చేపట్టకపోవడంవల్ల ప్రైవేట్ వ్యాపారులు 17 వందలకు మించి ధర ఇవ్వకపోవడంవల్ల తీవ్రంగా నష్టపోతున్నారు.కందికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతుధర 7,550రూపాయలు.బహిరంగ మార్కెట్లో 6వేలు మాత్రమే క్వింటాల్‌కి లభిస్తున్నది.శనగ,జొన్న,మినుములు,పత్తి,మిరప మొదలైన పంటలకు కూడా మద్దతుధరలు లభించడంలేదు. 2024 సాధారణ ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు పంటలన్నింటికి ధరలు పెంచిచేసి రైతులకు మేలుజరిగేలా చేస్తానని, ధరల స్థిరీకరణ కోసంనిధిని ఏర్పాటు చేస్తానని చెప్పారు. అధికారంలోకి వచ్చిన తర్వాత చెప్పిన మాటలు మర్చిపోయారు. ఏపంటరైతుకు ఆశించిన ధర కల్పించలేకపోయారు.ధరల స్థిరీకరణ నిధికి వైసిపిప్రభుత్వం 3వేలకోట్లు కేటాయిస్తే,చంద్రబాబు ప్రభుత్వం 300వందల కోట్లు మాత్రమే కేటాయించారు.దీనిద్వారా పంటలు కొనుగోళ్లు ఎలాసాధ్యం. కేంద్ర,రాష్ట్రప్రభుత్వ రైతాంగవ్యతిరేక విధాలకు వ్యతిరేకిస్తూ, స్వామినాథన్ కమీషన్ సిఫార్సులకు అనుగుణంగా మద్దతు ధరలు ప్రకటించి కేంద్ర, రాష్ట్రప్రభుత్వ సంస్థలే కొనుగోళ్లు చేయాలని,కార్పొరేట్ సంస్థలకు భూములు అప్పగించే విధానాలు విరమించాలని రాష్ట్రరైతాంగం ఉద్యమించాలి. ●

# అమెరికాలో భారీగా హెచ్-1బి హెచ్-4 వీసాలు 'రద్దు'!




**వాషింగ్టన్, డిసెంబరు 15:** హెచ్-1బి వీసా దరఖాస్తుదారులపై 'వెట్టింగ్'ను ప్రారంభించిన అమెరికా ప్రభుత్వం మరో బాంబు పేల్చింది. ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా భారీ ఎత్తున హెచ్-1బి, హెచ్-4 వీసాలను 'ప్రుడెన్షియల్ రద్దు' చేసింది. ఈ మేరకు వర్కింగ్ వీసాలు రద్దయినట్లు ప్రభావిత వీసాదారులకు కాన్సులేట్ నుంచి ఈ మెయిల్స్ వచ్చినట్లు తెలుస్తోంది. హెచ్-1బి, హెచ్-4 వీసా దరఖాస్తుదారుల సోషల్ మీడియా ఖాతాలను పరిశీలించే ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభమైన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. అయితే ఈ ప్రుడెన్షియల్ రద్దు తాత్కాలికమేనని తెలుస్తోంది. ఇది శాశ్వత వీసా తిరస్కరణ కిందకు రాదని ఇమిగ్రేషన్ అటార్నీ ఎమిలీ నాయ్‌మెన్ వెల్లడించారు. 'ఈ తాత్కాలిక వీసా రద్దు వీసాదారుల చట్టబద్ధ నివాస హక్కును ప్రభావితం చేయదు. కానీ, తదుపరి వీసా అపాయింట్‌మెంట్ సమయంలో దీన్ని పరిగణనలోకి తీసుకుని వారి దరఖాస్తులను మరింత క్షుణ్ణంగా పరిశీలించే అవకాశం ఉంది' అని ఎమిలీ సోషల్ మీడియాలో రాసుకొచ్చారు. ఏమిటీ ప్రుడెన్షియల్ రద్దు.. వీసాదారుల చట్టబద్ధ నివాస అర్హతలో ఏదైనా సమస్య ఉందని ప్రభుత్వం అను మానించిన సమయంలో విదేశాంగ శాఖ వివేకవంతంగా వీసా రద్దుపై నిర్ణయం తీసుకుంటుంది. దీన్నే ప్రుడెన్షియత్ వీసా రివోకేషన్‌గా పిలుస్తారు. అయితే, ఇలా తాత్కాలికంగా రద్దు చేసిన ప్పటికీ.. వీసాదారులు తమ గడువు పూర్తయ్యే వరకు అమెరికాలో నివాసం కొనసాగించొచ్చు. అయితే, ఒకసారి అగ్రరాజ్యం నుంచి బయటకు వెళ్తే.. వీసా గడువు ఉన్నప్పటికీ మళ్లీ అమెరికాలోకి ప్రవేశించే అవకాశం ఉండదు.

తాత్కాలిక రద్దు సమయంలో వీసాల స్టాంప్ చెల్లుబాటు కాదు. మొదలైన వెట్టింగ్.. ఇదిలా ఉండగా.. హెచ్-1బి, హెచ్-4 వీసా దరఖాస్తు దారుల ఆన్‌లైన్ ఉనికిని సమీక్షించే వెట్టింగ్ ప్రక్రియ నేటి నుంచి ప్రారంభమైంది. హెచ్-1బి, హెచ్-4, ఎఫ్, ఎం, జె వీసాలకు దరఖాస్తు చేసిన వారంతా వెట్టింగ్‌కు వీలుగా తమ సోషల్ మీడియా సెట్టింగ్‌లను ప్రైవేటు నుంచి పబ్లిక్‌కు మార్చుకోవాల్సి ఉంటుంది. ఈ నిబంధనల వల్ల ఇప్పటికే భారతీయులు సహా అనేకమంది హెచ్- 1బి వీసాల ఇంటర్వ్యూలు వాయిదా పడ్డాయి.

# 'ఓటు చోరీ' పై రగడ



**రాహుల్, ఖర్గే వెంటనే క్షమాపణ చెప్పాలన్న బిజెపి సభ్యులు - పార్లమెంట్ ఉభయ సభలు పలుమార్లు వాయిదా - వాయుకాలుష్యంపై చర్చకు విపక్షాల పట్టు - లోక్‌సభలో రెండు కీలక బిల్లులు**

**న్యూఢిల్లీ, డిసెంబరు 15:** కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఢిల్లీలో నిర్వహించిన ఓట్ చోరీ ర్యాలీలో పార్టీ కార్యకర్తలు ప్రధాని మోడీనుద్దేశించిన చేసిన వ్యాఖ్యలు సోమవారం పార్లమెంట్‌ను కుదిపేశాయి. తక్షణమే రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే క్షమాపణలు చెప్పాలని బిజెపి సభ్యులు ఉభయ సభల్లో డిమాండ్ చేశారు. సభ్యుల ఆందోళనలు, నిరసనలతో సభా కార్యకలాపాలకు అంతరాయం కల్గించడంతో పలుమార్లు వాయిదా పడ్డాయి. పార్లమెంట్ వెలుపల కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ... ప్రధాని మోడీపై అలాంటి వ్యాఖ్యలు అత్యంత దురదృష్టకరం, విషాదకరమన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఇలాంటి వాటికి తావు లేదన్నారు. కార్యకర్తల తప్పుడు చేష్టను కాంగ్రెస్ నేతలు నామమాత్రంగా ఖండించి వదిలేస్తే సరిపోదన్నారు. దీనిపై పార్లమెంటు వేదికగా లోక్‌సభ విపక్ష నేత రాహుల్, కాంగ్రెస్ చీఫ్ ఖర్గే క్షమాపణ చెప్పాల్సిందేనన్నారు. కాంగ్రెస్ నేతల్లో మానవత్వం మిగిలి ఉంటే, దేశ ప్రజలపై గౌరవం ఉంటే ఏమాత్రం ఆలస్యం చేయకుండా పార్లమెంటు ఉభయసభల్లో క్షమాపణ చెబుతూ ప్రకటన చేయాలని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు సూచించారు. విపక్ష నేతలను రాజకీయ ప్రత్యర్థులుగా చూస్తానే తప్ప, శత్రువులుగా చూడనని ప్రధాని మోడీ నిత్యం చెబుతుంటారని ఆయన గుర్తుచేశారు. "పార్లమెంటులో అన్ని అంశాలపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నాం. విపక్షాలే చర్చ నుంచి తప్పించుకుంటున్నాయి. ప్రధానిపై తప్పుడు వ్యాఖ్యలు చేస్తే దేశానికి ఎలాంటి ప్రయోజనం ఉండదు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ తన తప్పును గుర్తిం చాలి. లోక్ సభ, రాజ్యసభలకు క్షమాపణ చెప్పాలి" అని కిరణ్ రిజిజు తెలిపారు.

**లోక్‌సభలో కీలక బిల్లులు**

మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును పూజ్య బాపు గ్రామీణ రోజ్‌గార్ యోజన పథకంగా మార్పు చేసిన కేంద్ర ప్రభుత్వం, తాజాగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రద్దుకు మోడీ ప్రభుత్వం యోచిస్తోంది. అందుకు సంబంధించిన బిల్లు ప్రతులను సోమవారం లోక్ సభ సభ్యులకు అందించింది. ఈ సందర్భంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ఈ బిల్లు ఉద్దేశం తెలుపుతూ పార్లమెంట్‌లో ఓ ప్రకటన చేశారు. అందులో గత 20 ఏళ్లుగా మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం వల్ల కోట్లాది మంది పల్లె ప్రజలు ఉపాధి పొందారని తెలిపారు. అయితే సామాజిక భద్రత పథకాల ప్రయోజనాలను మరింత విస్తరించేందుకు, ప్రభుత్వ పథకాలను మంత సంతృప్త స్థాయిలో అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే ఈ పథకాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. వికసిత్‌భారత్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా, భారతదేశంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేసే దిశగా ఈ కొత్త పథకాన్ని రూపొందించినట్లు బిల్లులో పేర్కొన్నారని సమాచారం. కొత్త బిల్లులో, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి కుటుంబానికి సంవత్సరంలో కనీసం 125 రోజుల పాటు వేతనంతో కూడిన ఉపాధి కల్పించనున్నారు. దీని ద్వారా సుసంపన్న, సుస్థిర గ్రామీణాభివృద్ధిని సాధించడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. అలాగే వికసిత్ భారత్ శిక్ష అధిష్టాన్ బిల్లును కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ లోక్‌సభలో ప్రవేశ పెట్టారు. విద్యకు సంబంధించి అన్ని వ్యవస్థలను ఒకే గొడుగు కిందకు తేవడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు.

**మోడీ సర్కారుపై ప్రియాంక గాంధీ విమర్శలు**

ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేయబోతున్నారన్న వార్తలపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, వాయనాడ్ ఎంపి ప్రియాంక గాంధీ మండిపడ్డారు. పార్లమెంట్ వెలుపల ఆమె మీడియాతో మాట్లాడుతూ, "ఏదైనా పథకం పేరు మార్చినప్పుడల్లా, కార్యాలయాల్లో, స్టేషనరీలో చాలా మార్పులు చేయాల్సి వస్తుంది. దీని కోసం చాలా డబ్బు ఖర్చు అవుతుంది. ఇంత చేసినప్పటికీ దీని వల్ల కలిగే ప్రయోజనం ఏమిటి? ఎందుకు ఇలా చేస్తున్నారు? ముఖ్యంగా మహాత్మా గాంధీ పేరును ఎందుకు తొలగిస్తున్నారు? మహాత్మా గాంధీ మన దేశంలోనే కాకుండా, ప్రపంచమంతా ఆయనను గొప్ప నాయకుడిగా పరిగణిస్తుంది. అయినప్పటికీ ఆయన పేరును తొలగించడం వెనుక ఉద్దేశం ఏమిటో నాకు నిజంగా అర్థం కావడం లేదు?


# కొలంబియాలో అదుపుతప్పి లోయలో పడిన బస్సు

**17 మంది విద్యార్థులు దుర్మరణం.. మరో 20 మందికి తీవ్రగాయాలు**



**బొగోటా, డిసెంబరు 15:** స్కూల్ బస్సు అదుపుతప్పి లోయలో పడింది. ఈ ఘటనలో 17 మంది విద్యార్థులు దుర్మరణం పాలయ్యారు. మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. కొలంబియా నైరుతి ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. విద్యార్థులు కొలంబియా తీరంలోని కరేబియన్ బీచ్‌లో తమ గ్రాడ్యుయేషన్‌ను సెలబ్రేట్ చేసుకుని తిరిగి వెళ్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. యాంటియోక్వియా గవర్నర్ ఆండ్రెస్ జులియన్ రెండాన్ ఈ ప్రమాదంపై స్పందించారు. బస్సు కరేబియన్ బీచ్ నుంచి మెడిల్లిన్‌కు వస్తుండగా ప్రమాదానికి గురైందని చెప్పారు. ఒక్కసారిగా బస్సు 40 అడుగుల లోతైన లోయలోకి జారిపోవడంతో భారీ ప్రాణనష్టం జరిగిందని రెండాన్ అన్నారు. మృతుల్లో డ్రైవర్ కూడా ఉన్నారని చెప్పారు. క్షతగాత్రులను మెడిల్లిన్ లీగల్ మెడిసిన్ ఇన్‌స్టిట్యూట్‌కు తరలించినట్లు తెలిపారు. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందన్నారు.

# మెస్సీతో సిఎం భార్య ఫోటోపై ఫ్యాన్స్ ఫైర్!



**ముంబయి, డిసెంబరు 15:** ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ భారత పర్యటనలో ఊహించని వివాదం చోటుచేసుకుంది. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ భార్య అమృత ఫడ్నవిస్, మెస్సీతో సెల్ఫీ దిగిన తీరుపై అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆమె ప్రవర్తన అగౌరవంగా ఉందంటూ సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మూడు రోజుల పర్యటన కోసం భారత్‌కు వచ్చిన మెస్సీ ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నాడు. మహారాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "ప్రాజెక్ట్ మహాదేవ" అనే ఫుట్‌బాల్ అభివృద్ధి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించాడు. ఈ కార్యక్రమానికి క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్, భారత ఫుట్‌బాల్ కెప్టెన్ సునీల్ ఛెత్రీతో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఈ కార్యక్రమం సందర్భంగా అమృత ఫడ్నవిస్ ప్రవర్తన వివాదాస్పదమైంది. ఆమె పదేపదే మెస్సీతో సెల్ఫీల కోసం ప్రయత్నించడం, చూయింగ్ గమ్ నములుతూ ఫోటోలకు పోజులివ్వడం వంటివి ఒక వీడియోలో రికార్డ్ అయ్యాయి. మెస్సీ పక్కన నిలబడటం కోసం ఫుట్‌బాలర్ రోడ్రిగో డి పాల్‌ను పక్కకు జరగమని ఆమె కోరినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ వీడియో వైరల్ కావడంతో మెస్సీ అభిమానులు మండిపడుతున్నారు. అసలు ఆమెకు మైదానంలో ఏం పని అని, ఒక లెజెండరీ ఆటగాడి పట్ల ఇంత అగౌరవంగా ప్రవర్తిస్తారా అని ప్రశ్నిస్తున్నారు. అనంతరం అమృత ఫడ్నవిస్, మెస్సీతో దిగిన ఫొటోను తన ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకోగా ఆపోస్టుపైనా వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

# దేశ రాజధానిని కమ్మేసిన దట్టమైన పొగమంచు!

**300 విమానాలు ఆలస్యం**

**ఆలస్యంగానే ప్రధాని మోడీ జోర్డాన్ పయనం**



**న్యూఢిల్లీ, డిసెంబరు 15:** దేశ రాజధాని ఢిల్లీని ఈరోజు ఉదయం దట్టమైన పొగమంచు కమ్మేసింది. వాయు కాలుష్యం తీవ్ర స్థాయికి చేరడంతో నగరం ఉక్కిరిబిక్కిరి అవుతోంది. గాలి నాణ్యత సూచీ ప్రమాదకర స్థాయికి పడిపోవడంతో దృశ్యమానత తగ్గింది. ఫలితంగా విమాన, రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అలాగే ప్రధానిమోడీ జోర్డాన్ పర్యటన విమానం కూడా మంచుకారణంగా ఆలశ్యంగా బయలుదేరింది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రకారం, ఇవాళ ఉదయం 6 గంటలకు ఢిల్లీలో వాయు నాణ్యత సూచీ 456గా నమోదైంది. ఇది ఈ సీజన్‌లోనే రెండో అత్యంత గరిష్ఠ స్థాయి. ఆదివారం ఏక్యూఐ 461గా నమోదవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. అక్షర్‌ధామ్ వద్ద ఏక్యూఐ 493గా, బారాఖంబా రోడ్డులో 474గా నమోదైంది. కాలుష్యం కారణంగా ఏర్పడిన పొగమంచుతో ఢిల్లీ విమానాశ్రయంలో సుమారు 100 విమాన సర్వీసులు రద్దు కాగా, 300కు పైగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

# చైనా, టర్కీల అండతో రెచ్చిపోతున్న పాకిస్థాన్


**ఆపరేషన్ సిందూర్ మళ్లీ తప్పేలాలేదు..**

**విశ్రాంత లెఫ్టినెంట్ జనరల్ దుశ్యంత్‌సింగ్**

**అమ్మదాబాద్, డిసెంబరు 15:** చైనా, టర్కీల అండదండలతో కశ్మీర్ అంశాన్ని పాకిస్థాన్ పదేపదే రెచ్చగొడుతున్న నేపథ్యంలో, భారత్‌కు ఆపరేషన్ సిందూర్ 2.0 తప్పదనిపిస్తోందని విశ్రాంత లెఫ్టినెంట్ జనరల్ దుశ్యంత్ సింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. భారత సాయుధ దళాలు దీనికి సర్వసన్నద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రస్తుతం సెంటర్ ఫర్ ల్యాండ్ వార్‌ఫేర్ స్టడీస్ డైరెక్టర్ జనరల్‌గా ఉన్న ఆయన, గుజరాత్‌లోని సౌత్‌వెస్టర్న్ ఎయిర్ కమాండ్ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రసంగించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని పాకిస్థాన్ నిరంతరం ఉల్లంఘిస్తోందని దుశ్యంత్ సింగ్ మండిపడ్డారు. ఆపరేషన్ సిందూర్ ఒక ముగింపు కాదు, యుద్ధ నిర్వహణలో ఒక కొత్త అధ్యాయానికి నాంది. భవిష్యత్తులోనూ శత్రువులతో వివాదాలు తప్పవు. అందుకే, ఆపరేషన్ సిందూర్ 2.0 కోసం మనం ఎంత త్వరగా సిద్ధమైతే అంత మంచిదని ఆయన అభిప్రాయపడ్డారు. ఆనాటి ఆపరేషన్ పాకిస్థాన్ బలహీనతలను బయటపెట్టిందని, 1971 యుద్ధం తర్వాత మన త్రివిధ దళాలు పూర్తి సమన్వయంతో పనిచేయడం అదే తొలిసారని గుర్తుచేశారు. అంతర్జాతీయంగా దేశ వ్యతిరేక ప్రచారాన్ని తిప్పికొట్టడంలో భారత్ వెనుకబడి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ప్రభుత్వ నెట్‌వర్క్‌లపై సైబర్ దాడులు ఏడు రెట్లు పెరిగాయన్నారు.

# 'నేను చచ్చిపోతున్నా.. నా కుటుంబానికి చెప్పు'

## సిడ్నీ 'హీరో' అహ్మద్



**కాన్‌బెర్రా, డిసెంబరు 15:** ఆస్ట్రేలియాలోని సిడ్నీలో యూదులపై ఉగ్రదాడి యావత్ ప్రపంచాన్ని ఉలిక్కిపాటుకు గురిచేసింది. ఈ భయానక ఘటనలో ఉగ్రవాదులకు ఎదురొడ్డి ఎంతోమంది ప్రాణాలు కాపాడారు 'రియల్ హీరో' అహ్మద్ అల్ అహ్మద్. దాడి సమయంలో ఆయన అన్న మాటలు అందరి హృదయాల్ని కదిలిస్తున్నాయి. ఈ పోరాటంలో తాను చనిపోతానేమోనని, తన కుటుంబానికి చెప్పాలని అహ్మద్ పక్కనున్న వారితో అన్నారు. సిరియా నుంచి వచ్చి.. అహ్మద్ అల్ అహ్మద్ స్వదేశం సిరియా. నిత్యం అంతర్యుద్ధంతో నలిగిపోయే ఆ దేశాన్ని వీడి భవిష్యత్తుపై కలలు కంటూ దశాబ్దం క్రితం ఆస్ట్రేలియాకు వలస వచ్చారు. కుటుంబంతో కలిసి దక్షిణ సిడ్నీలోని సదర్లాండ్ షైర్‌లో కొత్త జీవితాన్ని ప్రారంభించారు. ఈయనకు ఇద్దరు చిన్నపిల్లలు. స్థానికంగా ఓ పండ్ల దుకాణం పెట్టి కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఉగ్రదాడి జరిగిన ఆదివారం ఉదయం అహ్మద్ బోండి బీచ్‌లో తన బంధువు జోజీ అల్కాంజ్‌తో కలిసి కాఫీ షాప్‌లో ఉన్నారు. ఒక్కసారిగా కాల్పుల శబ్దాలు వినిపించగానే వీరిద్దరూ భయపడిపోయారు. కాసేపటికి అహ్మద్ తేరుకున్నారు. ఉగ్రవాదులను చూడగానే వారిని ఎలాగైనా అడ్డుకోవాలనుకున్నారు. ఈ క్రమంలోనే తన ప్రాణాలు పోతాయని తెలిసినా ఆయన వెనకడుగు వేయలేదు. 'నేను చనిపోబోతున్నా.. నా కుటుంబాన్ని చూసుకో. ఒకవేళ నాకేదైనా జరిగితే ఇతరుల ప్రాణాలను కాపాడే క్రమంలో నేను నేలకొరిగానని నా కుటుంబానికి చెప్పు' అని అహ్మద్ తన బంధువుతో చెప్పారు. ఈ విషయాన్ని అల్కాంజ్ మీడియాకు వివరించారు. ఈ ఘటన సమయంలో కాల్పులు జరుపుతున్న దుండగుల్లో ఒకడిని అహ్మద్ అడ్డుకున్నాడు. వెనక నుంచి వచ్చి తుపాకీ లాక్కున్నాడు. దీంతో దుండగుడు అక్కడి నుంచి పారిపోయాడు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు వైరల్ అయ్యాయి. ఉగ్రవాదిని అడ్డుకునే సమయంలో అహ్మద్ గాయపడగా.. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ట్రంప్ ప్రశంసలు.. అహ్మద్ సాహసాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రశంసించారు. ఆయన ఎంతో ధైర్యంగా ఉగ్రవాదులకు ఎదురు నిలిచారని, ఆయన చేసిన పనికి గర్వపడుతున్నానని అన్నారు. అహ్మద్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. చేపల వేటకని వచ్చి ఉగ్రదాడి.. సిడ్నీలోని బోండీ బీచ్‌లో ఉత్సవం సమయంలో ఉగ్రవాదులు కాల్పులు జరిపిన సంగతి తెలిసిందే. ఈ దుర్ఘటనలో 16 మంది మరణించారు. కాల్పులు జరిపిన వారు తండ్రీకొడుకులని, వీరిని సాజిద్ అక్రమ్ (50), నవీద్ అక్రమ్ (24)గా పోలీసులు గుర్తించారు. వీరి కుటుంబం పాకిస్థాన్ నుంచి వచ్చి కొన్నేళ్లుగా ఆస్ట్రేలియాలో నివాసం ఉంటోంది. సాజిద్ స్థానికంగా పండ్ల దుకాణం నడుపుతుండగా.. నవీద్ రెండు నెలల కిందటే ఉద్యోగం కోల్పోయినట్లు తెలిపారు. చేపల వేటకు వెళ్తున్నామని వీరిద్దరూ చెప్పారు.

# రెండేళ్లక్రితం తప్పిపోయిన బెల్జియం యువతి కేసు కీలక క్లూ లభ్యం

**టాస్మేనియా, డిసెంబరు 15:** ఆస్ట్రేలియాలోని టాస్మేనియాలో రెండేళ్ల క్రితం తప్పిపోయిన బెల్జియం యువతి కేసులో కూ్లదొరికింది. ఆమె మొబైల్ ఫోన్ దొరకడంతో నిలిచిపోయిన గాలింపు చర్యలను పోలీసులు తిరిగి ప్రారంభించారు. సెలిన్ క్రీమర్ అనే బెల్జియం మహిళ జూన్ 2023లో ఫిలాసఫర్ ఫాల్స్ సమీపంలోని అటవీ ప్రాంతంలో అదృశ్యమైంది. అప్పట్లో పోలీసులు ఆమె కారును గుర్తించినా, ఎంత గాలించినా ఆచూకీ మాత్రం లభించలేదు. దీంతో ఆమె స్నేహితులు, కుటుంబ సభ్యులు తాజాగా స్వయంగా గాలింపు చేపట్టారు. బెల్జియం నుంచి వచ్చిన ఆమె స్నేహితులు శనివారం గాలిస్తుండగా, గతంలో అధికారులు వెతికిన ప్రదేశంలోనే సెలిన్ మొబైల్ ఫోన్‌ను కనుగొన్నారు. ఈ విషయాన్ని నిర్ధారించిన పోలీసులు, ఫోన్‌ను ఫోరెన్సిక్ పరీక్షలకు పంపినట్లు తెలిపారు. చీకటి పడుతుండటంతో సెలిన్ తన కారు వద్దకు త్వరగా వెళ్లేందుకు ఫోన్‌లోని యాప్ సహాయంతో షార్ట్ కట్ మార్గంలో వెళ్లి ఉండొచ్చని భావిస్తున్నాం. ఆ క్రమంలో ఆమె ఫోన్ జారవిడుచుకుని, దట్టమైన అడవిలో దారి తప్పిపోయి ఉండొచ్చంటున్నారు.

# సంక్షిప్తంగా..

## శబరిమలకు పోటెత్తుతున్న భక్తులు




**పతనంతిట్ట, డిసెంబరు 15:** కేరళలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శబరిమలకు భక్తులు పోటెత్తుతున్నారు. ఈ ఏడాది మండల మకరవిళక్కు వేడుకలు గత నెల 17వ తేదీ నుంచి ప్రారంభమైన విషయం తెలిసిందే. దీంతో అయ్యప్ప దర్శనానికి కేరళ, తమిళనాడు సహా దేశం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఈ క్రమంలో ఈ సీజన్‌లో ఇప్పటి వరకూ 25 లక్షల మందికిపైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అధికారులు తాజాగా వెల్లడించారు. గతేడాదితో పోలిస్తే భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది. గతేడాది ఈ సమయానికి సుమారు 21 లక్షల మంది భక్తులు అయ్యప్ప ఆలయాన్ని సందర్శించారు. ప్రస్తుత సీజన్‌లో ఆ సంఖ్య 25 లక్షలు దాటినట్లు శబరిమల చీఫ్ పోలీస్ కోఆర్డినేటర్ ఎడీజీపీ ఎస్ శ్రీజిత్ తెలిపారు. డిసెంబర్ చివరినాటికి రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా దర్శనాలు సజావుగా సాగేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

## విజయ్ ఈరోడ్ ప్రచారానికి 84 షరతులు

**ఈరోడ్, డిసెంబరు 15:** కరూర్ తొక్కిసలాట తర్వాత ప్రముఖ నటుడు, టీవీకే చీఫ్ విజయ్ మరో ర్యాలీకి సిద్ధమయ్యారు. ఇటీవలే పుదుచ్చేరిలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించిన విజయ్ ఈసారి తమిళనాడు లోని ఈరోడ్‌లో ప్రచార ర్యాలీకి సిద్ధమయ్యారు. ఈ ర్యాలీకి ఈరోడ్ పోలీసులు తాజాగా పర్మిషన్ ఇచ్చారు. ఈనెల 18న ఈరోడ్‌లోని విజయపురిలో విజయ్ తన తదుపరి ఎన్నికల ప్రచార ర్యాలీని నిర్వహిస్తున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ర్యాలీ జరగనుంది. దాదాపు 16 ఎకరాల ప్రైవేట్ ఆలయానికి సంబంధించిన ల్యాండ్‌లో ఈ కార్యక్రమం జరగనుంది. ఈ ర్యాలీకి పోలీసులు షరతులతో కూడిన అనుమతులు మంజూరు చేశారు. కరూర్ తొక్కిసలాట ఘటన నేపథ్యంలో శాంతిభద్రతలకు సంబంధించి 84 కండిషన్స్ పెట్టారు. నిర్వాహకులు రూ.50 వేలు సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలని కోరారు.

## ఐసిఐసిఐ బ్యాంకు రికవరీ ఏజెంట్ సజీవదహనం



**ముంబయి, డిసెంబరు 15:** మహారాష్ట్రలోని లాతూర్ జిల్లాలో అత్యంత దారుణమైన ఘటన వెలుగుచూసింది. ఓ యువకుడిని గోనె సంచిలో కట్టి, కారులో బంధించి నిప్పంటించి సజీవదహనం చేశారు. ఈ ఘటన నిన్న జరుగగా, పోలీసులు దీనిని హత్యగా నిర్ధారించి దర్యాప్తు ప్రారంభించారు. ఆసా తాండకు చెందిన గణేశ్ చవాన్ అనే యువకుడు ఐసీఐసీఐ బ్యాంకులో రికవరీ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. గుర్తుతెలియని వ్యక్తులు అతడిని ఓ సంచిలో బంధించి, అతని కారులోనే ఉంచి నిప్పంటించారు. గణేశ్ ఫోన్ స్విచాఫ్ వస్తుండటంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు, స్నేహితులు అతని కోసం గాలించారు.

## నటిపై లైంగిక దాడి కేసులో ఆరుగురికి 20యేళ్ల జైలు శిక్ష

**తిరువనంతపురం, డిసెంబరు 15:** మలయాళ చిత్ర పరిశ్రమను కుదిపేసిన ప్రముఖ నటిపై లైంగిక దాడి కేసులో ఎర్నాకుళం సెషన్స్ కోర్టు ఆరుగురిని దోషులుగా నిర్ధారించి, వారికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. ఈ తీర్పుపై బాధిత నటి సోషల్ మీడియా ద్వారా స్పందిస్తూ, 8 ఏళ్ల 9 నెలల 23 రోజుల బాధాకరమైన ప్రయాణంలో ఇప్పుడు ఉపశమనం కలిగిందని పేర్కొన్నారు. ఆమె పోస్టును ప్రముఖ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ షేర్ చేస్తూ, నమస్కారం ఎమోజీతో తన మద్దతు తెలిపారు. ఈ తీర్పుపై నటి మంజు వారియర్ కూడా స్పందిస్తూ, బాధితురాలికి పూర్తి న్యాయం జరగలేదని అభిప్రాయపడ్డారు. "నేరం చేసిన వారికి శిక్ష పడింది. కానీ, ఈ దారుణానికి ప్లాన్ చేసిన అసలు వ్యక్తి స్వేచ్ఛగా తిరుగుతున్నాడు. అది భయంకరమైన విషయం.


## తమిళనాడులో బిజెపి ఆటలు సాగనీయం: సిఎం స్టాలిన్

**చెన్నై,డిసెంబరు 15:** ఇది తమిళనాడు ఇక్కడ బీజేపీ ఎప్పటికీ గెలవలేదు. ఇక్కడ ఆ పార్టీ ఆటలు సాగవు.అహంకారం కలిగిన ఏ పార్టీకి ఇక్కడ అవకాశం లేదు. అలాంటి ఏ రాజకీయ శక్తినైనా మేం ప్రతిఘటిస్తామని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ అన్నారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల తర్వాత తమ లక్ష్యం తమిళనాడు అని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఇటీవల వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో స్టాలిన్ పైవిధంగా మాట్లాడారు. తిరువణ్ణామలై జిల్లాలో జరిగిన పార్టీ యూత్ వింగ్ నార్త్ జోన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అమిత్ షా లేదా సంఘ పరివార్ తమిళనాడులో విజయం సాధించలేరని అన్నారు. బీజేపీ తమిళ ప్రజల ఆలోచనను ఎప్పటికీ అర్థం చేసుకోలేదని ఆయన అన్నారు. ప్రేమతో మా వద్దకు వస్తే ఆలింగనం చేసుకుంటామని, అహంకారంతో వస్తే మాత్రం తలవంచే పరిస్థితి లేదని అన్నారు.

# శాశ్వత భద్రత హామీ ఇస్తే నాటో సభ్యత్వం డిమాండ్ వదులుకుంటాం!

**మా భూభాగాలను వదులుకునే ప్రసక్తే లేదు**

**శాంతిచర్చల్లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ**



**కీవ్, డిసెంబరు 15:** రష్యాతో యుద్ధాన్ని ముగించే దిశగా ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ కొత్త ప్రతిపాదన చేశారు. పశ్చిమ దేశాలు తమకు స్పష్టమైన భద్రతా హామీలు ఇస్తే, నాటో కూటమిలో చేరాలన్న తమ ప్రయత్నాలను విరమించుకోవడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన ప్రకటించారు. అయితే, రష్యాకు భూభాగాన్ని అప్పగించాలన్న అమెరికా ఒత్తిడిని మాత్రం తీవ్రంగా వ్యతిరేకించారు. ఆదివారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రత్యేక రాయబారులు స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నర్‌లతో జరిపిన చర్చల సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా, కొన్ని ఐరోపా దేశాలు నాటో సభ్యత్వానికి అంగీకరించనందున, కనీసం ఆ కూటమి సభ్యులకు లభించే తరహాలో తమకు భద్రతా హామీలు ఆశిస్తున్నామని జెలెన్‌స్కీ తెలిపారు. భవిష్యత్తులో రష్యా మళ్లీ దాడి చేయకుండా ఈ హామీలు నిరోధిస్తాయని, ఇది తమ వైపు నుంచి ఒక రాజీ సూత్రమని ఆయన పేర్కొన్నారు. ఈ హామీలకు అమెరికా కాంగ్రెస్ చట్టబద్ధమైన మద్దతు ఉండాలని ఆయన తెలిపారు. తూర్పు దొనెట్స్క్ ప్రాంతం నుంచి ఉక్రెయిన్ వైదొలగినట్లు చెప్పారు.

# అణునిఘా పరికరం ఏర్పాటు కాంగ్రెస్ పాపమే!

**బిజెపి సీనియర్‌నేత నిషికాంత్ దూబే**

**న్యూఢిల్లీ, డిసెంబరు 15:** మాజీ ప్రధాన మంత్రులు జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీలు భారత్‌లోని ఒక పర్వతంపై నిఘా పరికరం అమర్చేందుకు అమెరికా కు అనుమతిచ్చారని బీజేపీ సీనియర్ నేత, ఎంపీ నిషికాంత్ దూబే సంచలన ఆరోపణలు చేశారు. ఈ మేరకు సోమవారం ఎక్స్ వేదికగా ఆయన ఒక పోస్టుపెట్టారు. చైనా కార్యకలాపాలపై నిఘా కోసం మన దేశంలో అమెరికాకు చెందిన సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ నేతృత్వంలో కోవర్ట్ ఆపరేషన్ దశలవారీగా జరిగిందని, నెహ్రూ హయాంలో తొలిసారి అణు ఆధారిత నిఘా పరికరాన్ని నందాదేవీ పర్వత శిఖరాన ఉత్తరాఖండ్‌లో అమర్చేందుకు అనుమతించారని దూబే తన పోస్టులో పేర్కొన్నారు. తర్వాత ఇందిరాగాంధీ హయాంలోనూ అందుకు అనుమతి లభించిందని ఆరోపించారు. ఆ తర్వాత అగ్రరాజ్యం నందాదేవి నుంచి తన కార్యకలాపాలను ఉపసంహరించుకుందని దూబే తెలిపారు. పర్యావరణపరంగా సున్నితమైన హిమాలయన్ ప్రాంతంలో ఆ ప్రమాదకర పరికరాన్ని వదిలేసి వెళ్లిపోయిందని పేర్కొన్నారు.



## పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా

# కల్యాణం శివశ్రీనివాస్

### - హోంమంత్రి అనిత సమక్షంలో బాధ్యతలు స్వీకరణ

విజయవాడ, డిసెంబరు 15 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా కల్యాణం శివ శ్రీనివాస్ (కె. కె) నియమితులయ్యారు. మంగళగిరి ప్రైమ్ హిల్ క్రెస్ట్‌లోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ పోలీస్ హౌసింగ్ హెడ్ క్వార్టర్స్‌లో సోమవారం పదవీ బాధ్యతల చేపట్టారు. కార్యాలయంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన అనంతరం సీటులో ఆశీనులయ్యారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హోం మంత్రి వంగలపూడి అనిత, జనసేన ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, చిల్లపల్లి శ్రీనివాసరావు, చక్రవర్తి, పలువురు కూటమి పార్టీల నేతలు పాల్గొన్నారు. బాధ్యతలు స్వీకరించిన శివ శ్రీనివాస్‌కు హోం మంత్రి అనిత, కార్పొరేషన్ ఎండి రవిప్రకాష్, జనరల్ మేనేజర్ (ఫైనాన్స్) సీతారామరాజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ ఏపీ పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ తరపున అనేక మంచి కార్యక్రమాలు జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.509 కోట్లతో అనేక భవనాల నిర్మాణం చేశామన్నారు. అలాగే అనేక మోడల్ పోలీస్ స్టేషన్‌ల నిర్మాణం చేపట్టామని వివరించారు. నేడు పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చేతిలో వెయ్యి కోట్ల ప్రాజెక్టులు ఉన్నాయని తెలిపారు. ఎపి రాష్ట్ర పోలీసు గృహ నిర్మాణ సంస్థ ఛైర్మన్ కళ్యాణం శ్రీనివాస్ మాట్లాడుతూ తనకు ఈ అవకాశం ఇచ్చిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## కారు ఢీకొని వైద్య విద్యార్థిని మృతి



**హైదరాబాద్ (హయత్‌నగర్), డిసెంబరు 15, ప్రభాతవార్త:** కారు ఢీకొని వైద్యవిద్యార్థిని మృతి చెందగా ఆమె తండ్రి గాయపడిన సంఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం హయత్ నగర్‌లోని వినాయక నగర్‌కాలనీకి చెందిన కంసాని పాండు కుమార్తె ఐశ్వర్య(19) మహబూబ్ నగర్‌లో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. 15న ఉదయం 7 గంటలకు ఐశ్వర్య తన తండ్రితోపాటు హయత్‌నగర్‌లో ఆర్టీసీ కాలనీ వద్ద రోడ్డు దాటుతుండగా ఎల్‌బీనగర్ వైపు నుండి అతివేగంగా వచ్చిన క్రెట్ట కారు వారిని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఐశ్వర్య తీవ్రంగా గాయ పడి ఘటనాస్థలంలోనే మృతి చెందగా.. ఆమె తండ్రికి కాలు విరిగింది. పాండు హయత్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పాండు సోద రుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# రెవెన్యూలో సమస్యలు కోకొల్లలు!

## డాట్ ల్యాండ్ సమస్యలు ఎన్నెన్నో...

- చుక్కల భూముల సమస్యలపై దళారుల కన్ను
- అమాయక రైతులను మోసం చేస్తున్న వైనం
- గ్రీవెన్స్ సెల్స్‌లోనూ ఫిర్యాదుల వెల్లువ
- కలెక్టర్ల సదస్సులోనైనా పరిష్కారం జరిగేనా?

సచివాలయం, డిసెంబరు 15 ప్రభాతవార్త: రెవెన్యూ లోపాలు సవరించడంలో అధికారులతో పాటు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి విఫలమయ్యారని ఆరోపణలు రైతుల నుండి వినవస్తున్నాయి. 22ఏ లో ఉన్న భూములకు మినహాయింపు ఇవ్వాలంటూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తొలినాళ్ళలోనే ముఖ్యమంత్రి ప్రకటించినప్పటికీ ఇంతవరకు అది ఆచరణ సాధ్యం కాలేదు. ఆ సమస్యపై రెవెన్యూ మంత్రి పలుమార్లు అధికారులతో సమీక్షలు నిర్వహించినప్పటికీ రైతులకు మాత్రం న్యాయం జరగలేదు. అమరావతి మండల పరిధిలోని వైకుంఠపురం రెండో విడత పూలింగ్‌కి తీసుకుంటున్నప్పటికీ అక్కడ అది ప్రధాన సమస్యగా ఉండడం గమనార్హం.ఆ గ్రామంలోల దాదాపు 20శాతం భూములు 22ఏ లోనే ఉండడంతో సిఆర్డిఎ అధికారులకు తల పట్టుకోవాల్సిన పరిస్థితి ఎదురైంది. రాష్ట్రవ్యాప్తంగా వేలాదిమంది రైతులు ఆర్థిక ఇబ్బందులు తీర్చుకునేందుకు సన్న చిన్నకారు రైతులు భూములు అమ్ముకోవాలంటే 22ఏ అడ్డంకిగా మారటం తెలిసిన విషయమే. ఈ విషయంపైనే గతంలో ఎన్నికల పర్యటనకు వచ్చినప్పుడు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు పలు జిల్లాల నుండి ఈ సమస్యల ఎదురైంది దీన్ని అధికారం చేపట్టిన మరుక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో జరిగే ప్రతి క్యాబినెట్ సమావేశంలోనూ రెవెన్యూ సమక్షలో ముఖమంత్రి రెవెన్యూశాఖ మంత్రికి రెవెన్యూ అధికారులకు పలుమార్లు సూచించినప్పటికీ పరిష్కారానికి నోచుకోకపోవడంతో రైతులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. మరి ముఖ్యంగా దేవాదాయ శాఖ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాల్సిన బాధ్యత రెవెన్యూ అంతరంగంపై ఉండగా ఆ విషయాలపై కూడా అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ఇటీవల రెవెన్యూ సమస్యల్లో ప్రధానంగా ఫిర్యాదుల వచ్చాయి. ఈ నెలలో జరిగిన రెవెన్యూ సమీక్షలో ప్రతి జిల్లాకు ప్రత్యేకంగా జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో డాట్ ల్యాండ్ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అయితే క్షేత్రస్థాయిలో రెవెన్యూ యంత్రాంగం ఈ సమస్యపై దృష్టి సారించక పోవడం ఉన్నతాధికారులు కూడా చూసి చూడనట్లు వ్యవహరించడం జరుగుతుందని రైతులు విమర్శిస్తున్నారు. చుక్కల భూములను సాకుగా చూపి రెవెన్యూ అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారని పలుమార్లు ఫిర్యాదులు అందినా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంపై అధికారులను రైతులు తప్పుపడుతున్నారు. అసైన్డ్ భూములను క్రమబద్ధీకరించే క్రమంలో చుక్కల భూములకు పరిష్కారం చూపిస్తామంటూ కొందరు దళారులు రెవెన్యూ యంత్రాంగంతో పరిచయాలను సాకుగా చూపి అమాయక రైతులను మోసం చేస్తున్న సంఘటనలో భాగంగా పలు ఫిర్యాదులు అందాయి. రాష్ట్రంలో రెవెన్యూ సమస్యలు తీవ్రంగా రైతన్న ఎదుర్కొంటున్నప్పటికీ పరిష్కరించే క్రమంలో రెవెన్యూ మంత్రి కఠినంగా వ్యవహరించక పోవడంపై రాష్ట్ర వ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా రెవెన్యూ ఉన్నతాధికారులు ఈ విషయంపై దృష్టి సారించి ముఖ్యమంత్రి ఆదేశాలను నెరవేర్చాలని లేదంటే ధర్నాలు చేసేందుకు కూడా సిద్ధంగా ఉన్నట్లు పలువురు రైతులు వివరిస్తున్నారు.




## కదం తొక్కిన కలువాయి ప్రజలు

### - ప్రజల వద్దకే కలెక్టర్ శుక్ల వచ్చి అర్జీ స్వీకరణ

నెల్లూరు కలెక్టరేట్, డిసెంబరు 15 ప్రభాతవార్త: ఆత్మకూరు రెవెన్యూ డివిజన్లో ఉన్న కలువాయి మండలాన్ని గూడూరు రెవిన్యూ డివిజన్‌కు మారుస్తూ వెలువడిన గెజిట్ వలన కలువాయి మండల ప్రజల్లో ఆందోళన నెలకొంది. అందులో భాగంగా సోమవారం కలువాయి మండల ప్రజలు 100 కార్లతో, 5 ప్రవైట్ బస్సులలో 500 మంది నెల్లూరు చేరుకొని నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్ వద్ద నుంచి కలెక్టరేట్ వరకు తిరుపతి జిల్లా వద్దు నెల్లూరు జిల్లా ముద్దు, సేవ్ కలవాయి, ఐ వాంట్ జస్టిస్ అంటూ నినాదాలతో ర్యాలీ చేస్తూ మండల ప్రజలు హోరెత్తించారు. భారీ సంఖ్యలో మండల ప్రజలు పాల్గొన్నారు. కలువాయి మండల ప్రజలు నెల్లూరు జిల్లాలోనే కలువాయి మండలం ఉండాలని కోరుతూ తిరుపతి వద్దు, నెల్లూరు ఏ ముద్దు అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ కలువాయి మండల ప్రజలు భారీ ప్రదర్శన చేపట్టి అనంతరం 50 మంది జేఏసీ నాయకులకు కలెక్టరేట్ ప్రాంగణంలో స్వయాన జిల్లా కలెక్టర్ హిమాన్సు శుక్ల వారి వద్దకు వచ్చి అర్జీ స్వీకరించారు. కలవాయి మండల ప్రజల ఆకాంక్షను తప్పకుండా ప్రభుత్వానికి నివేదిస్తానని కలెక్టర్ హిమాన్షు శుక్ల జేఏసీ నాయకులకు హామీ ఇచ్చారు. జేఏసీ నాయకులతో పాటు ఏడిపిఎస్ ఎంఆర్‌పిఎస్ సంఘాలు, టీచర్స్ యూనియన్ నాయకులు కూడా నెల్లూరులోని ఉంచాలని కోరుతూ అర్జీని సమర్పించారు.




# అటల్ సంస్కరణలే నేటి అభివృద్ధి

- బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్
- నెల్లూరులో వాజ్‌పేయి విగ్రహావిష్కరణ

నెల్లూరు అగ్రికల్చర్, డిసెంబరు 15 ప్రభాతవార్త: దేశంలో అతి పెద్ద పార్టీగా భారతీయ జనతా పార్టీ అవతరించేందుకు భారతరత్న, మాజీ ప్రధాని స్వర్గీయ అటల్ బిహారి వాజ్ పేయి తెచ్చిన సంస్కరణలే కారణమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ అన్నారు. సోమవారం నెల్లూరులోని హరనాథపురం సెంటర్ వరకు సాగిన బస్సు యాత్రలో భాగంగా కూటమి నేతలు, మంత్రులతో కలిసి హరనాథపురం కూడలిలో ఏర్పాటు చేసిన అటల్ బిహారి వాజ్ పేయి విగ్రహాన్ని పీవీఎన్ మాధవ్ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన అటల్ మోడీ పరిపాలన యాత్ర బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. అటల్ బిహారి వాజ్ పేయి శత్ జయంతి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా సుపరిపాలన బస్సు యాత్రను చేపట్టాలని తెలిపారు. మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి ఒక సామాన్య కుటుంబంలో పుట్టి సుదీర్ఘ రాజకీయం నేతగా ఎదిగి ఉన్నత స్థానాన్ని అధిరోహించాలని వెల్లడించారు. భారత్ పాకిస్థాన్ ఏ వ్యవస్థ కారణంగా రెండుగా విడిపోయిందో అలాంటిది మళ్లీ జరగకూడదని ఆయన ఆశించారని చెప్పారు. 70 ఏళ్లకు పైగా సుదీర్ఘ రాజకీయ జీవితంలో 60 ఏళ్ల పాటు పార్లమెంటేరియన్‌గా కొనసాగిన మహోన్నత వ్యక్తి వాజ్‌పేయి అన్నారు. ఆయన తెచ్చిన సంస్కరణల్లో భాగంగా జాతీయ రహదారుల నిర్మాణం గ్రామీణ ప్రాంతాలలో రోడ్లు, పనికి ఆహార పథకం, సర్వశిక్ష అభియాన్, గ్యాస్ కనెక్షన్లు, టెలికం కనెక్షన్లు తదితర రంగాల దేశాభివృద్ధికి ఆయన ఆధ్యుడని కొనియాడారు. నెల్లూరులోని హరినాథపురం కూడలిని అటల్ బిహారి వాజ్‌పేయి కూడలిగా నామకరణం చేయాలని సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పందిస్తూ ఈ సెంటర్ రూరల్ నియోజకవర్గ ప్రాంతంలో ఉంది గనుక ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితో సంప్రదించి వాజ్‌పేయి లాంటి మహనీయుల పేరు ఈ జిల్లాలో నిలిచిపోయేలా ముఖ్యమంత్రి అనుమతితో ఈ సెంటర్‌కు ఆయన పేరును నామకరణం చేసేందుకు కంకణబద్దులం అవుతామని హామీ ఇచ్చారు. తొలుత సభను ఉద్దేశించి మంత్రి రామనారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో గత ఐదేళ్ల విధ్వంసకర పరిపాలన అనంతరం అభివృద్ధి, సుస్థిర పాలన వైపు నడిపించేందుకు మూడు పార్టీలు కృషి చేస్తున్నామని చెప్పారు. అనంతరం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ ఒక సామాన్య కుటుంబంలో పుట్టిన వాజ్‌పేయి మహోన్నత వ్యక్తిగా అసాధారణ స్థాయికి చేరుకున్నారని ఆయన జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని మూడు సార్లు దేశానికి ప్రధానిగా పని చేసినా, అవినీతి మరక అంటని వ్యక్తిగా కొనసాగారని వెల్లడించారు. అనంతరం సభను ఉద్దేశించి కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.సురేందర్‌రెడ్డి, ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, మాజీ మంత్రి సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు బీదా మస్తాన్‌రావు, పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, తదితరులు ప్రసంగించారు. మాజీ ప్రధాని వాజ్‌పేయి సేవలనుగుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నేతలు కర్నాటి ఆంజనేయరెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, బీజేపీ జిల్లా అధ్యక్షులు సిపారెడ్డి వంశీధర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వాకాటి నారాయణరెడ్డి, దుగ్గిశెట్టి సుజయ్ కుమార్, కందుకూరు సత్యనారాయణ, ఆర్డీ విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

# తీర ప్రాంత అభివృద్ధికి మణిహారం వందేభారత్ రైలు



### - నరసాపురం నుండి మరిన్ని రైళ్లకు కృషి

### - కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ

నరసాపురం, డిసెంబరు 15 ప్రభాతవార్త: రైలు ప్రయాణం వర్తక, వాణిజ్య వ్యాపారాలకు, తీర ప్రాంత మత్స్య పరిశ్రమ అభివృద్ధిలో కోస్తా జిల్లా మణిహారంగా నిలుస్తుందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ అన్నారు. సోమవారం నరసాపురం చెన్నై వందే భారత్ రైలును కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అశేష జనవాహిని మధ్య లాంఛనంగా జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కనుమూరి రఘురామకృష్ణంరాజు, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయ్మా అస్మి, నరసాపురం, తాడేపల్లి గూడెం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ లు బొమ్మిడి నాయకర్, బొలిశెట్టి శ్రీనివాస్, భీమవరం శాసనసభ్యులు మరియు పి ఎస్ సి చైర్మన్ పులపర్తి రామాంజనేయులు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, రాష్ట్ర మహిళా ఆర్థిక కార్పొరేషన్ చైర్పర్సన్ పీతల సుజాత, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ షరీఫ్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ మాట్లాడుతూ వర్తక, వాణిజ్య వ్యాపారాలకు, మత్స్య పరిశ్రమ అభివృద్ధికి వందే మాతరం రైలు నరసాపురం వరకు పొడిగింపుతో ఈ ప్రాంతం విశేషంగా అభివృద్ధి చెందుతుందన్నారు. మత్స్య పరిశ్రమ పురోభివృద్ధి చెందాలంటే రైలు కనెక్టివిటీ చాలా ముఖ్యమన్నారు. నర్సాపురం నుండి హైదరాబాద్, బెంగళూరు వెళ్లే వందే భారత్ రైలు సర్వీసుల కోసం సంబంధిత కేంద్ర మంత్రితో, అధికారులతో చర్చలు జరుపుతున్నట్లు శ్రీనివాస వర్మ తెలిపారు. సికింద్రాబాద్ నుండి విశాఖ పట్నం వెళ్లే వందే భారత్ రైలు తాడేపల్లి గూడెంలో కూడా ఆగేలా ఏర్పాటు చేస్తానన్నారు. జిల్లా అభివృద్ధికి నరసాపురం లూప్ లైన్‌లో ఉన్న ప్రాంతాన్ని కూడా కలుపుతూ కొత్త రైల్వే సర్వీసుల కోసం చర్యలు తీసుకుంటానని తెలిపారు. అరుణాచలం ఎక్స్‌ప్రెస్‌ను రెగ్యులర్ చేస్తామని ఇక్కడి నుండి వారణాసికి ఎక్స్‌ప్రెస్‌ను తెచ్చేందుకు కృషి జరుగుతుందన్నారు.

## డిఫాల్ట్ బెయిలు రద్దు... పిటిషన్లపై సుప్రీంలో విచారణ వాయిదా

విజయవాడ, డిసెంబరు 15 ప్రభాతవార్త ప్రతినిధి: ఎపి మద్యం కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. కేసులో నిందితులుగా ఉన్న బాలాజీ గోవిందప్ప, ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి దాఖలు చేసిన పిటీషన్లపై సుప్రీంకోర్టు విచారణను వాయిదా వేసింది. ఈ ముగ్గురు నిందితుల పిటీషన్లపై విచారణను వచ్చే నెల జనవరి 21వ తేదీకి సుప్రీంకోర్టు ధర్మాసనం వాయిదా వేసింది. ట్రయల్ కోర్టు మొదట్లో మంజూరు చేసిన 'డిఫాల్ట్ బెయిలు'ను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రద్దు చేయడాన్ని సవాలు చేస్తూ నిందితులు సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. హైకోర్టు ఆదేశాల ప్రకారం లొంగిపోవాల్సిన గడువును సుప్రీంకోర్టు గతంలో నిలుపుదల చేస్తూ నిందితులకు తాత్కాలిక ఉపశమనం కల్పించింది. తాజా విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలు దాఖలు చేసిన కౌంటర్ పిటీషన్లపై రిజాయిండర్ దాఖలు చేయడానికి నిందితుల తరపు న్యావాదులు కోర్టును మరింత సమయం కోరారు. ఈ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు తదుపరి విచారణను వచ్చే నెల 21కి వాయిదా వేసింది.

# వామపక్షనేతలపై కేసులు కొట్టివేత

విజయవాడ, డిసెంబరు 15 ప్రభాతవార్త ప్రతినిధి: సిపిఎం, సిపిఐ నేతలపై నాటి వైసిపి ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసును కోర్టు కొట్టివేసింది. 2021 ఫిబ్రవరి 14 వ తేదీన విజయవాడలో అధిక ధరలు, పెట్రోల్, డీజెల్ రేట్ల పెంపుదలకు వ్యతిరేకంగా .. సిపిఎం, సిపిఐ నేతలు, కార్యకర్తలు శాంతియుతంగా ఆందోళన నిర్వహించారు. నాటి వైసిపి ప్రభుత్వం.. సిపిఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి పి. మధు, సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్. బాబూరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్‌పై సెక్షన్లు 341, 188, 269, 143 ఆర్/డబ్ల్యు 149 ఐపిసి కింద కేసులు నమోదు చేశారు. ఎఫ్ఐఆర్ 2013 / 21గా నమోదయింది. అప్పటినుండి పలు దఫాలుగా విచారించిన కోర్టు కేసును కొట్టివేసింది. విజయవాడ మూడవ అడిషనల్ మెజిస్ట్రేట్ కేసుపై విచారణ చేపట్టి అక్రమ కేసుగా నిర్ధారించి కొట్టివేశారు. ఈ కేసులో ప్రముఖ న్యాయవాదులు ఎస్.రమేష్, ఎన్. సాయిశంకర్, జివి రాజు న్యాయసహాయం అందించారు.

### గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను

# బిఎల్‌ఓ విధుల నుంచి తప్పించాలి

### సిఎంకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య లేఖ

విజయవాడ, డిసెంబరు 15 ప్రభాతవార్త ప్రతినిధి: గామ, వార్డు సచివాలయ ఉద్యోగులను ఎన్నికల బూత్ స్థాయి అధికారి (బీఎల్‌వో) విధుల నుంచి తప్పించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. పని ఒత్తిడితో అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు ఆయన సీఎం చంద్రబాబుకు ఒక లేఖ రాశారు. సచివాలయ ఉద్యోగులు అదనపు పనిభారంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సచివాలయ ఉద్యోగులు ఇప్పటికే 16 రకాల సర్వేలతో పాటు ఇతర పనులతో తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ పని భారానికి అదనంగా ఎన్నికల విధులు కూడా తోడవడంతో వారు తీవ్ర అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు నెలల్లోనే పని ఒత్తిడి కారణంగా నలుగురు సచివాలయ ఉద్యోగులు మరణించడం అత్యంత బాధాకరమని ఆయన తెలిపారు. ఇదే సమయంలో కర్నూలు జిల్లాలో 600 మందికి పైగా సచివాలయ ఉద్యోగులకు అధికారులు షోకాజు నోటీసులు జారీ చేయడాన్ని ఆయన తప్పు బట్టారు. ఇది దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. వెంటనే ప్రభుత్వం స్పందించి సచివాలయ ఉద్యోగులపై పని భారం తగ్గించాలని, వారిని బీఎల్‌వో విధుల నుంచి మినహాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఈశ్వరయ్య విజ్ఞప్తి చేశారు.

# చర్చకు సిద్ధం

### వైఎస్సార్సీ నాయకులకు మంత్రి కొండపల్లి సవాల్



విజయనగరం, డిసెంబరు 15 ప్రభాత వార్త ప్రతినిధి; మెడికల్ కళాశాలలకు సంబంధించి పిపిపి విధానంపై వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని, ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆరోపించారు. అసలు పిపిపి విధానంపై వైసీపీకి గానీ ఆ పార్టీ నాయకులకు గానీ ఎలాంటి అవగాహనా లేదని విమర్శించారు. ఒకవేళ ఉంటే పిపిపి విధానంపై చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని, వేదిక వాళ్ళు డిసైడ్ చేసినా సరే తనను డిసైడ్ చెయ్యమన్నా సరే... తాను రెడీ అని వైసీపీ నాయకులను సవాల్ చేశారు. విజయనగరంలో సోమవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ పిపిపి విధానానికి సంబంధించి వైసీపీ నాయకులు అనుసరిస్తున్న ధోరణిని తప్పుబట్టారు. కోటి సంతకాల సేకరణ అనేది ఒక విడ్డూరమని ఆక్షేపిస్తూ నిజానికి వైసీపీ నాయకులు గ్రామాల్లోని అమాయక ప్రజలను తప్పుదోవ పట్టించి వాళ్ళ చేత బలవంతంగా సంతకాలు చేయిస్తున్నారని విమర్శించారు. పిపిపి విధానానికి సంబంధించి ప్రభుత్వాన్ని తప్పుబట్టేందుకు ఏమీ లేదని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు. వైసీపీ హయాంలో పదిహేడు మెడికల్ కళాశాలలు మంజూరైతే కేవలం నాలుగైదే ఎందుకు మొదలుపెట్టారని, మిగిలినవి ఎందుకు చెయ్యలేదు, చెయ్యలేకపోయారు అని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వైసీపీని ప్రశ్నించారు. పిపిపి విధానంపై వైసీపీ చేస్తున్న కోటి సంతకాల సేకరణ, ర్యాలీలను ఓ ఈవెంట్ మేనేజ్‌మెంట్‌గా టీడీపీ విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు, డిసిసిబి ఛైర్మన్ కిమిడి నాగార్జున అభివర్ణించారు. గత ఎన్నికల్లో తమ సంఖ్యా బలం పదకొండు సీట్లకు పడిపోయిన నేపథ్యంలో కేవలం ఉనికి కోసం తాపత్రయపడుతూ వైసీపీ ఇలాంటి చేష్టలన్నీ చేస్తోందని అపహాస్యం చేశారు.

# అసెంబ్లీకి రండి

### - వైఎస్సార్సీ ఎమ్మెల్యేలకు

### మంత్రి మండపల్లి రాంప్రసాద్‌రెడ్డి పిలుపు



కడప, డిసెంబరు 15 ప్రభాతవార్త బ్యూరో: వైద్య కళాశాలల ప్రైవేటి కరణపై వైసిపి నాయకులు కోటి సంతకాల పేరుతో నానా యాగి చేస్తున్నారని మంత్రి మండిపల్లి రాం ప్రసాద్‌రెడ్డి మండి పడ్డారు. వైసిపి సభ్యులుగా ఎక్కువగా ఉన్న శాసనమండలికి వెళ్తారు తప్ప 11 మంది ఎమ్మెల్యేలు ఉన్నా అసెంబ్లీకి ఎందుకు హాజరవ్వడం లేదో చెప్పాలన్నారు. రాష్ట్రంలో కోటి సంతకాలు చేసిన పుస్తకాలను గవర్నర్‌కు అందజేస్తామనే బదులు, వచ్చే శీతాకాల సమావేశల్లో అసెంబ్లీకి వస్తే ప్రజా సమస్యలపై చర్చిద్దాం అన్నారు. ప్రజలు మనకు ఓట్లేసి మనల్ని గెలిపించినప్పుడు మాట్లాడే హక్కు మనకు ఉంటుందని, ఏదైనా అసెంబ్లీ సాక్షిగా తేల్చుకోవాలే తప్పా మీ కింద ఉన్న క్యాడర్‌ను ఉత్తేజపరిచేందుకో లేక మీ ఉనికిని కాపాడుకునేందుకో కాదన్నారు. బిర్యానీ పొట్లాలు, మందు బాటిల్ ఇచ్చి కలెక్టరేట్లను ముట్టడించడం భావ్యం కాదని, ఇప్పటికైనా జగన్మోహన్ రెడ్డి మేల్కొని ప్రజా సమస్యలపై అసెంబ్లీలో పోరాడాలన్నారు. ఇప్పుడు ప్రజలు ఎంతో చిత్తశుద్ధితో ఉన్నారని, రాబోయే లోకల్ బాడీ ఎన్నికల్లో కూడా వైసీపీకి పరాభవం తప్పదని జోష్యం చెప్పారు. ఇవన్నీ తెలిసే వైసిపి ఇలాంటి పనులు చేస్తున్నారని ఆరోపించారు.

# అమరావతిలో పొట్టి శ్రీరాములు మెమోరియల్ పార్క్



విజయవాడ, డిసెంబరు 15 ప్రభాతవార్త ప్రతినిధి: ఏపీ రాజధాని అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ పార్క్ పనులు వేగంగా జరుగుతున్నాయని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం నెల్లూరులో నిర్వహించారు. అందులో భాగంగా నెల్లూరులో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహం వద్దకు వెళ్ళారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మార్గదర్శనం మేరకు పొట్టి శ్రీరాములు జన్మించిన ప్రాంతాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి నారాయణ వివరించారు. అంతేకాకుండా పొట్టిశ్రీరాములు గౌరవార్థం రాజధాని అమరావతిలో చేపట్టిన పొట్టి శ్రీరాములు మెమోరియల్ పార్క్ పనులు వేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. 58 అడుగుల ఎత్తైన పొట్టి శ్రీరాములు విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్టు మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు.

## ఎల్ఐసి ప్రైవేటీకరణ వద్దు...

# ఆ నిర్ణయం ఉపసంహరించుకోండి

### కేంద్ర ప్రభుత్వానికి సిపిఐ విజ్ఞప్తి



చిత్తూరుహెల్త్, డిసెంబరు 15 ప్రభాతవార్త: దేశంలో అతిపెద్ద ఇన్సూరెన్స్ కంపెనీగా ప్రభుత్వ రంగ ఆధ్వర్యంలో కొనసాగుతున్న లైఫ్ ఇన్సురెన్స్ కార్పొరేషన్‌ను ప్రైవేటుపరం చేయాలనే నిర్ణయంను కేంద్ర ప్రభుత్వం సత్వరం ఉపసంహరించుకోవాలని రాష్ట్ర సిపిఐ కార్యదర్శివర్గ సభ్యుడు పి.హరినాధరెడ్డి డిమాండ్ చేశారు. చిత్తూరులో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశంలో 275 ప్రైవేటు ఇన్సురెన్స్ సంస్థలు ప్రజల విశ్వాసం కోల్పోయిన అనంతరం పాలసీదారులు దెబ్బతినకుండా ప్రభుత్వ రంగం ఆధ్వర్యంలో ఎల్ఐసి ఏర్పాటైందన్నారు. అప్పట్లో ఎల్ఐసి మూల పెట్టుబడి 5 వేల కోట్ల రూపాయలు కాగా, ప్రస్తుతం 2024-25 వార్షిక సంవత్సరంలో రూ.4.88 లక్షల కోట్ల టర్నోవర్ సాధించి, 48 వేల కోట్ల నికర ఆదాయం ప్రభుత్వంకు లభించగా, ఈ ఆర్థిక సంవత్సరంలోనే ప్రభుత్వానికి రూ.7.5 వేల కోట్లు టాక్స్ రూపంలో చెల్లించిందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పాలసీదారులకు ఉత్తమ సేవలు అందిస్తున్న ఎల్ఐసిని ప్రైవేటు పరం చేసే నిర్ణయంను కేంద్ర ప్రభుత్వం తీసుకోవడం దారుణమన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర సిపిఐ కార్యవర్గ సభ్యుడు ఎ.రామానాయుడు, ఇతర సిపిఐ నాయకులు పాల్గొన్నారు.



## వసతి సముదాయాల్లో మరింత మెరుగైన సేవలు

### - సౌకర్యాలపై భక్తులతో మాట్లాడిన ఛైర్మన్ నాయుడు

**తిరుమల,డిసెంబర్ 15ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలకొండపై సామాన్యభక్తులకు ఉచితంగా వసతి సదుపాయం కల్పిస్తున్న యాత్రికుల వసతిసముదాయాల్లో(పిఎసి)మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించి,నాణ్యమైన సేవలందించేలా చూస్తామని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు వెల్లడించారు. యాత్రికుల వసతి సముదాయాల్లో ఇప్పటికే భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ, కల్యాణకట్ట, లాకర్లు,విశాలమైన హాళ్ళలో విశ్రాంతి తీసుకుంటున్నారు. తిరుమలలో ఐదు వసతి సముదాయాలు ఉన్నాయి. వీటిల్లో పిఎసి 2ను సోమవారం మధ్యాహ్నం ఛైర్మన్ బిఆర్‌నాయుడు బోర్డు సభ్యులు శాంతారాం, నరేశ్, టిటిడి డిప్యూటీ ఇఒ భాస్కర్, ఇఇ వేణుగోపాల్,తో కలసి తనిఖీలు చేశారు. సామాన్యభక్తులకు ఇక్కడ లాకర్ల కేటాయింపు, కల్యాణకట్టలో క్షురకుల సేవలు, అందుతున్న సదుపాయాలపై స్వయంగా నేరుగా భక్తులతో మాట్లాడి అభిప్రాయాలు సేకరించారు.భక్తులు వసతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. భోజనశాలలో నాణ్యత పరిశీలించారు.దాతల సహాయంతో యాత్రికుల వసతి సముదాయాలను మరిన్ని అత్యాధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దనున్నట్లు ఛైర్మన్ నాయుడు తెలిపారు.

# కల్తీనెయ్యి కేసులో చిన్నఅప్పన్నకు గడ్డుకాలమే!

## -బెయిల్ పిటిషన్ కొట్టివేత



**తిరుమల,డిసెంబర్ 15ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల లడ్డూలకు కల్తీనెయ్యి సరఫరాచేసిన కేసులో టిటిడి మాజీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డికి కీలకమైన మాజీ వ్యక్తిగత సహాయకుడు(పిఎ)చిన్నఅప్పన్నకు హైకోర్టులో ఊహించని పరిణామం ఎదురైంది. ఆయన తరపున న్యాయవాదులు వారంరోజుల క్రిందట దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు ధర్మాసనం కొట్టివేసింది. కల్తీనెయ్యి కేసులో చిన్నఅప్పన్న పాత్ర అత్యంత కీలకమని, అటు డెయిరీల నిర్వాహకులతో ఇటు టిటిడి అధికారులతో మాట్లాడి కమీషన్లు దండుకున్న వ్యక్తి ఇతనేనని సిబిఐ సిట్ ఆధారాలు సమర్పించింది. ఇప్పటికేచిన్నఅప్పన్న నెల్లూరు జైల్లో రిమాండ్‌లో ఉన్నాడు. ఇప్పుడు ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను ధర్మాసనం కొట్టివేయడంతో తదుపరి ఏమిటనేది ఉత్కంఠ నెలకొంది. కల్తీనెయ్యి సరఫరాచేసిన పాపంలో అసలు సూత్రధారులైన గత టిటిడి పెద్దల అవినీతిగుట్టు రట్టయ్యే అవకాశం కూడా ఉండటంతో సిట్ అధికారులు అన్ని కోణాల్లో కార్యాచరణ సిద్దంచేసుకొంటున్నారు. 2022లో అప్పటి టిటిడి బోర్డు లో కొందరు అక్రమాలు భారీగానే ఉన్నాయని సిట్ అధికారులు ఆధారాలు సేకరించారు.మరింత కీలక సమాచారం సేకరించడానికి అప్పన్నను కస్టడీకి తీసుకునే విషయంలో మరోసారి ముందుకు కదలనుంది. బోలేబాబాడెయిరీతోబాటు ఏఆర్ డెయిరీ,వైష్ణవి డెయిరీ, ప్రీమియర్‌అగ్రిఫుడ్స్‌తో ఒప్పందంతో భారీగా కమీషన్లు 50లక్షల వరకు రాబట్టారనేది సిట్ విచారణలో వెలుగుచూసిన అంశాలు. అప్పన్న బ్యాంకు లావాదేవీలోల్ల 4.50కోట్ల రూపాయలు నిల్వ ఉండటం, ఆయనపేరున కొన్ని చోట్ల 14వరకు స్థలాలు, ప్లాట్లు ఉన్నాయని సిట్ విషయాలు రాబట్టింది.ఇప్పటికే అతనిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు సోమవారం వాదప్రతివాదనలు పూర్తయిన తరువాత ధర్మాసనం ఆయనకు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. టిటిడి తరపున ,సిబిఐ తరపున న్యాయవాదులు చేసిన వాదనలతో హైకోర్టు ధర్మాసనం ఏకీభవించింది. మరీ చిన్నఅప్పన్న బెయిల్ పిటిషన్ తిరస్కరణకు గురవడంతో ఇక ఎలాంటి పరిణామాలు చోటుచేసుకోనుందనేది హాట్‌టాఫిక్‌గా మారింది.

# తిరుమల సమాచారం

## శ్రీవారి దివ్యప్రసాదములు పుస్తకావిష్కరణ



**తిరుమల,డిసెంబర్ 15ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి తిరుమల శ్రీవారి ఆలయ మాజీ ప్రధాన అర్చకుడు డాక్టర్ ఏవి రమణదీక్షితులు రచించిన 'శ్రీవారి దివ్యప్రసాదములు' పుస్తకాన్ని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు ఆవిష్కరించారు. ఏడుకొండల వేంకటేశ్వర స్వామికి సుదీర్ఘకాలం సేవలందించిన, నిత్య కైంకర్యాల్లో భక్తితో పాల్గోన్న రమణదీక్షితులు పూర్తి సమాచారంతో ఈ పుస్తకం వెలువడించారు. తిరుమలేశుని వైఖానస ఆగమంప్రకారం నిర్వహించే కైంకర్యాల్లో నివేదించే అన్నప్రసాదాలు గురించి రమణదీక్షితులు తెలియజేశారు. ఈ పుస్తకం బావుందని మంచి సమాచారం అని ఛైర్మన్ బిఆర్‌నాయుడు అభినందించారు.

## భక్తుల భద్రతకు సమన్వయంతో సేవలు

### - టోకెన్లు ఉన్నవారికే ఆలయంలోనికి అనుమతి

### - జనవరి 2నుండి వ్యూహాంపై అదనపు ఇఒ చౌదరి నిర్దేశం



**తిరుమల,డిసెంబర్ 15ప్రభాత వార్తప్రతినిధి:** పవిత్రమైన వైకుంఠద్వార దర్శనాలకు టోకెన్లు పొందిన భక్తులు తిరుమలకు చేరుకుంటే భద్రతతోబాటు వారిని క్యూలైన్లలో అనుమతించే విషయంలో సంయమనంతో, సమన్వయంతో సేవలందించాలని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి నిర్దేశం చేశారు. తొలి మూడురోజులు దర్శన టోకెన్లు కలిగిన వారిని మాత్రమే ఆలయంలోనికి అనుమతించాలని, లేనివారిని తిరుమలలోనే పలు ఆలయాలు సందర్శించేలా చూడాలన్నారు. ఎక్కడా లోటుపాట్లు లేకుండా క్యూలైన్ల నియంత్రణ, వాహనాల పార్కింగ్, భక్తులను అనుమతించే విషయంలో వ్యూహాత్మకంగా పనిచేయాలని ఆదేశించారు. పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలపై టిటిడి విజిలెన్స్, తిరుమల పోలీసు అధికారులతో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఇఒ వీరబ్రహ్మం, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్ఒ మురళీకృష్ణ, అదనపు ఎస్పీ రామకృష్ణ, ఐటి జిఎం ఫణికుమార్‌నాయుడుతో కలసి సోమవారం రాత్రి పద్మావతి విశ్రాంతి భవనంలో సమీక్షించారు. భక్తులకు చిన్నపాటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. భక్తులు ప్రశాంతంగా సాఫీగా వైకుంఠ దర్శనం చేసుకునేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# తిరుపతిలో 'హెల్మెట్' టెర్రర్!

## - స్వయంగా జిల్లా కలెక్టర్,ఎస్పీలు ధరించి ఆదర్శం



**తిరుపతి,డిసెంబర్ 15ప్రభాతవార్తప్రతినిధి:** రోడ్డుప్రమాదాల నియంత్రణతోబాటు ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరుతూ తిరుపతి జిల్లాలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. హెల్మెట్ ధరించండి..ప్రాణాలు కాపాడుకోండి అనే నినాదంతో చేపట్టిన ర్యాలీలో ఇందులో భాగంగా తొలిరోజు సోమవారం ఉదయం వాహనదారుల్లో అవగాహన, చైతన్యం తీసుకవచ్చేలా స్వయంగా తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెలసుబ్బరాయుడు హెల్మెట్ ధరించి బుల్లెట్‌పై సవారీ చేశారు. వాహనం ఎక్కేముందు తలకు హెల్మెట్ పెట్టుకోవాల్సిందేనని ఆ ఇద్దరు అధికారులు ఆదర్శంగా నిలిచారు. సోమవారం ఉదయం తిరుపతి నగరంలో చేపట్టిన ర్యాలీలో నో హెల్మెట్ నో పెట్రోల్ నిబంధన కఠినంగా అమలుచేస్తూ పెట్రోల్ బంకుల్లో ,ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నారు. సుమారు 700మంది ద్విచక్రవాహనదారులు పాల్గోని ప్రజలకు బలమైన సందేశాన్ని ఇచ్చారు. నేటి యువత వేగం,నిర్లక్ష్యం కారణంగా ద్విచక్రవాహనాల్లో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. హెల్మెట్ ధరించడం వల్ల తీవ్రమైన ప్రమాదాల్లో ప్రాణాలను కాపాడుకోవచ్చని హితవు చేశారు. హెల్మెట్ ధరించడం పోలీసుల కోసం కాదని, పూర్తిగా మీ ప్రాణాల రక్షణ కోసమేనని స్పష్టం చేశారు. హెల్మెట్ భారం కాదని రక్షణకవచమని ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు.



## వైకుంఠ ద్వార దర్శనాలకు అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు

### - టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు

**తిరుమల,డిసెంబర్ 15ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమల ఆలయంలో పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి వచ్చే భక్తులకు అసౌకర్యం తెలియకుండా ఏర్పాట్లు చేస్తున్నామని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు వెల్లడించారు.ఈ ఏడాది విభిన్నంగా తొలిమూడురోజులకు ఇ డిప్‌ద్వారా టోకెన్లు జారీచేసి, అందుకున్న భక్తులకు మాత్రమే ఆలయంలోనికి ప్రవేశం కల్పిస్తామన్నారు. తొలిమూడురోజులు డిసెంబర్ 30,31తోబాటు జనవరి 1న టోకెన్లు ఉన్న భక్తులనే వైకుంఠ ద్వారం అనుమతిఉంటుందన్నారు. ఈ ఏడాది విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సోమవారం మధ్యాహ్నం తిరుమలలోని ఛైర్మన్ కార్యాలయంలో ఆయన బోర్డు సభ్యుడు శాంతారాం, నరేశ్‌తో కలసి వైకుంఠ ద్వార దర్శనాలపై వివరించారు. జనవరి 2నుండి 8వరకు ఏడురోజులు సాదారణ సర్వదర్శనంలోనే భక్తులను వైకుంఠ ద్వార దర్శనాలకు అనుమతినిస్తామన్నారు. గతంలో జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది పూర్తిగా లక్కీడిప్ ఆన్‌లైన్‌లో దర్శన టోకెన్లు, టిక్కెట్లు విడుదల చేయడం జరిగిందన్నారు. ఆ పదిరోజులు భక్తుల రద్దీ ఉన్న ప్రాంతాల్లో ఏర్పాట్లు, సదుపాయాలపై నిరంతరం పర్యవేక్షణ చేస్తానన్నారు. కల్యాణకట్టలో తలనీలాలు తీసేందుకు ఏడునెలలకు సరిపడే బ్లేడ్‌లను ప్రముఖ బ్లేడ్ తయారీ సంస్థ విరాళంగా అందజేయనుందని ఛైర్మన్ తెలిపారు.



## గోవిందా.. హెల్మెట్ ధరించి రండి

### -అలిపిరి టోల్‌గేట్‌వద్ద తిరుమల ట్రాఫిక్ పోలీసుల వినూత్న వినతి

**తిరుమల,డిసెంబర్ 15ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల ఘాట్‌లో ద్విచక్రవాహనదారులు తలకు హెల్మెట్ ధరించి బండి నడపాలని తిరుమల ట్రాఫిక్ పోలీసులువినూత్నరీతిలో స్వాగతం పలికారు. తిరుపతి నుండి తిరుమలకు ప్రతిరోజూ ఉదయంనుండి రాత్రి వరకు పలు రకాలుగా నాలుగువేలమంది వరకు ద్విచక్రవాహనాల్లో టిటిడి ఉద్యోగులు, వ్యాపారులు, ప్రైవేట్ వ్యక్తులు, తిరుమల స్థానికులు ప్రయాణిస్తుంటారు. వీరంతా తిరుపతి అలిపిరి టోల్‌గేట్‌కు చేరుకునే ముందు హెల్మెట్‌లు బండిపై పెట్టుకునో,బండిలో పెట్టుకుని వస్తుంటారు. వీరంతా తలకు హెల్మెట్ ధరించి సురక్షితంగా ఘాట్‌లో ప్రయాణించాలని పోలీసులు సూచిస్తుంటారు.అయితే ఇప్పటికీ కొంతమంది హెల్మెట్ ధరించకుండా వాహనాలను నడిపేస్తున్నారు. సోమవారం ఉదయం తిరుమల ట్రాఫిక్ సిఐ హరిప్రసాద్, ఎస్ఐలు, సిబ్బందితో అలిపిరి టోల్‌గేట్‌లో నిలబడి హెల్మెట్‌లు దరించకుండా వాహనాలను నడిపిన వారిని ఆపి గోవిందా ..తలకు హెల్మెట్ పెట్టుకుని రండి అంటూ రెండు చేతులా ధణ్ణం పెట్టి పోలీసులు అవగాహన కల్పించారు. ఘాట్‌లో హెల్మెట్ ధరించి ద్విచక్రవాహనాలను నడపాలని విజ్ఞప్తి చేశారు.

## మార్చినెల ఆర్జితసేవల టిక్కెట్లు 18న విడుదల

### - ఆన్‌లైన్‌లో వెంకన్న దర్శనాలకు టిటిడి సిద్ధం

**తిరుమల,డిసెంబర్ 15ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనాలకు సంబంధించి తిరుమల తిరుపతి దేవస్థానం రానున్న 2026 మార్చి నెలకు సంబంధించి ఆన్‌లైన్ టిక్కెట్లు ఈనెల 18వతేదీ నేడు విడుదల చేయనుంది. 18వతేదీ గురువారం ఉదయం 10గంటలకు విడుదల చేసేలా టిటిడి ఐటి విభాగం ఏర్పాట్లుచేసింది. ఆర్జిత సేవాటిక్కెట్లు ఎలక్ట్రానిక్ డిప్ కోసం 20వతేదీ శనివారం ఉదయం 10గంటలకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ టిక్కెట్లు పొందిన భక్తులు 20వతేదీ నుండి 22వతేదీ మధ్యాహ్నం 12గంటల లోపు లక్కీడిప్‌ద్వారా టిక్కెట్లు పొందిన భక్తులు నగదు చెల్లించి టిక్కెట్లు అందుకోవచ్చు. ఇక ఆర్జితసేవా కల్యాణం, ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్రదీపా లంకరణ సేవల టిక్కెట్లు తిరుమల తిరుపతి దేవస్థానం ఈనెల 22వతేదీ ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. వర్చువల్ సేవల టిక్కెట్లు 22న మధ్యాహ్నం 3గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. మార్చినెల అంగప్రదక్షణ టోకెన్లను 23వతేదీ ఉదయం 10గంటలకు విడుదల చేస్తోంది. రోజువారీగా (శుక్రవారం తప్ప)750 టోకెన్లను ఆన్‌లైన్‌లోనే విడుదల చేస్తున్న విషయం విదితమే. 300 రూపాయలు ఎస్ఇడి టిక్కెట్లు కోటా 24వతేదీ ఉదయం 10గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. దివ్యాంగులు,

వృద్ధుల కోటా 23న మధ్యాహ్నం 3గంటలకు,24న గదుల కోటా విడుదలచేస్తారు. 25న శ్రీవారి సేవా కోటా విడుదలవుతుంది. భక్తులు ఈ టిక్కెట్లను ఆన్ లైన్‌లో టిటిదేవస్థానమ్స్.ఎపి.జిఒవి.ఇన్ వెబ్ సైట్‌లోమాత్రమే బుక్‌చేసుకోవాలి.

## వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో అందరికీ మంచి జరగాలి - శ్రీవారిసేవలో ప్రముఖులు



**తిరుమల,డిసెంబర్ 15ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని, అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రముఖులు ఆకాంక్షించారు. సోమవారం ఉదయం విఐపి బ్రేక్‌లో కేంద్ర విజిలెన్స్ కమిషనర్ పికె శ్రీవాస్తవ, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఛైర్మన్ జస్టిస్ పుష్పాసత్యనారాయణ, సింగర్ రాహుల్‌సిప్లిగుంజ్, ఎంఎల్‌సి రాంగోపాల్‌రెడ్డి, ఎంఎల్‌ఎ నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, బిజెపి నేత విష్ణువర్ధన్‌రాజు వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకున్నారు . ఉదయం విఐపి బ్రేక్‌లో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## కూటమి పాలనలో ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయనడానికి ఆర్బీఐ నివేదికే నిదర్శనం

విజయవాడ,డిసెంబరు 15,ప్రభాతవార్తప్రతినిధి:కూటమి ప్రభుత్వం తీసుకున్న విప్లవాత్మక చర్యలతో పండ్లు, ఆక్వా ఉత్పత్తుల్లో దేశంలోనే నెంబర్ 1గా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని పూర్వపు ఉద్యోగుల సంఘనాయకుడు, మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్ బాబు అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మాట్లాడిన ఆయన.. రాష్ట్రంలో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడ్డయడానికి ఆర్బీఐ నివేదికే నిదర్శనమని పేర్కొన్నారు. 193 లక్షల టన్నుల పండ్ల ఉత్పత్తిలో భారతదేశంలో నెంబర్ 1గా ఏపీ నిలిచిందన్నారు. పరిశ్రమల వృద్ధి, పవర్ ప్రొడక్షన్, ఆక్వా, పర్ క్యాపిటా ఇన్ కాం, జీఎస్ డీపీలో ఆర్బీఐ నివేదక ప్రకారం ఆంధ్రప్రదేశ్ మెరుగుగా కనిపించదన్నారు. 90శాతం సబ్సిడీతో కూటమి ప్రభుత్వం మైక్రో ఇరిగేషన్ పరికరాలు ఇస్తున్నట్లు గుర్తు చేశారు. దేశంలో ఎక్కడా ఇంత రాయితీ ఇవ్వలేదన్నారు.

**IN THE COURT OF THE HON'BLE VI ADDITIONAL DISTRICT JUDGE, RANGA REDDY DISTRICT:AT KUKATPALLY.**
**O.S.NO. 173 OF 2025**
**Between:**
Smt. Pamarthi Meena Kumari and 02 others ... Plaintiffs
AND
The Tahasildhar (MRO),
Serilingampally Mandal, Ranga Reddy District and 03 others ... Defendants
**NOTICE**
To
All concerned
Please take notice that the above suit is filed by the plaintiffs seeking suit for declaration of legal heirs for their ancestral Deceased Sri Late Pamarthy Venkat Das, the deceased having owned an immovable properties , I.e., SCHEDULE OF PROPERTY-A, All that House bearing NO. C3/122, IN Category-LIG, Block No-14,(Municipality No.-64 in Phase-I of Ramachandrapuram Ring Town) Sy. No. 366 & 367, Admesuring 98.00 sq. Mtr., Or Equivalent to 117.20 Sq. Yards Having the Plinth area ( Built up area 35.00 Sq. MTRS.,) of Chanda nagar Village, Serilingampally Mandal, Ranga Reddy District., bounded by: North: Plot No. 309 MIG, South: 9.0 MTR. Wide Road,East : H.NO:C3/121, LIG, and West : H.NO:C3/123, LIG.SCHEDULE OF PROPERTY-B All the Agriculture land A.C. 2.50 Cents, (in Sy. NO. 90/1) Present Sy. No. 90/6, Situated At. S.N.Gollapalem Village, Bandar Mandal, Bandar Sub-registrar, Krishna District., bounded by: North:Ganesana Narendra Land, South: Pantabode, East: Ganesana Narendra Land, and West : Mudineni Eswara Rao Land. SCHEDULE OF PROPERTY-C All that Agriculture Land A.C. 0.25 Cents, Sy. NO. 417/3, Situated at. Konkepudi Village, Pedana Mandal, Krishna District., bounded by: North: Land of Pamarthi Hymavathi and Panta Bodi, South: Remaining Land of Vendor,East:Land of Bhemavaram Murali Krishnam Raju And Srinivasa Rao etc, and West : Land of Davusetti Ranga Rao. SCHEDULE OF PROPERTY-D All that Agriculture Land A.C. 0-30 Cents, Sy. NO. 417/3, Situated at. Konkepudi Village, Pedana Mandal, Krishna District., bounded by: North: Panta Bodhi, South: Land of Pamarthi Kondewara Rao, East:Land of Bhemavaram Murali Krishnam Raju And Srinivasa Rao etc, and West : Land of Davusetti Ranga Rao. SCHEDULE OF PROPERTY-E All that Agriculture Land A.C. 0-74 Cents, Sy. NO. 235/8, and A.C. 0-17 Cents, Sy. No. 235/9, total Extent Of A.C. 0.91 Cents,Situated at. Konkepudi Village, Pedana Mandal, Krishna District., bounded by:North: Land Pamarthy Hemasundara Rao And Panta Bode, South:Lajjabanda Murugu Kalava, East : Land of Pamarthy Ngeswara Rao, and West : Land of Pamarthy Veera Nelabaludu. SCHEDULE OF PROPERTY-F All that Agriculture Land A.C. 0-62 Cents, Sy. NO. 235/1, and A.C. 0-42 Cents, Sy. No. 235/2, total Extent Of A.C. 1.04 Cents, Situated at. Konkepudi Village, Pedana Mandal, Krishna District., bounded by: North: Panta Bodi, South: Lajjabanda Murugu Kalava, East : Land of Pamarthi Veera Nelabaludu, and West : Panta Bodi. SCHEDULE OF PROPERTY-G All that Agriculture Land A.C. 0-26 Cents, Sy. NO. 235/6, and A.C. 0-62 Cents, Sy. No. 235/7, total Extent Of A.C. 0.88 Cents, Situated at. Konkepudi Village, Pedana Mandal, Krishna District., bounded by: North: Pamarthi Jhansi Land, South: Claimant Land ( Late Venkat Das), East : Panta Bodi, and West : Jampana Arjuna Rao Land. The above said suit posted for appearance on 23.12.2025 at 10.30 a.m., before above said Hon'ble court. If any person [s] are having any objections may appear in person or through counsel on the above mentioned date and time before the Hon'ble court. If any objections not received by the Hon'ble court, the Hon'ble will decide the matter on merits.
**(By order of the Hon'ble Court)**
**S RAJU GOUD,** Advocate & Associates
Off: 6-103/127, Gulmohar Park Colony, Serilingampally Mandal, Ranga Reddy District, PIN CODE - 500 019, MOB:9989955508.
Counsel for the plaintiff

## రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ప్రధాన కార్యాలయంలో ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

**విజయవాడ,డిసెంబరు 15,ప్రభాతవార్తప్రతినిధి:** స్వాతంత్ర్య సమర యోధుల ఆశయాలుకు అనుగుణంగా ప్రతీ ఒక్కరూ పనిచేయాలని రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పి. అరుణ బాబు పిలుపు నిచ్చారు.

అమరజీవి శ్రీ పొట్టి. శ్రీరాములు ఆత్మార్పణ దినోత్సవం సందర్బంగా సోమవారం విజయవాడ లోని రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన అమరజీవి పొట్టి శీరాములు చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ కోసం ప్రాణాలు అర్పించిన గొప్ప మహనీయులు శ్రీ పొట్టి. శ్రీరాములు అని, ఆయన త్యాగాలకు అనుగుణంగా ప్రతీ ఒక్కరూ పనిచేయాలని ఆయన ఉద్యోగులుకు విజ్ఞప్తి చేసేరు.

ఈ కార్యక్రమంలో సంస్థ చీఫ్ ఇంజినీర్ జయరామా చారి, జనరల్ మేనేజర్ వెంకట రమణ, చీఫ్ జనరల్ మేనేజర్ అన్నపూర్ణ, సూపరేండెంట్ ఇంజినీర్ కృష్ణయ్య, ఇతర అధికారులు, ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఇక స్థానిక ఆలయాల్లోనూ యుపిఐ చెల్లింపులు

## - కియోస్క్‌యంత్రాలు, క్యూఆర్ కోడ్స్ - టిటిడి ఇఒ ఎకె సింఘాల్

**తిరుమల,డిసెంబర్ 15ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల కొండపై అమలవుతున్న తరహాలో టిటిడి పరిధిలోని 60 స్థానిక ఆలయాల్లో భక్తులు సులభతరంగా యూపిఐ ద్వారా నగదు చెల్లింపులు చేసే సౌలభ్యం కల్పిస్తున్నట్లు టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్ తెలిపారు. ఇందుకు అవసరమైన కియోస్క్‌యంత్రాలు, క్యూఆర్ కోడ్స్ స్కానర్లు ఏర్పాటుచేయాలని అధికారులను ఆదేశించారు. కర్నాటక బెలగావిలో ఆలయం నిర్మాణం, బీహార్‌లోని పాట్నాలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయింపుపై ఆయా రాష్ట్ర అధికారులతో సంప్రదించి ఆలయాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. సోమవారం టిటిడి పరిపాలన భవనంలో టిటిడి జెఇఒ వీరబ్రహ్మం, సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, ఎఫ్ఎసిఎఒ బాలాజీ, సిఇ సత్యనారాయణ, డిప్యూటీ సిఎఫ్ ఫణికుమార్‌నాయుడు, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి,రవాణాజిఎం శేషారెడ్డితో కలసి ఇఒ సింఘాల్ పలు అంశాలపై సమీక్షించారు. రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాల్లో టిటిడి నిర్మించదలచని ఐదువేల ఆలయాలకు అనవరమైన రెండు మూడు డిజైన్లు సిద్దంచేయాలని సిఇని ఆదేశించారు. తద్వారా ఆయా ప్రాంతాల్లో ఆలయాల నిర్మాణ ప్రక్రియ వేగవంతమవుతుందని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో సిసి కెమెరాల ఏర్పాటు పనులను కూడా వేగవంతం చేయాలని ఇఒ సింఘాల్ ఆదేశించారు. తిరుమలలో శ్రీవారి ఆలయంలో ఉన్న కదిలే వంతెన మరమ్మతు పనులను వైకుంఠ ఏకాదశిలోపు పూర్తిచేయాలన్నారు. ముంబైలోని బాంద్రాలో ఆలయంలో జెఇఒ,సిఇ సంబంధిత అధికారులతో క్షేత్రస్థాయి పరిశీలన చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఇఒ సింఘాల్ స్పష్టమైన ఆదేశాలిచ్చారు.

## రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని రైల్వేకోడూరులో వేలాది మంది ప్రదర్శన



**రాజంపేట, డిసెంబర్14 ప్రభాతవార్త** జిల్లాల విభజన సమస్య రోజురోజుకు ఉమ్మడి కడప జిల్లాలో వేడెక్కుతుంది. రైల్వేకోడూరులో వేలాదిమంది విద్యార్థులు, ప్రజలు సోమవారం రోడ్ ఎక్కారు. భారీ ఎత్తున ప్రదర్శన నిర్వహించారు. రాజంపేట ముద్దు, రాయచోటి వద్దంటూ నినాదాలు చేశారు. జిల్లా కేంద్ర ప్రకటన జరిగేంత వరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. పోరా వైపు జిల్లాల విభజనకు సంబంధించి కీలక పాత్ర పోషిస్తున్న మంత్రివర్గ ఉప సంఘం నేత రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ను రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ జనసేన సమన్వయకర్త అతికారి కృష్ణ కలిసి రాజంపేటకు న్యాయం చేయాలని వినతి పత్రం అందజేశారు. ప్రజల మనోభావాలను గుర్తించాలని డిమాండ్ చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి రాజంపేట జిల్లా కేంద్ర సమస్య తీసుకుపోయి ప్రజల న్యాయమైన డిమాండ్ను పరిష్కరించాలని కోరారు. అలాగే రైల్వేకోడూరు నిరాహార దీక్ష శిబిరంలో, ప్రదర్శనలో రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మోకాళ్లపై కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. రాజంపేట జిల్లా కేంద్రం చేయాలని డిమాండ్ చేశారు.

**నివాస్ హౌసింగ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్**
(పూర్వపు ఇండోస్టార్ హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌గా తెలిసినది, NHFPLగా ఇటుపై రిఫర్ చేయబడును)
నమోదిత కార్యాలయం : యూనిట్ నెం.305, 3వ అంతస్తు, వింగ్ 2/E, కార్పొరేట్ ఎవెన్యూ, అంధేరీ ఘట్‌కోపర్ లింక్ రోడ్, చాకల, అంధేరీ (ఈస్ట్), ముంబై-400093
NIWAS HOUSING FINANCE

**స్వాధీనతా ప్రకటన [నిబంధన 8(1) మరియు (2)]**

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్టు (యాక్ట్) 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు 2002 యొక్క (నిబంధన 3)తో చదువబడే సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను నెరవేర్చే నిమిత్తం ఇందులో పేర్కొన్న సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క అధీకృత అధికారి రుణగ్రహీత(లు) నోటీస్‌లో పేర్కొన్న మొత్తాన్ని సదరు నోటీస్ స్వీకరించిన తేదీ నుండి 60 రోజులలోగా బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించవలసినదిగా పిలుపునిస్తూ డిమాండ్ నోటీస్ జారీ చేసారు.
రుణగ్రహీత(లు) ఇట్టి మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున రుణగ్రహీత(లు) మరియు సాధారణ ప్రజానీకానికి, దిగువ సంతకందారు NHFPL అధీకృత అధికారి అయినందున సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు 2002 యొక్క నిబంధన 8తో చదువబడే చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) క్రింద సంక్రమించబడిన అధికారాలను వినియోగిస్తూ ఈ దిగువ తెలిపిన స్థిరాస్తులను క్రింద పేర్కొనబడిన ప్రతీ ఆస్తి ఎదురుగా ఉన్న తేదీ స్వాధీనం చేసుకొన్నారని ఇందుమూలముగా నోటీస్ ఇవ్వడమైనది.
చట్టం యొక్క 13 సెక్షన్ యొక్క సబ్ సెక్షన్ (8) నియమాల ఏర్పాట్లు రుణగ్రహీత దృష్టికి తీసుకురావడం ఏమనగా అందలి నిర్దేశితాలను అనుసరించి రుణగ్రహీత లభ్యంగా గల సమయంలోగా తనఖా పెట్టబడిన ఆస్తులను తిరిగి పొందవచ్చును.
ప్రధానంగా రుణగ్రహీత(లు) మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా తెలుపబడిన ఆస్తికి సంబంధించి ఎటువంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఒకవేళ అలా జరిపిన పక్షంలో NHFPL వారికి దిగువ తెలిపిన బకాయి మొత్తం మరియు వడ్డీ మరియు అపై ఇతర ఛార్జీలు మొత్తాన్ని చెల్లించవలసి ఉంటుంది.

| రుణ ఖాతా నంబరు | రుణగ్రహీత(లు) & ఆస్తి వివరాలు | మొత్తం మరియు డిమాండ్ నోటీస్ తేదీ | స్వాధీనతా తేదీ | స్వాధీనతా స్టేటస్ |
|---|---|---|---|---|
| LNCUDLAP-03240041741 | 1. పైడికల్వ రంగనాయకులు (రుణగ్రహీత) 2. పైడికల్వ వెంకట సుబ్బమ్మ (సహ-రుణగ్రహీత) | రూ.7,17,841/- (రూపాయలు ఏడు లక్షల పదిహేడు వేల ఎనిమిది వందల నలభై ఒక్కటి మాత్రమే) తేదీ: 15-సెప్టెంబర్-2025 | 12.12.2025 | సింబాలిక్‌గా స్వాధీనం |

**ఆస్తి కలిగి ఉన్నది :** సర్వే నం.758-1 కలిగి ఉన్న, 14వ నం. వార్డ్, ఇ.నం.14-20, అరుంధతి నగర్, చెన్నూరు గ్రామ పొలం, చెన్నూరు గ్రామం, కడప జిల్లా, పిన్ కోడ్ 516152, కొలత 137.50 చ.గ. అసెస్‌మెంట్ నం.3606 ఆస్తి యొక్క మొత్తం అదంతా. ఈ క్రింది సరిహద్దులు: తూర్పు: కొండారెడ్డి రామాంజనేయులు ఇల్లు, పడమర: తుమ్మలూరు వెంకటయ్య ఇల్లు, ఉత్తరం: రోడ్, దక్షిణం: కొండూరు ఓబులేశు ఇల్లు, కొలతలు తూర్పు-పడమర ఉత్తరం వైపు-33 అ. తూర్పు-పడమర దక్షిణం వైపు 33 అ. ఉత్తరం-దక్షిణం తూర్పు వైపు-37.6 అ. ఉత్తరం-దక్షిణం పడమర వైపు 37.6 అ. తూర్పు-పడమర ఉత్తరం వైపు 22 అ. తూర్పు-పడమర దక్షిణం వైపు 22 అ. ఉత్తరం-దక్షిణం తూర్పు వైపు 14 అ. ఉత్తరం-దక్షిణం పడమర వైపు 14 అ. తూర్పు-పడమర ఉత్తరం వైపు 12 అ. తూర్పు-పడమర దక్షిణం వైపు 12 అ. ఉత్తరం-దక్షిణం తూర్పు వైపు 37.6 అ. ఉత్తరం-దక్షిణం పడమర వైపు 37.6 అ. మొత్తం భూమి 137.50 చ.గ. Rcc 308 చ/అ, Acc 15 చ/అ.

ప్రదేశం : కడప, ఆంధ్రప్రదేశ్
తేదీ : 16.12.2025
సం/ అధీకృత అధికారి
నివాస్ హౌసింగ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తరపున



## జువ్వలదిన్నెను పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుతా: మంత్రి నారాయణ

బిట్రగుంట (నెల్లూరు), డిసెంబరు 15 ప్రభాతవార్త: శ్రీపొట్టిశ్రీరాములునెల్లూరు జిల్లా బోగోలు మండలం పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుతున్నట్లు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ చెప్పారు. ఆయన జువ్వలదిన్నె గ్రామంలో స్వర్గీయ పొట్టి శ్రీరాములు 73వ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జువ్వలదిన్నె గ్రామంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి స్థానిక శాసనసభ్యులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్లా అజీజ్ ,జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో కలిసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జువ్వలదిన్నెను పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేసే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో గతంలో చర్చించామని నేడు క్షేత్రస్థాయిలో పరిశీలించి మరింత వివరంగా చర్చిస్తామన్నారు. భాషా ప్రయుక్త రాష్ట్రాలుగా ఏర్పడడానికి తొలి అడుగు వేసి భాషా ప్రయుక్త రాష్ట్రాల ఆద్యుడు అయ్యారన్నారు. జువ్వలదిన్నెను ప్రముఖ పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగం తెలుగువారి ఆత్మగౌరవం కోసం జరిగిందన్నారు. ఇక్కడ ఉన్న విదేశాలలో ఉన్న తెలుగువారు తల ఎత్తుకునే విధంగా చేశారన్నారు. బడుగు, బలహీన వర్గాల వారి సమానత్వం కోసం పాటుపడ్డారన్నారు. స్థానిక శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు మహోన్నతమైన వ్యక్తి అని అందరికీ ఆరాధ్యదాయకమని అన్నారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ అమరజీవి పేరుతో ఆయన నడియాడిన ప్రదేశంలో లైబ్రరీ ఏర్పాటు చేయడం గొప్ప విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ అధికారి వంశీకృష్ణ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం జువ్వలదిన్నె హార్బర్‌ను మంత్రి నారాయణ స్థానిక శాసన సభ్యులు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి వక్స్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మరియు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమం లో మండల స్థాయి అధికారులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

## మహిళా వర్సిటీలో విద్యార్థినులకు వేధింపులు

### ఆరా తీసిన ఎమ్మెల్యే రాజాసింగ్

**హైదరాబాద్ (బేగంబజార్), డిసెంబరు 15, ప్రభాతవార్త:** చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీలో విద్యార్థుల వేధింపులపై స్థానిక గోషామహల్ నియోజకవర్గం శాసనసభ్యుడు టి.రాజాసింగ్ ఆరా తీశారు. సోమవారం కోఠిలోని చాకలి ఐలమ్మ మహిళా ఉస్మానియా యూనివర్సిటీలో ప్రిన్సిపల్, అధ్యాపకులను ఎమ్మెల్యే టి.రాజాసింగ్ విద్యార్థులను ఎందుకు వేధిస్తున్నట్లు అడిగి తెలుసు కున్నారు. విద్యార్థులను మెస్ ఇన్‌చార్జ్ వినోద్‌పైశాఖ పరమైన చర్యలు తీసుకోవాలని రాజా సింగ్ డిమాండ్ చేశారు. విద్యార్థినులపై ఇష్టానుసారంగా వ్యవ హారిస్తే ఊరుకునే ప్రస్తకే లేదన్నారు.అధికారులకు విన్నవించిన్నప్పటికి పట్టించుకోక పోవడం మూలంగానే విద్యార్థులు ఆన్‌లైన్ మార్గంలో షీ టిమ్ పోలీ సులను ఆశ్రయిం చాల్సి రావడం పట్ల విద్యాశాఖ అధికారులు ఏమి చేస్తున్నా రని ప్రశ్నిం చారు. ఈ విషయమై అధ్యాపకులతో కూడిన ఒక నిజనిర్ధారణ కమిటి వేసినట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

# మరో 2వేల మెగావాట్ అవర్ బేస్ ప్రాజెక్టులు

**● టెండర్లు పిలిచిన ప్రభుత్వం ● పునరుత్పాదక విద్యుత్ వినియోగమే లక్ష్యం ● విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని తగ్గించే యత్నం**



విజయవాడ, డిసెంబరు 15 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో పీక్ డిమాండ్ సమయంలో అవసరమైన విద్యుత సర్దుబాటుతో పాటు స్థిరత్వం కోసం బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టం(బెస్) ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాటి ద్వారా భవిష్యత్తులో విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని తగ్గించాలని భావిస్తోంది. ఇందుకోసం రాష్ట్రంలో ఏడు ప్రాంతాల్లో 2వేల మెగావాట్ అవర్(రెండు సైకిల్స్‌లో) బెస్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. ట్రాన్స్‌కో సబ్‌స్టేషన్లు ఉన్న ప్రాంతాల్లో వాటిని ఏర్పాటు చేస్తారు. ఇందుకు గుత్తేదారు సంస్థల ఎంపిక కోసం ప్రభుత్వం టెండర్లు పిలిచింది. ఇప్పటికే 1000 మెగావాట్ అవర్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రభుత్వం టెండరను ఖరారు చేసింది. తాజాగా పిలిచిన 2వేల మెగావాట్ అవర్లతో కలిపి రాష్ట్రంలో 3 వేల మెగావాట్ అవర్ బెస్ స్టోరేజి ప్రాజెక్టులు అందుబాటులోకి రానున్నాయి.

మిగులు విద్యుత్‌ను వినియోగించే లక్ష్యం. పగటి వేళల్లో పునరుత్పాదక విద్యుత్ సుమారు 1,500 మెగావాట్లు మిగులుతోంది. జెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రాలు బ్యాక్‌డౌన్ చేసిన తర్వాత మిగులు మిగులు ఉంటోంది. ఆ సమయంలో బహిరంగ మార్కెట్‌లో విక్రయించాలన్నా ఆశించన ధర ఉండటం లేదు. దీంతో కొన్ని సందర్భాల్లో అధిక ధరకు కొన్న విద్యుత్‌ను మార్కెట్‌లో యూనిట్ 50 పైసలకే డిస్కంలు అమ్ముకోవాల్సి వస్తోంది. దీనికి తోడు పీఎం సూర్యఘర్ కింద రూఫ్‌టాప్ ప్రాజెక్టుల ద్వారా రాబోయే రెండేళ్ళలో సుమారు 4వేల మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్ అందుబాటులోకి వస్తుంది. ఈ దృష్ట్యా పగటి వేళలో అందుబాటులో ఉన్న విద్యుత్‌ను పూర్తిగా వినియోగించుకోలేని పరిస్థితి పీక్ వేళల్లో (ఉదయం 9 నుండి 10 గంటల వరకు సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల మధ్య) విద్యుత డిమాండ్ సర్దుబాటు కోసం బహిరంగ మార్కెట్‌లో యూనిట్ రూ.10 చొప్పున డిస్కంలు కొంటున్నాయి. దీనివల్ల విద్యుత్ కొనుగోలు వ్యయం పెరుగుతోంది. ఈ దృష్ట్యా పగటి వేళల్లో అదనంగా ఉన్న విద్యుత్‌ను బెస్ ద్వారా నిల్వ చేసి... పీక్ డిమార్ సమయంలో వినియోగించుకోవాలన్నది ప్రభుత్వ ఆలోచన. బెస్‌ల ఏర్పాటుతో పీక్ డిమాండ్ సమయంలో యూనిట్ రూ.6కు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని అంచనా వేసారు.గత ఏడాది రియల్‌టైం మార్కెట్‌లో రూ.3 వేల కోట్ల విలువైన విద్యుత్‌ను డిస్కంలు కొన్నాయి. ఈ ఏడాది ఇప్పటికి బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.1300 కోట్ల వ్యయంతో విద్యుత్‌ను కొన్నాయి. తక్కువ ధరకు విద్యుత్ అందుబాటులోకి వస్తే... ఆ మేరకు కొనుగోలు వ్యయాన్ని ఇంకా తగ్గించుకోవాలన్నది ఆలోచన. గతంలో రూ.5.12గా ఉన్న యూనిట్ విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని రూ.4.90కి తగ్గించాయి. దీన్ని భవిష్యత్తులో ఇంకా తగ్గించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దీనికి బెస్ ప్రాజెక్టులు దోహదం చేస్తాయని భావిస్తోంది.

# విద్యార్థులకు మాటా ఇచ్చాడు... నిలబెట్టుకున్నాడు!

## డిప్యూటీ సిఎం పవన్‌పై ప్రశంసలు

విజయవాడ, డిసెంబరు 15 ప్రభాతవార్త ప్రతినిధి: పల్నాడు జిల్లా చిలకలూరిపేట పట్టణంలోని శ్రీ శారద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విద్యార్థులకు ఇచ్చిన హామీ తక్షణం నెరవేర్చారు. ఈ నెల 5న పాఠశాలలో జరిగిన మెగా టీచర్స్-పేరెంట్స్ మీటింగ్‌లో విద్యార్థుల కోరిక మేరకు తన సొంత నిధులతో చెప్పిన పది రోజుల లోపే 25 కంప్యూటర్లు దానికి తగిన విధంగా ఫర్నిచర్ గదిని కంప్యూటర్ ల్యాబ్ లాగా సుందరీకరణ చేశారు. అంతేకాకుండా అందుకు అవసరమైన పుస్తకాలతో కూడిన ఆధునిక లైబ్రరీ దానికి తగిన విధంగా ఫర్నిచర్ ఏర్పాటు చేశారు. సోమవారం లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్‌ను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణ తేజ, జిల్లా కలెక్టర్ కృతికాశుక్ల ప్రారంభించి మాట ఇచ్చిన పది రోజుల్లోనే సొంత నిధులతో అమలు చేసి చూపించిన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సేవలను కొనియాడారు. విద్యార్థుల అభ్యాసాన్ని మెరుగు పరిచేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్వయంగా చూపిన చొరవ ఆదర్శనీయమని అభిప్రాయ పడ్డారు.

### రూ.25 లక్షల సొంత నిధులతో ఏర్పాటు

పవన్ కల్యాణ్ చేసిన ఈ సాయంతో చిలకలూరిపేట విద్యార్థులకు నూతన దిశా నిర్దేశం లభించిందని



అన్నారు. మొత్తం రూ. 25 లక్షల సొంత నిధులతో ఇంత విలువైన సదుపాయాలు ఏర్పాటు చేయడం పవన్ కల్యాణ్ సేవా దృక్పథానికి నిదర్శనం అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలను తెలియజేశారు. కేవలం పది రోజుల లోపే ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నందుకు గాను ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఎప్పుడూ రుణపడి ఉంటామని విద్యార్థులంతా కొనియాడారు.

**పుస్తకాలతో లైబ్రరీ నింపేశారు:** పాఠశాలలో పుస్తకాలు అరకొరగా ఉండడాన్ని గమనించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆ రోజు జరిగిన సమావేశంలో లైబ్రరీ నిండుగా పుస్తకాలు, 25 కంప్యూటర్లతో ల్యాబ్ ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ తొమ్మిది రోజుల్లో కంప్యూటర్లతో అధునాతన స్కిల్ ల్యాబ్ ను ఏర్పాటు చేయించారు. లైబ్రరీని పుస్తకాలతో నింపేశారు. చిన్నారులకు పెద బాలశిక్షతో సహా కాశీమజిలీ కథలు, విజ్ఞానాన్ని పెంపొందించే పుస్తకాలు, బహుభాషా ప్రావీణ్యాన్ని పెంచే విధంగా స్పోకెన్ ఇంగ్లీష్, హిందీ, తమిళం, కన్నడ, ఒడియా తదితర భాషల పుస్తకాలను అందుబాటులో ఉంచారు. సుమారు రూ.25 లక్షలు వెచ్చించి వీటిని ఏర్పాటు చేయించారు. పాఠశాలల అభివృద్ధిపై దృష్టి: విద్యార్థి దశ నుంచే బాలల్లో నైపుణ్యాన్ని వృద్ధి చేయాలి. పుస్తక పఠనంపై ఆసక్తి పెంచి సృజనాత్మకతను పెంపొందించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రతి సమావేశంలో చెబుతూ ఉంటారు. అందుకు తగిన విధంగా పాఠశాలల్లో సౌకర్యాల ఉండాలని కోరుకుంటారు. ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలను స్వీకరించిన రోజు నుంచి తన సొంత నియోజకవర్గం పిఠాపురం వ్యాప్తంగా పాఠశాలల అభివృద్ధిపై సైతం దృష్టి సారించారు. అంతేకాకుండా క్షేత్రస్థాయి పర్యటనల ద్వారా పాఠశాలల్లో విద్యార్థులకు అందుబాటులో ఉన్న వసతులపై ఆరా తీస్తూ ఉంటారు. రికార్డు స్థాయిలో గ్రామ సభల నిర్వహణ కోసం అన్నమయ్య జిల్లా మైసూరవారిపల్లి సందర్శించినప్పుడు ఆ గ్రామంలో పాఠశాలకు ఆట స్థలం లేదని తెలుసుకుని రూ.65 లక్షల తన సొంత నిధులను వెచ్చించి కొనుగోలు చేసి అందించారు. అంతేకాకుండా మొదటి విడత మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ కోసం కడప మున్సిపల్ స్కూల్ సందర్శన అనంతరం కలెక్టర్ సూచన మేరకు అధునాతన మోడల్ కిచెన్‌ను కూడా ఏర్పాటు చేయించారు.




## బిజెపి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నితిన్ నబీన్ బాధ్యతల స్వీకరణ

**న్యూఢిల్లీ, డిసెంబరు 15:** బీజేపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బీహార్ మంత్రిగా ఉన్న నితిన్ నబీన్ సిన్హా బాధ్యతలు స్వీకరించారు. దిల్లీలోని ఆ పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలు సైతం హాజరయ్యారు. మధ్యాహ్నాం పాట్నా నుంచి ఢిల్లీ చేరుకున్న నితిన్ నబీకి ఢిల్లీ విమానాశ్రయంలో సీఎం రేఖా గుప్తా స్వాగతం పలికారు. అనంతరం పార్టీ కేంద్ర కార్యాలయానికి చేరుకున్న నితిన్ నబీ, డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ, పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ విగ్రహాల వద్ద పుష్పాలు ఉంచి నివాళులర్పించిన అనంతరం నితిన్‌నబీని కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, అమిత్ షా స్వయంగా తొడ్కొని వెళ్లి కుర్చీలో కూర్చొబెట్టారు.

బాధ్యతలు స్వీకరించిన అనంతరం పుష్పాలు అందించి అభినందనలు తెలిపారు. అంతకుముందు ఆదివారమే బీహార్‌కు చెందిన 45 ఏళ్ల నితిన్ నబీన్ సిన్హాను పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమించినట్లు బీజేపీ ప్రకటించింది. ఈ మేరకు పార్లమెంటరీ బోర్డు నిర్ణయించినట్లు పార్టీ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ ప్రకటించారు. రాష్ట్రాల్లో కాకుండా జాతీయస్థాయిలో ఇలాంటి నియామకం ఇది రెండోసారి. గతంలో నడ్డా కూడా ఇలాంటి పదవిలోకి మొదట వచ్చారు. ప్రస్తుతం జాతీయ అధ్యక్షుడిగా ఆయన పదవీకాలం ఇప్పటికే ముగియగా పొడిగింపులో ఉన్నారు.

రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బీహార్ సరిహద్దుల్లోని బెంగాల్ ప్రాంతంలో ప్రభావం చూపే ఉద్దేశంతో ఇప్పుడు సిన్హాను అనూహ్యంగా తెరమీదికి తెచ్చినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. వచ్చే జనవరి 14 తర్వాత సిన్హాను లాంఛనంగా పార్టీ అధ్యక్షుడిగా ఎన్నుకోనున్నట్లు తెలుస్తోంది.

ఏప్రిల్‌లో జరగబోయే పార్టీ జాతీయ మండలి సమావేశం ఆయన ఎన్నికను ధ్రువీకరించనుంది. బీహార్‌లోని కాయస్థ సామాజికవర్గానికి చెందిన నబీన్ సిన్హాకు ఆరెస్సెస్ నేపథ్యం ఉంది. ఎన్నికల్లో బిహార్‌లోని బాంకీపుర్ నుంచి ఐదోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ప్రముఖ సినీనటుడు శత్రుఘ్నసిన్హా కుమారుడు లవ్‌సిన్హాపై 84వేల ఓట్ల భారీ ఆధిక్యంతో విజయం సాధించారు. అంతకుముందు పార్టీ యువమోర్చా ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఛత్తీస్‌గఢ్ వ్యవహారాల ఇన్‌ఛార్జిగా పనిచేసి అక్కడ బీజేపీని అధికారంలోకి తేవడంలో కీలకపాత్ర పోషించారు.

# అనంతలో వైసిపి బైక్ ర్యాలీ సక్సెస్

**● కార్యకర్తల్లో ఉత్తేజానిచ్చిన బైక్ ర్యాలీ ● ర్యాలీలో రెండు వర్గాల మధ్య గొడవ ● పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం**




అనంతపురం, డిసెంబరు 15 ప్రభాతవార్త బ్యూరో: ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటుకు ధారాదత్తం చేస్తున్న చంద్రబాబు సర్కారుకు వ్యతిరేకంగా రాష్ట్రం లో అన్ని జిల్లాల్లో చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా జిల్లా కేంద్రమైన అనంతపురంలో సోమవారం చేపట్టిన బైక్ ర్యాలీకి అనూహ్య స్పందన లభించింది. రాయదుర్గం వైసీపీ సమన్వయ కర్త మెట్టు గోవింద్ రెడ్డి మినహా అన్ని నియోజక వర్గాల సమన్వయకర్తలు హాజరయ్యారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి క్రియాశీలక కార్యకర్తలు, నాయకులు హాజరు కావడంతో బైక్ ర్యాలీ వైసీపీ అభిమానులు ఉత్తేజపరిచింది. వేలాది బైక్‌లతో అనంత పురం నగరంలో ర్యాలీ నిర్వహించారు. అయితే బైక్ ర్యాలీలో రెండు వర్గాల మధ్య చిన్నపాటి గొడవ చోటు చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. అనంత పురం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోగటం విజయ భాస్కర్ రెడ్డి, వైసీపీ ఎస్సీ సెల్ జిల్లా నేత అయిన కార్పొరేటర్ సాకే చంద్ర వర్గాల గొడవ జరిగినట్లు సమాచారం. పోలీసులు స్పందించడంతో గొడవ సద్దు మణిగిపోయింది. కాగా వైఎస్ఆర్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యం లో నగరంలోని వైసీపీ జిల్లా కార్యాలయం వద్ద నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ.. ఫ్లై ఓవర్, టవర్‌క్లాక్, సప్తగిరి సర్కిల్, పాతూరు మీదుగా బుక్కరాయ సముద్రం వరకు కొనసాగింది. వైఎస్ఆర్‌సీపీ అనంత పురం పార్లమెంట్ పరిశీలకులు నరేష్‌రెడ్డి, ఎమ్మెల్సీలు వై.శివరామిరెడ్డి, మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, నియోజకవర్గాల సమన్వయ కర్తలు సాకే శైలజనాథ్, తలారి రంగయ్య, విశ్వేశ్వరరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, మెట్టు గోవిందరెడ్డి, గుంతకల్లు సమన్వయ కర్త వై.వెంకట్రామిరెడ్డి తనయ నైరుతిరెడ్డి, ప్రజాప్రతి నిధులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. రహదారి పొడవునా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ హోరెత్తించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సేకరించిన 4,55,840 సంతకాల ప్రతులు ఉంచిన ప్రత్యేక వాహనాన్ని జెండా ఊపి తాడేపల్లిలోకి పార్టీ కేంద్ర కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా వైసీపీ జిల్లా నేతలు, సమన్వయకర్తలు మాట్లాడుతూ వైసీపీ హయాంలోనే 7 కాలేజీలు పూర్తి చేశామని, మిగిలిన కళాశాలల నిర్మాణాలు సైతం 30 శాతం నుంచి 70శాతం వరకు పూర్తయ్యాయని తెలిపారు. చంద్ర బాబు ముఖ్యమంత్రి అయ్యాక ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పీపీపీ పేరుతో ప్రైవేటీకరణ చేస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకునే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అహుడ మాజీ చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, వైసిపి జిల్లా నేతలు నార్పల సత్యనారాయణ రెడ్డి, నదీమ్, ఉపేందర్ రెడ్డి, కె.వి. రమణ, తరిమల గోకుల్‌నాథ్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి, ముంబై రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రవీంద్రభారతిలో 'గానగంధర్వు'ని విగ్రహావిష్కరణ



**హైదరాబాద్ (రవీంద్రభారతి), డిసెంబరు 15, ప్రభాతవార్త :** తెలుగు సినీసంగీతానికి స్వర్ణయుగం తీసుకొచ్చిన విశ్వవిఖ్యాత గానగంధర్వులు ఘంటసాల వెంకటేశ్వరరావు, ఎస్.పి.బాల సుబ్ర హ్మణ్యం తెలుగు పాటను సుసంపన్నం చేశారని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు అన్నారు. కళాత్మకు, సంగీతా భిమానుల చిరస్థాయి ప్రేమకు బాలసుబ్రహ్మణ్యం విగ్రహం నిత్యచిహ్నామని వెంకయ్యనాయుడు నొక్కివక్కాణించారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ, ది మ్యూజిక్ గ్రూప్ కల్చరల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో విశ్వ విఖ్యాత గానగంధర్వుడు పద్మవిభూషణ్ డా. ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం నిలువెత్తు కాంస్య విగ్రహా విష్కరణ సోమవారం సాయంత్రం రవీంద్రభారతి ప్రాంగణంలో కన్నులపండువగా జరిగింది. ఈ కార్యక్రమంలో వెంకయ్యనాయుడు, మాజీ గవర్నరు బండారు దత్తాత్రేయ, తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు, బిజెపి రాష్ట్రాధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు, మల్లు ప్రసాద్, బాల సుబ్రహ్మణం సతీమణి సావిత్రి, కుమార్తె ఎస్పీ పల్లవి, చెల్లులు ఎస్పీ శైలజ, శుభలేఖ సుధాకర్, ఎస్పీ పార్వతి, ఎస్పీ వసంత, శాంతా బయోటెక్నిక్స్ అధినేత డా. కె.ఐ. వర ప్రసాద రెడ్డి తదితర ప్రముఖులతో కలిసి ఆవిష్క రించి ప్రసంగించారు. తెలుగువారిని, భాషను గౌరవించు కోవాలని, టిజి, ఎపి, ఎస్పీ అని సంక్షిప్తంగా కాకుండా చక్కగా నిండుగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, బాలసుబ్రహ్మణ్యం అని పూర్తిగా పిలవడం అలవాటు చేసుకోవాలని సూచిం చారు. భాష, ప్రాంతాలకు అతీతుడైన బాల సుబ్ర హ్మణ్యం విగ్రహాన్ని రవీంద్రభారతిలో ఆయన స్థాపించిన ఘంటసాల విగ్రహం పక్కనే వారి విగ్రహం పెట్టడం సుముచితంగా ఉందన్నారు.



శ్రీభవానీ దీక్షల పూర్ణాహుతి నిర్వహిస్తున్న దృశ్యం

# దుర్గమ్మ నినాదాలతో మార్మోగుతున్న బెజవాడ

ఇంద్రకీలాద్రి, డిసెంబరు 15 ప్రభాతవార్త: ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అత్యంత వైభవంగా జరిగుతున్న భవానీ దీక్షల విరమణ కార్యక్రమాలు చివరి రోజు సోమవారం పూర్ణాహుతితో దిగ్విజయంగా ముగిశాయి. శాస్త్రోక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమాలతో కృష్ణమ్మ ఒడిలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. దేవస్థానం స్థానాచార్యులు శివ ప్రసాద్, ప్రధాన అర్చకులు దుర్గా ప్రసాద్ మరియు ఇతర వైదిక కమిటీ సభ్యుల పర్యవేక్షణలో పాత యాగశాలలో ఉప ప్రధాన అర్చకులు, ముఖ్య అర్చకులు పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), ఈవో వి.కె. సీనా నాయక్ (స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్), ముఖ్య పండుగ అధికారి మూర్తి (ఈవో, ద్వారకా తిరుమల), ట్రస్ట్ బోర్డు సభ్యులు మరియు దుర్గమ్మ దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు. పూర్ణాహుతి అనంతరం పండితులు, అర్చకులు భక్తులకు, అధికారులకు వేద ఆశీర్వచనం అందించారు.

### భవాని దీక్షల గణాంకాలు

11వ తేదీ నుండి భక్తుల సంఖ్య 5,15,000, లడ్డు ప్రసాదం పంపిణీ 21.20 లక్షలు, అన్నప్రసాదం స్వీకరించిన భక్తులు 2,03,645, కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించిన భక్తులు 51,435 అని ఇఓ తెలిపారు.

### పక్కా ప్రణాళికతోనే భవాని దీక్షలు విజయవంతం: కలెక్టర్



భవాని దీక్షలు 2025 అత్యంత సంతృప్తికరమైన వాతా వరణంలో, భక్తుల నుంచి విశేష స్పందనతో విజయవంతంగా ముగిశాయని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీషా తెలిపారు. సోమవారం ఇంద్రకీలాద్రిపై ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, భక్తుల సౌక ర్యార్థం జిల్లా యంత్రాంగం పక్కా ప్రణాళికతో చేసిన ఏర్పాట్లు సత్ఫలితాలనిచ్చాయనిచ్చాయన్నారు. అన్ని శాఖల సమన్వయంతో రెవెన్యూ, పోలీస్, దేవాదాయ, మున్సిపల్ సహా ప్రతి శాఖాధికారులు, సిబ్బంది పండుగ విజయవంతానికి పగలు, రాత్రి అనకుండా కృషి చేశారని కొనియాడారు. భవాని భక్తుల కోసం చేసిన ప్రత్యేక ఏర్పాట్లు మంగళవారం కూడా కొనసాగుతాయని, బుధవారం నుండి దేవస్థానం యథావిధిగా పనిచేస్తుందన్నారు. ప్రెస్‌మీట్ అనంతరం, కలెక్టర్, అధికారులు, దేవస్థానం పాలకమండలి చైర్మన్ అండ్ సభ్యులు క్యూలైన్లు, ఘాట్‌లను స్వయంగా సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.




# గిరిజన గ్రామాల్లో వైద్య సేవలు అందిస్తూ..

పేద కుటుంబం. భర్త చనిపోయాడు, చేతిలో చంటిబిడ్డ. అయినా బిడ్డని తీర్చిదిద్దారు... నర్సమ్మ ఆమె కష్టం తన కుటుంబాన్నే బాగు చేయలేదు... జీవితాల్నీ మెరుగుపరుస్తోంది. కాబట్టే ప్రభుత్వ గుర్తింపూ పొందారామె. అంతలా చేశారంటే.. తెల్లవారడం ఆలస్యం... భుజానికి బ్యాగును తగిలించుకుని బయల్దేరతారు నర్సమ్మ. అడవుల్లో, పారే నీటిని దాటి చీరలోనే మైళ్ల దూరం నడుస్తారు. ఈమె ఆశ సామగ్రితో పల్లెలకు వెళతారు. అక్కడి భార్యాభర్తలను కూర్చోబెట్టి అవగాహన కల్పిస్తారు. దేనిమీదో తెలుసా... కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకోమని. అది కూడా మగవాళ్ళని! బాగా చదువుకున్నవాళ్లే వెసక్టమీకి ఒప్పుకోరు. వంధత్వం వస్తుందని భావిస్తుంటారు. మారుమూల పల్లెల వాళ్లు ఊరుకుంటారా? అయినా ఆమె ప్రశాంతంగా, ఓపిగ్గా దాని గురించి వివరిస్తారు.



'ఇక్కడ కుటుంబ నియంత్రణ తెలియదు. పేద కుటుంబాలు, పెరిగే పిల్లల సంఖ్యతో మరింత పేదరికంలోకి కూరుకుపోతుంటారు. పోనీ అవగాహన ఉన్నా ఆడవాళ్లకే చేయిస్తుంటారు. తరవాత సరిగా విశ్రాంతి దొరక్క వాళ్లేమో బలహీనమవుతుంటారు. అదే మగవాళ్లది సులువైన ప్రక్రియ, సురక్షితం కూడా. ఇదే భార్యాభర్తలిద్దరికీ అర్థమయ్యేలా చెబుతుంటా' అంటారు నర్సమ్మ. ఒడిశా, కొరాపుట్ ఘాటీ మటీ అనే మారుమూల ప్రాంతం ఆమెది. బిడ్డకి నెలల వయసు ఉన్నప్పుడే భర్తని కోల్పోయారు. ఆదాయం లేదు, తనదీ అటవీ గ్రామమే... ఉపాధి అవకాశం లేదు. దీంతో ఆశా కార్యకర్తగా చేరారు నర్సమ్మ. ఇలాగైతే తనలాంటి వారికి ఆమె రక్షను కల్పించడంతోపాటు ప్రభుత్వ పథకాల గురించీ అవగాహన కల్పించొచ్చు అనుకున్నారు. తన విధులను సక్రమంగా నిర్వర్తిస్తూ... కొడుకుని చదివించారు. ప్రస్తుతం అతను అమెరికాలో ఉన్నత చదువులు చదువుతున్నాడు. 'ఎవరో వచ్చి సాయపడరు, నాకోసం, నా బిడ్డకోసం నేనే పోరాటం చేయాలి అనుకున్నా. అయితే నా పని ఇతరులకీ సాయపడటం ఆనందంగా ఉంది' అనే నర్సమ్మ కోరాపుట్ గిరిజన గ్రామాల్లో వైద్య సేవలు అందించడమే కాదు, 25 మంది వెసక్టమీ చేయించుకునేలా ప్రోత్సహించారు. దానికి వాళ్లకి రూ. 2వేలు కూడా ఇస్తోంది. వాళ్లని ఒప్పించినందుకు నాకూ రూ.450 వస్తాయి. అయితే ఇక్కడ నేను డబ్బుల కోసం చేయను. దీన్నో బాధ్యతగా నిర్వర్తిస్తా'నని నర్సమ్మ తాజాగా ప్రభుత్వం నుంచి పురస్కారాన్ని పొందారు. 'మామూలు వాళ్ల కంటే గిరిజనులతో మాట్లాడటం, వాళ్లని ఒప్పించడమే కష్టం. అయినా ఓపికగా, తనపై నమ్మకం కలిగేలా చేసుకుని మరీ నర్సమ్మ వాళ్లని వెసక్టమీ దిశగా ప్రోత్సహిస్తున్నారన్న కితాబులూ అందుకున్నారామె. ఆమె ప్రయాణం స్ఫూర్తిదాయకమేగా మరి!

# ఆకలేస్తోందా ఒక్క క్షణం ..

నాజూగ్గా ఉండే స్నేహితురాల్ని చూసినప్పుడల్లా... నేనూ తగ్గితే బావుణ్ను అనుకోకుండా ఉండలేం. నచ్చిన డ్రెస్... మన సైజులో దొరకనప్పుడు కలిగే బాధను వర్ణించడమూ కష్టమే. దీనంతటికీ కారణం అధికబరువే అది తిండితో ముడిపడి ఉంటే... నియంత్రించుకోవడం కాస్త కష్టమైన విషయమే. అలాంటప్పుడు ఈ చిట్కాలు పాటించండి.

✦ డైట్ నియంత్రణ కోసమంటూ... ఉదయాన్నే తినాల్సిన అల్పాహారాన్ని మాత్రం దాటేయొద్దు. ఎందుకంటే, రోజువారీ అవసరమయ్యే మీ శక్తికి కీలక విటమిన్లు, ఇతర పోషకాలను ఇదే అందిస్తుంది. అంతేకాదు, టిఫిన్ తినకపోవడం వల్ల... మధ్యాహ్నం ఎక్కువ కెలోరీలు, స్వీట్స్ ఎక్కువగా తీసుకునే ప్రమాదం ఉంది.



✦ లో కెలోరీలు, హై ఫైబర్ ఫుడ్స్ తీసుకోవాలి. ముఖ్యంగా బియ్యం, చపాతీ, స్వీట్స్, ఫైలూ వంటివి తగ్గించాలి. బెండకాయ, వంకాయ, క్యాబేజీ, బత్తాయి, దానిమ్మ, మొలకెత్తిన గింజలు, గుడ్డులోని తెల్లసొన, లోఫ్యాట్ పాల ఉత్పత్తులను చేర్చుకోవాలి.

✦ కంటికి తక్కువగా కనిపించినప్పుడు కాస్త ఎక్కువ తినే ప్రమాదం ఉంది. అందుకే వీలైనంత చిన్న ప్లేట్లలో తినడానికి ప్రయత్నించండి. ఒకేసారి పెద్ద మొత్తంలో కాకుండా కొద్దికొద్దిగా తినండి. ఇందులో అన్ని పోషక రకాలూ అందేలా ఆహారపదార్థాల ఎంపిక ఉంటే మరింత మంచిది ✦ ఆకలితో సంబంధం లేకుండా తరచూ జంక్‌ఫుడ్, స్వీట్లు వంటివి తినే అలవటుందా? అయితే, అలా అనిపించినప్పుడు ఓ గ్లాసు గోరువెచ్చని నీళ్లను తాగడం, పండ్లూ, నట్స్ వంటివి తీసుకోవడం చేస్తే ఆ ప్రయత్నం మానుకుంటారు. ఇక, కొన్నిసార్లు శరీరం డీ హైడ్రేషన్‌కి గురయినప్పుడు కూడా తినాలన్న కోరిక కలుగుతుంది. దాన్ని నివారించడానికి తగినన్ని నీళ్లు తాగడం తప్పనిసరి. □

## తిరుప్పావై
## 1వ పాశురము



మార్గళిత్తింగల్ మదినిఖైన్ద
నన్నాళాళ్,
నీరాడ ప్పోదువీర్ పోదుమినో
నేరిక్కైయీర్
శీర్‌మల్‌గుమ్ ఆయ్‌ప్పాడి నెల్వ
చ్చిఱుమీర్ కాళ్
కూర్‌వేల్ కొడున్దొళిలన్
నన్దకోపన్ కుమరన్
ఏరార్‌నద కణ్ణి యశోదై యిళం
శింగమ్
కార్‌మేని చ్చెంగణ్ కదిర్
మతియమ్బోల్ ముకత్తాన్
నారాయణనే నమక్కే
పఱైతరువాన్
పారోర్ పుగళ ప్పడిన్దేలో
రెమ్బావాయ్

భగవంతుని పొందదలచిన వెంటనే అనుకూలమైన మార్గశీర్షమాసము లభించినదే ! పైగా నిండు చంద్రుడు చల్లని కాంతులీను మంచిరోజులు! కృష్ణ విరహము తీర, వ్రత మాడదలచినవారందరూ విచ్చేయుడు. సుందరాభరణ ధారిణులై, గో సంపద, గోవింద గుణ సంపదలు అనుక్షణము పెరుగుచుండెడి గోకులమందు ఆ సంపదలతో తులతూగు బాలికలారా! ఇట్లు చేయబోవు మనకు, వాడియైన బల్లెమును దాల్చి సుతుని రక్షించుటకు హింసలు కూడ చేయ వెనుకాడని నందగోపుని యొక్క నమ్రుడైన పుత్రుడు, సౌందర్యముతో విప్పారిన కళ్ళారగాంచు యశోదమకు సింహకిశోరమునైన నల్లని మేఘము వంటి మేను, ఎఱ్ఱతామరల వంటి నేత్రములు, ప్రియులకు చల్లని చంద్రుని వలె, శత్రువులకు తీక్ష్ణసూర్యుని వలె తోచు దివ్యముఖమండలము గల నారాయణుడే, అతనినే తప్ప ఇతరము కోరని మనకే పఱై అను పేరు కల ఒక వాద్యవిశేషమును (వాయుంచునది) అనుగ్రహించును. ఇది కని లోకులందరునూ సంతోషించునట్లుగ ఈ వ్రతమునాచరింతము రండి!

# ప్రమాద తీవ్రతను తగ్గిస్తుందట !



ఉదయం నిద్రలేచి మంచం మీద నుంచి పాదం కింద పెట్టాలంటేనే భయం. అరికాలు, మడమ విపరీతమైన నొప్పితో జివ్వుమంటుంది. రెండు మూడు గంటలు విలవిల్లాడుతుంది ప్రాణం. దీనికి కారణం ప్లాంటార్ ఫాషియాటిస్, శీతకాలంలో మహిళల్లో ఎక్కువగా కనిపించే సమస్య ఎక్కువసేపు నిల్చొని పనులు చేసే వాళ్లని, వయసు మళ్లిన వాళ్లని వేధిస్తుంటుంది. దీనికి 'ఆషీయూ' జపనీయుల విధానం పరిష్కారమంటున్నారు నిపుణులు. అదేనండి పుట్బాత్... రోజ రాత్రుళ్ల గోరువెచ్చని నీటిలో ఉప్పు, ఎప్సమ్ సాల్ట్ వేసుకుని, 15-20 నిమిషాలు పాదాలు ఉంచమంటున్నారు. దీనివల్ల రక్తప్రసరణ మెరుగై ప్లాంటార్ ఫాషియాటిస్ నుంచి ఉపశమనం లభిస్తుంది. సమస్య ఎక్కువగా ఉంటే ఉదయం లేచాక కూడా ఇది చేయొచ్చు. దీనివల్ల బీపీ, ఒత్తిడీ నియంత్రణలో ఉంటాయట. ఈ విధానంలో కార్డియో వాస్కులర్ వ్యాధులు ప్రమాదకరం అని నిపుణులు అంటున్నారు. ప్రయత్నించి చూడండి మరి! □

# స్టీల్ సింక్ శుభ్రం చేయాలంటే !



**వాడకాన్ని బట్టి..** మనం రోజూ గిన్నెలు శుభ్రం చేసినప్పుడు, కాయగూరలు కడిగినప్పుడు.. ఎం సింక్‌లో కూడా ఉండిపోవడానికి అవకాశం ఉంటుంది. అందుకే సింకి కూడా శుభ్రం చేసుకుంటూ ఉండాలి.సింక్ వాడకాన్ని బట్టి ఎన్ని రోజులకోసారి చేసుకోవాలి నిర్ణయించుకోవాలి.

**శుభ్రం చేద్దామిలా..!** రసాయనాలతో కూడిన లిక్విడ్వాష్, డిటర్జెంట్లు ఉపయోగించి సింక్ షట్ దాని నాణ్యత దెబ్బతింటుంది. అందుకే సహజసిద్ధంగా తయారుచేసిన పదా చేయడానికే ప్రాధాన్యత ఇవ్వాలి. ఇంట్లోనే ఉండే బేకింగ్ సోడా, వెనిగర్, నిమ్మ తొక్కలు, ఆలివ్ నూనె.. మొదలైనవి ఉపయోగించి సింక్‌లో సులభంగా క్లీన్ ముందుగా సింక్‌లో ఎలాంటి చెత్త లేకుండా చూసుకోవాలి. ఇప్పుడు కొద్దిగా ఒక మెత్తటి స్పాంజ్ సాయంతో సింక్ అంతా వ్యాపించేలా బాగా రుద్ది, కడగాలి. తర్వాత నీటితో శుభ్రం చేసి నిమ్మ లేదా నారింజ తొక్కలతో మెల్లగా రుద్దాలి. ఇలా చేయడం వల్ల సింక్ నుంచి దుర్వాసన రాకుండా, తాజాగా ఎప్పటికీ కొత్తదానిలా మెరిసి పోతూ ఉంటుంది. మళ్లీ నీళ్లతో శుభ్రం చేసి, తర్వాత మెత్తని వస్త్రంపై ఆలివ్నూనె వేసి సింక్ మొత్తం తుడవాలి.

**ఈ జాగ్రత్తలు కూడా:**

● సింక్‌లో బ్లీచ్, క్లోరిన్ వంటి పదార్థాలను ఎక్కువ సమయం ఉంచకూడదు. అలా ఉంచడం వల్ల మెరుపు తగ్గే అవకాశం లేకపోలేదు. ● స్టీల్ లేదా ఐరన్ స్క్రబ్స్ ఉపయోగించడం వల్ల గీతలు పడతాయి. కాబట్టి వాటిని వాడకపోవడమే మంచిది. ●. గిన్నెలు వేసేటప్పుడు వాష్ చేసేటప్పుడు.. నెమ్మదిగా పని చేసుకోవాలి. ● ఉపయోగించిన ప్రతి సారీ నీళ్లు నిల్వ ఉండిపోకుండా చూసుకోవాలి. ఎప్పటికప్పుడు వేడినీళ్లలో మైల్డ్ సోప్ కలిపి వాటితో ఇంకని శుభ్రం చేయాలి. □

# ముగ్గులకు ఆహ్వానం

ధనుర్మాసం అంటే ముగ్గుల మాసంకదా! ఈ నెలంతా ముగ్గులు వేస్తారు. ఈ సందర్భంగా 'చెలి' పేజీలో ముగ్గుల ప్రచురణ కోసం ఆహ్వానం పలుకుతున్నాం. ఆసక్తిగల మహిళలు ముగ్గులు వేసి పంపించగలరు.

**సూచనలు :**

★ గతంలో ప్రచురించిన ముగ్గులను పంపవద్దు. కొత్తముగ్గులు మాత్రమే పంపించగలరు.
★ ఇటీవల తీసుకున్న పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోను జతచేయగలరు.
పాతఫొటోలను పంపవద్దు.
★ మీ పూర్తి చిరునామా, ముగ్గుల సంఖ్యను రాయాలి.
★ ఏ4 పేజీలో ఒకసైడు మాత్రమే ముగ్గుల్ని వేయాలి. ★ ముగ్గులు క్లీయర్‌గా, రంగు లతో కనిపించాలి. ★ మీ ముగ్గులను మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు.



**మా చిరునామా**
ఎడిటర్, 'చెలి' వార్త, నం.396,
లోయర్‌ట్యాంక్ బండ్, డిబిర్ మిల్స్ పక్కన,
హైదరాబాద్-80. Gmail:
cheli@vaartha.com

**కృత్రిమ మేధతో రూపొందించిన ముగ్గులు పంపవద్దు**


# 'నువ్వు నాకు నచ్చావ్' రీ రిలీజ్ కి సిద్ధం



ప్రేక్షకులకు విందు భోజనం తిన్నంత ఆత్మ సంతృప్తి. ఇప్పటికి చాలా సార్లు ఈ చిత్రాన్ని వీక్షించినా కూడా ఇంకా బోర్ కొట్టనంత రిపీట్ వేల్యూ ఉన్న కంటెంట్ ఇది. అందుకే 2026 కొత్త సంవత్సరాన్ని ఈ సినిమాతో చిల్ కావడానికి పూర్తి సాంకేతిక హంగులతో 4 కె లో రీ రిలీజ్‌కి సిద్ధం అయ్యింది. ఈ సినిమా అప్పట్లో విదేశాల్లో పూర్తి స్థాయిలో రిలీజ్ కాలేదు. ఆ లోటుని తీర్చడం కోసం కూడా ఈ సినిమా జనవరి 1 న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమా తీస్తున్నప్పుడే నిర్మాత 'స్రవంతి' రవికిశోర్ ఇది ఒక గొప్ప సినిమా అవుతుందనే నమ్మకంతోనే ఉన్నారు. విక్టరీ వెంకటేష్ ని సరికొత్త పంథాలో ఆవిష్కరించిన సినిమా ఇది. 'నువ్వే కావాలి' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత విజయ భాస్కర్ త్రివిక్రమ్ ఫుల్ జోష్ తో చేసిన సినిమా ఇది. అప్పటికే త్రివిక్రమ్‌కి 'మాటల మాంత్రికుడు' అనే ఇమేజ్ వచ్చేసింది. ఇప్పటకీ ఈ సినిమాలోని డైలాగ్స్ మార్మోగుతూనే ఉన్నాయి. నిర్మాత 'స్రవంతి' రవికిశోర్ మాట్లాడుతూ తెలుగు సినిమా చరిత్రలో ఓ మైలురాయి అయిన"నువ్వు నాకు నచ్చావ్" ఇప్పుడు 4కె లో తిరిగి థియేటర్లలోకి వస్తోంది. ఇది కేవలం రీరిలీజ్ కాదు. జనవరి 1, 2026 - కొత్త సంవత్సరాన్ని కుటుంబంతో కలిసి నవ్వులు పూయిస్తూ ప్రారంభించడానికి ఇదే సరైన సమయం

# తెర

## 'రాజా సాబ్' మెలోడీ సాంగ్ రిలీజ్



ఈ నెల 17న విడుదల కానున్న ఫుల్ లిరికల్ సాంగ్ రెబల్ స్టార్ ప్రభాస్, టాలెంటెడ్ డైరెక్టర్ మారుతి, ప్రెస్టీజియస్ ప్రొడక్షన్ హౌస్ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ కాంబినేషన్ లో రూపొందుతున్న క్రేజీ మూవీ "రాజా సాబ్" నుంచి సెకండ్ సింగిల్ 'సహన సహన..' అప్డేట్ వచ్చేసింది. ఈ బ్యూటిఫుల్ మెలోడీ సాంగ్ ప్రోమోను ఈ రోజు రిలీజ్ చేశారు. 'సహన సహన..' ఫుల్ లిరికల్ సాంగ్ ను ఈ నెల 17న సాయంత్రం 6.35 నిమిషాలకు రిలీజ్ చేయబోతు న్నట్లు మేకర్స్ ప్రకటించారు. 'సహన సహన..' సాంగ్ లో ప్రభాస్ కలర్ ఫుల్ ట్రెడిషనల్ కాస్ట్యూమ్స్ తో ఆల్ట్రా స్టైలిష్ వైబ్ క్రియేట్ చేస్తున్నారు. ఈ సాంగ్‌ను మ్యూజిక్ సెన్సేషన్ తమన్ తన కెరీర్ బెస్ట్ మెలోడీగా కంపోజ్ చేశారు. ప్రభాస్, నిధి అగర్వాల్ లపై చిత్రీకరించిన 'సహన సహన..' పాటలో స్టన్నింగ్ లొకేషన్స్‌లో హైలైట్ గా నిలుస్తున్నాయి. సంక్రాంతి సందడిని రెట్టింపు చేసేందుకు జనవరి 9న "రాజా సాబ్" సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. హారర్ కామెడీ జానర్ లో ఎవర్ గ్రీన్ మూవీగా నిలిచిపోయేలా "రాజా సాబ్"ను తెరకెక్కిస్తున్నారు దర్శకుడు మారుతి. ఈ సినిమాను భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్‌తో అన్ కాంప్రమైజ్డ్‌గా నిర్మిస్తున్నారు నిర్మాత టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ ఈ చిత్రంలో హీరోయిన్స్‌గా నటిస్తున్నారు."రాజా సాబ్" రిలీజ్ కోసం రెబల్ ఫ్యాన్స్‌తో పాటు వరల్డ్ వైడ్ ఆడియెన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

# ప్రేక్షకాభిమానుల హృదయాలలో శోభన్‌బాబుది శాశ్వత స్థానం




అయితే నన్ను ప్రోత్సహించింది దాసరి నారాయణరావు, నన్ను సినిమా రంగం లోనికి రమ్మని ఆహ్వానించింది శోభన్ బాబు. నా జీవితంలో ఈ ముగ్గురినీ ఎన్నటికీ మరచిపోలేను. శోభన్ బాబుతో నేను 'ముగ్గురు మిత్రులు' అనే చిత్రం కూడా తీశాను. క్రమశిక్షణకు ఆయన మారుపేరు. ఆయన నుంచి నాలాంటి వారెందరో స్ఫూర్తి పొందారు. మా బ్యానర్ లో తీసిన "అతడు' సినిమాలో ఓ ముఖ్య పాత్ర కోసం ఆయనకు బ్లాంక్ చెక్కు ఇచ్చి నటించమని కోరాను. కానీ ఆయన అంగీకరించలేదు. అందాల నటుడిగా నాకున్న పేరును అలానే కొనసాగించాలంటే ఇతర పాత్రలు ఏవీ చేయకూడ దని నిర్ణయించుకున్నట్టు అప్పట్లో నాకు చెప్పారు" అని అన్నారు. సురేష్ ప్రొడక్షన్స్ అధినేత, నిర్మాత డి.సురేష్ బాబు మాట్లాడుతూ, "1975లో విడుదలైన 'సోగ్గాడు' చిత్రం తమ సంస్థకు మంచి పేరును, డబ్బును తెచ్చిపెట్టింది. సౌండ్ కు సంబంధించి నేటి టెక్నాల జీని ఉపయో గించి ఈ చిత్రాన్ని రీ రిలీజ్ చేయబోతున్నాం. మా సంస్థ చిత్రాలను ఏఐలోకి మార్చే ప్రక్రియను కూడా కొనసాగిస్తున్నాం" అని చెప్పారు. నిర్మాత కైకాల నాగేశ్వరరావు మాట్లాడుతూ, అప్పట్లో శోభన్ బాబుతో 'అడవి రాజా', 'ఇద్దరు దొంగలు' చిత్రాలను తాను తీశానని, క్లాస్ హీరోగా పేరున్న ఆయనతో మాస్ చిత్రాలను తీసి..హిట్ కొట్టానని చెప్పుకొచ్చారు. ఇంకా ఈ కార్యక్రమంలో అట్లూరి పూర్ణ చంద్రరావు, కె.ఎస్.రామారావు, బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్, రేలంగి నరసింహా రావు, రాశీ మూవీస్ నరసింహారావు, కె.మురళీమోహనరావు, మాజీ ఎమ్మెల్యే జేష్ట రమేష్ బాబు, అఖిల భారత శోభన్ బాబు సేవా సమితి ఛైర్మన్ సుధాకర్ బాబు, కన్వీనర్ సాయి కామరాజు, పూడి శ్రీనివాస్, బి. బాలసుబ్రహ్మ ణ్యం, భట్టిప్రోలు శ్రీనివాస్ రావు, వీరప్రసాద్, విజయ్ కుర్రా రాంబాబు, తెలంగాణ శోభన్ బాబు అభిమానులు తదితరులు పాల్గొని, స్వర్ణోత్సవానికి ప్రేక్షకాభిమాను లందరూ హాజరై, విజయవంతం చేయాలని ఆకాంక్షించారు.

# 'పతంగ్' ట్రైలర్ ఆవిష్కరణ



ప్రతిష్టాత్మక సంస్థ సురేష్ ప్రొడక్షన్స్ డి.సురేష్ బాబు సమర్పణలో రూపొందుతున్న చిత్రం 'పతంగ్' పతంగుల పోటీతో రాబోతున్న ఈ యూత్‌ఫుల్ కామెడీ స్పోర్ట్స్ డ్రామా చిత్రం 'పతంగ్' సినిమాటిక్ ఎలిమెంట్స్, రిషన్ సినిమాస్, మాన్‌సూన్ టేల్స్ సంస్థలు ప్రతిష్టాత్మ కంగా నిర్మిస్తున్న ఈ స్పోర్ట్స్ డ్రామా ఈ చిత్రానికి విజయ్ శేఖర్ అన్నే, సంపత్ మకా,సురేష్ కొత్తింటి, నాని బండ్రెడ్డి నిర్మాతలు. ఈ చిత్రానికి ప్రణీత్ ప్రత్తిపాటి దర్శకుడు. ఈ చిత్రంలో ఇన్‌స్టాగ్రమ్ సెన్సేషన్ ప్రీతి పగడాల, జీ సరిగమప రన్నరప్ ప్రణవ్ కౌశిక్‌తో పాటు వంశీ పూజిత్ ముఖ్యతారలుగా నటిస్తున్నారు. పాపులర్ దర్శకుడు నటుడు గౌతమ్ వాసుదేవ మీనన్, ప్రముఖ సింగర్, నటుడు ఎస్పీ చరణ్ ఈ చిత్రంలో కీలకమైన పాత్రల్లో కనిపించబోతున్నారు. డిసెంబరు 25న ప్రపంచవ్యాప్తంగా చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా ఈ చిత్రం ట్రైలర్‌ను హైదరాబాద్‌లో జరిగిన ఓ భారీ ఈవెంట్‌లో ప్రముఖ దర్శకుడు దేవకట్టా విడుదల చేశారు. ఈసందర్భంగా దేవ కట్టా మాట్లాడుతూ ట్రైలర్ ఎంతోఎనర్జిటిక్, ఎంటర్‌టైనింగ్‌గా అనిపించింది. రమ్య ఈ సినిమాకు వన్ ఆఫ్ ద ప్రొడ్యూసర్ అవ్వడం హ్యాపీగా ఉంది. ఈ ప్రాజెక్ట్‌తో పాటు ఈ సినిమా హీరో ప్రణవ్ సరిగమప నుంచి తెలుసు. ఇదొక కొత్తరకమైన సినిమా. ఈ సినిమా చాలా కష్టపడి తీశారు.

# అమ్మా.. నాకు ఆ అబ్బాయి కావాలి!!

ప్రముఖ మహిళా వ్యాపారవేత్త జి. శైలజా రెడ్డి నిర్మాతగా శివాల ప్రభాకర్ దర్శకత్వంలో!!.. తెలుగు చిత్రసీమలోకి మరో మహిళా నిర్మాత అరంగేట్రం చేస్తున్నారు. ఆమె పేరు "జి. శైలజా రెడ్డి". సీనియర్ దర్శకుడు శివాల ప్రభాకర్ దర్శకత్వంలో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ చిత్రం పేరు "అమ్మా... నాకు ఆ అబ్బాయి కావాలి" జి.ఎస్.ఆర్. మూవీ మేకర్స్ పతాకంపై భారీ తారాగణంతో రూపొందుతున్న ఈ చిత్రంతో యువ కిశోరం పవన్ మహావీర్ హీరోగా పరిచయమవుతున్నాడు. సుహాన మేఘశ్రీ హీరోయిన్లు. సీనియర్ నటులు సుమన్,రావు రమేష్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. శ్రీలక్ష్మి శైలజ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు!! ఈ చిత్రం ప్రారంభోత్సవం హైదరాబాద్ లోని సారథి స్టూడియో లో అత్యంత ఘనంగా జరిగింది. హీరోహీరోయిన్లపై చిత్రీకరించిన



ముహూ ర్తపు సన్నివేశానికి రచనా బాహుబలి వి.విజయేంద్రప్రసాద్ క్లాప్ కొట్టగా... నిర్మాతల మండలి అధ్యక్షులు కె.ఎల్.దామోదర్ ప్రసాద్, దర్శకుల సంఘం అధ్యక్షులు వీర శంకర్ గౌరవ దర్శకత్వం వహించారు.

# 'మిస్టీరియస్' ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది

-జయ్ వల్లందాస్



రోహిత్ హీరోగా అబిద్ భూషణ్ పోలీస్ పాత్రలో నటించిన సినిమా 'మిస్టీరియస్'.రియా కపూర్ , మేఘనా రాజ్ పుత్ నటీనటులుగా మహి కోమటిరెడ్డి దర్శకత్వంలో అశ్లీ క్రియేషన్స్ పై జయ్ వల్లందాస్ నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 19న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది.

ఈ సందర్భంగా మూవీ హైలైట్స్ ను ఈ రోజు జరిగిన ఇంటర్వ్యూలో నిర్మాత జయ్ వల్లందాస్ తెలిపారు.నిర్మాత జయ్ వల్లందాస్ మాట్లాడుతూ మా 'మిస్టీరియస్' సినిమా ప్రమోషనల్ కంటెంట్ కు వస్తున్న రెస్పాన్స్ చూస్తుంటే హ్యాపీగా ఉంది. నేను యూఎస్ లో ఉంటాను. సినిమా రంగం మీద ఆసక్తితో టాలీవుడ్ కు వచ్చాను. నా స్నేహితుడు మహి కోమటిరెడ్డిని దర్శకుడిని చేయాలనే సంకల్పంతో 'మిస్టీరియస్' చిత్రాన్ని నిర్మించాను. ఈ మూవీ స్టోరీ మహి చెప్పిన వెంటనే నాకు బాగా నచ్చింది. తొలి ప్రయత్నంలో ఒక కథా బలమున్న మంచి సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాను నిర్మించడం సంతృప్తిగా ఉంది. మా మూవీ టైటిల్ బాగుందనే రెస్పాన్స్ వస్తోంది. మా సినిమాను ఈ నెల 12నే రిలీజ్ చేయాల్సి ఉంది. అయితే అఖండ 2 రిలీజ్ కారణంగా ఒక వారం ఆలస్యంగా ఈ నెల 19న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం. 150 థియేటర్స్‌కు పైగా గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నాం.

## గ్వాలియర్ కప్ విజేత జైపూర్



**న్యూఢిల్లీ:** జైపూర్ పోలో జట్టు గ్వాలియర్ కప్‌ను గెలుచుకోవడం ద్వారా మరో అద్భుతమైన సీజన్‌ను ముగించింది. ఫైనల్‌లో మేఫెయిర్ పోలోపై 6.5–3 తేడాతో విజయం సాధించింది. ఇది ప్రస్తుత పోలో సీజన్‌లో జైపూర్‌కు ఆరవ టోర్నమెంట్ విజయం. జైపూర్ పోలో ప్రారంభంలోనే ఆధిపత్యం దిశగా కదిలింది. 2.5–0 వద్ద ఓపెనింగ్ చుక్కర్‌ను ముగించింది. లాన్స్ వాట్సన్ చురుకైన పరుగులు, ఆత్మవిశ్వాసంతో ముగింపులతో ఆధిక్యాన్ని నడిపించగా, జైపూర్‌కు చెందిన హెచ్‌హెచ్ మహారాజా సవాయి పద్మనాభ్ సింగ్ మేఫెయిర్ పోలోను మిడ్‌ఫీల్డ్ నుండి ఆటను నిర్దేశించాడు. రెండవ చుక్కర్‌లో మేఫెయిర్ పోలో తిరిగి రావడానికి ప్రయత్నించాడు. అయితే సిద్ధాంత్ శర్మ వారి ఖాతాను తెరిచాడు. కానీ 2.5–1 వద్ద జైపూర్‌కు అనుకూలంగా స్కోరును నిలిపింది. మూడో చుక్కర్‌లో జైపూర్ మ్యాచ్‌పై పట్టును బలోపేతం చేసుకుని ఆధిక్యాన్ని 4.5–1కి పెంచుకుంది. వాట్సన్ తన అద్భుతమైన స్కోరింగ్ ఫామ్‌ను కొనసాగించగా, డినో ధంకర్ కీలక సహకారం అందించాడు. ఫైనల్ చుక్కర్ కూడా ఇదే తరహాలో ఆడింది. జైపూర్ ఆటను వ్యూహాత్మకంగా నిర్వహించి 6.5–3తో తమ స్కోరును పెంచుకుంది. మేఫెయిర్ పోలో కోసం శర్మ సాహసోపేతమైన ప్రయత్నం చేసినప్పటికీ, చివరి దశల్లో జైపూర్ అద్భుతమైన సీజన్ విజయానికి మరో ట్రోఫీని అందించింది. జనరల్ అమర్ సింగ్ కనోటా కప్, సవాయి మ్యాన్ గార్డ్ కప్, చింకారా కప్, కాశ్మీర్ ఛాలెంజ్ కప్ మరియు కోట కప్ గెలుచుకున్న తర్వాత జైపూర్ పోలో జట్టుకు ఈ సీజన్‌లో ఇది ఆరో టైటిల్.

## ఫార్ములా 4 ఛాంపియన్ చందారియా



**న్యూఢిల్లీ:** ఇండియన్ రేసింగ్ ఫెస్టివల్‌లో భాగమైన ఎఫ్ఐఎ సర్టిఫైడ్ ఫార్ములా 4 ఇండియన్ ఛాంపియన్‌షిప్ మూడవ సీజన్ ఛాంపియన్‌గా షేన్ చందారియా నిలిచాడు. చెన్నైలో జరిగిన రౌండ్ 2లో ఎఫ్ఐఎ ఫార్ములా 4 రేసును గెలుచుకున్న మొదటి కెన్యాగా చరిత్ర సృష్టించాడు. 2025 సీజన్‌లోకి కొత్త అనుభవం ఉన్న రూకీగా అడుగుపెట్టిన కెన్యాకు చెందిన చందారియా తిరుగులేని ఛాంపియన్‌గా నిలిచి టైటిల్‌ను సాధించాడు. ఇది అతని యువ కెరీర్‌లో తొలి ఛాంపియన్‌షిప్ విజయం. పోల్ పొజిషన్‌లో రోజు మొదటి రేసును ప్రారంభించిన టీనేజర్ చందారియా 26 నిమిషాల, 23.059 సెకన్లలో 23 ల్యాప్‌లను పూర్తి చేశాడు. 26:22.674 సమయంతో కిచ్చా కింగ్స్ బెంగళూరుకు చెందిన సాచెల్ రోట్జ్ కంటే అతను రెండవ స్థానంలో నిలిచినప్పటికీ, టాప్ 2 ఫినిషింగ్ టైటిల్‌ను ఖాయం చేసుకుంది. ఫ్రెంచ్‌కు చెందిన రోట్జ్, చందారియా రేస్ 2లో మరోసారి పోటీలో పడ్డారు. 2025 ఇండియన్ ఎఫ్4 ఛాంపియన్‌షిప్‌లో చందారియా మరియు రోట్జ్ వరుసగా మొదటి మరియు రెండవ స్థానాల్లో నిలిచి ఆధిపత్యం చెలాయించారు. మూడవ స్థానాన్ని ఏడుసార్లు ఇండియన్ నేషనల్ కార్టింగ్ ఛాంపియన్ ఇషాన్ మాదేష్ కైవసం చేసుకున్నాడు. భారతీయ వారసత్వం కలిగిన ఈ కెన్యా రైడర్ చందారియా కెన్యా నేషనల్ కార్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఆధిపత్యం చెలాయించాడు. 2021లో రూకీ ఆఫ్ ది ఇయర్ గౌరవాన్ని, 2022లో నేషనల్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను గెలుచుకున్నాడు.

# నేడు మినీ వేలం

## కెకెఆర్ వద్ద కోట్లు.. ముంబయి వద్ద చిల్లర



**న్యూఢిల్లీ:** 2026 ఐపీఎల్ మినీ వేలానికి వేళ అయ్యింది. రాబోయే ఐపీఎల్ సీజన్‌కు ఈ నెల 16న వేలం జరగనుంది. ఈ క్రమంలో ఫ్రాంచైజీలు తమ జట్లలోకి ఉత్తమ ఆటగాళ్లను చేర్చుకునేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే చాలా వరకు ఒప్పందాలు జరిగాయి. ఇక పర్స్ వాల్యూలో కోల్‌కతా నైట్‌రైడర్స్ తొలి స్థానంలో ఉంది. మినీ వేలంలో పాల్గొనేందుకు రూ.64.3 కోట్ల పర్స్ వ్యాల్యూ ఉంది. బ్యాటర్ వెంకటేష్ అయ్యర్‌ను రిలీజ్ చేయడం ద్వారా ఆ జట్టుకు రూ.23 కోట్లు ఒకేసారి యాడ్ అయ్యాయి. అలాగే చెన్నై సూపర్ కింగ్స్ వద్ద రూ.43.4 కోట్ల పర్స్ వ్యాల్యూ ఉంది. ఈ టీమ్ ఇప్పటికే సంజూ శాంసన్‌ను ట్రేడింగ్ ద్వారా దక్కించుకుంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ వద్దరూ.25.5 కోట్ల పర్స్ వాల్యూ అందుబాటులో ఉంది. ఈ టీమ్‌లో రెండు విదేశీ స్లాట్‌లు మిగిలున్నాయి. లక్నో సూపర్ జైయింట్స్ రూ.22.95 కోట్లు కలిగి ఉంది. అయితే ఈ టీమ్‌లో కేవలం ఆరుగురు ఆటగాళ్ల కోసం మాత్రమే ఖాళీ ఉంది. ట్రేడింగ్ సమయంలో మహమ్మద్ షమీ చేరడం వల్ల ఈ టీమ్ ఇప్పుడు ఫినిషర్, బ్యాకప్ పేసర్ గా విదేశీ బ్యాటర్‌ను చూస్తున్నారు. ఢిల్లీ క్యాపిటల్స్ వద్ద రూ.21.8 కోట్ల కొనుగోలుకు అవకాశం ఉంది. గత సీజన్‌లో ఫాప్ డుప్లెసిస్ అలరించగా ఈ సీజన్‌లో తప్పుకున్నాడు. జేక్ ఫ్రేజర్ మెక్‌కిర్క్‌ను కూడా విడుదల చేశారు. ఈ టీమ్‌లో ఇప్పటికే 8 స్థానాలను భర్తీ చేయాల్సి ఉంది. ఇక 2025లో ఐపీఎల్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఇప్పుడు అదే ఉత్సాహంతో 2026లోకి అడుగుపెడుతుంది. అయితే కేవలం రూ.16.4 కోట్ల పర్స్ వాల్యూతో మినీ వేలంలో అడుగుపెడుతున్నారు. రాజస్థాన్ రాయల్స్ రూ.16.05 కోట్ల బిడ్‌తో వేలలోకి అడుగుపెడుతోంది. సంజు సామ్సన్‌ను చెన్నై సూపర్ కింగ్స్‌కు ట్రేడ్ చేసిన తర్వాత అదే ట్రేడింగ్‌లో రవీంద్ర జడేజాను జట్టులోకి తీసుకున్నారు. రూ.12.9 కోట్ల పర్స్ వాల్యూతో ఈసారి వేలంలోకి అడుగుపెడుతున్న గుజరాత్ టైటాన్స్ ఇప్పుడు 5 ఖాళీలను భర్తీ చేయాల్సి ఉంది. శ్రేయాస్ అయ్యర్ కెప్టెన్సీలో గత సీజన్‌లో పంజాబ్ కింగ్స్ ఫైనల్‌కు చేరుకుంది. ఇప్పుడు అదే ఉత్సాహంతో ఈసారి ట్రోఫీని దక్కించుకోవాలని ప్రణాళికలు రచిస్తుంది. ఈ టీమ్ వద్ద రూ.11.5 కోట్ల పర్స్ వాల్యూ ఉంది. ముంబయి ఇండియన్స్ ఈ జాబితాలో చివర్లో ఉంది. ఈ జట్టు రూ.2.75 కోట్ల విలువైన పర్స్ కలిగి ఉండగా, ఈ సొమ్ముతో ఐదుగురు ఆటగాళ్లను కొనుగోలు చేయాల్సి ఉంది.




## ఉమన్ ప్లేయర్ ఆఫ్ ది మంత్‌గా షఫాలీ

**న్యూఢిల్లీ:** దక్షిణాఫ్రికాతో జరిగిన ఒడిఐ ప్రపంచ కప్ ఫైనల్‌లో నిర్ణయాత్మక ప్రదర్శన తర్వాత భారత్ ఓపెనర్ షఫాలి వర్మ నవంబర్ 2025 సంవత్సరానికి ది ఉమెన్ ప్లేయర్ ఆఫ్ ది మంత్‌గా ఎంపికైంది. ఈ మేరకు సోమవారం ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ ప్రకటించింది. గాయపడిన ప్రతికా రావల్ స్థానంలో ఆలస్యంగా ఎంపికైన షఫాలి దక్షిణాఫ్రికా మ్యాచ్‌లో 78 బంతుల్లో 87 పరుగులు చేసి అందరి దృష్టిని ఆకర్షించింది. ప్రపంచ కప్ ఫైనల్‌లో ఒక భారత ఓపెనర్ చేసిన అత్యధిక స్కోరు ఇది. ఆమె దూకుడుగా ఆరంభించడం, భారత వైస్ కెప్టెన్ స్మృతి మంధానతో కలిసి రికార్డు స్థాయిలో 100 పరుగుల భాగస్వామ్యంతో భారత్ 298/7 స్కోరు సాధించడానికి దోహదపడింది. షఫాలి ప్రభావం ఆమె బ్యాటింగ్‌ను మించిపోయింది. వరుసగా రెండుసార్లు స్ట్రైకింగ్ చేసి సునే లూస్, మారిజాన్ కాప్‌లను అవుట్ చేసి దక్షిణాఫ్రికా జోరును బద్దలు కొట్టింది. షఫాలి ఏడు ఓవర్లలో 236 గణాంకాలతో ముగించింది. కాగా "నవంబర్ నెలలో మహిళా క్రీడాకారిణిగా ఎంపిక కావడం నాకు నిజంగా గౌరవంగా ఉంది. ఈ అవార్డును నా సహచరులు, కోచ్‌లు, కుటుంబం, ఇప్పటివరకు నా ప్రయాణానికి మద్దతు ఇచ్చిన ప్రతి ఒక్కరికీ అంకితం చేస్తున్నాను. మేము ఒక జట్టుగా గెలిచాము. ఈ అవార్డుకు కూడా అదే వర్తిస్తుంది" అని షఫాలి సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది.

## స్క్వాష్ ప్రపంచ కప్ ఛాంపియన్‌గా భారత్

**న్యూఢిల్లీ:** భారత స్క్వాష్ జట్టు చరిత్ర సృష్టించి స్క్వాష్ ప్రపంచ కప్ ఛాంపియన్‌గా నిలిచింది. జోష్నా చినప్ప, అభయ్ సింగ్, అనహత్ సింగ్ విజయాల కారణంగా, టోర్నమెంట్ యొక్క ఆధిపత్య చివరి టైలో టాప్ సీడ్ హాంకాంగ్‌ను 3–0 తేడాతో ఓడించారు. ప్రపంచకప్‌లో భారత్ సాధించిన రెండోపతకం ఇది. 2023లో కాంస్య పతకాన్ని సాధించింది. భారత అనుభవజ్ఞురాలు జోష్నాచిన్నప్ప, ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 27వ స్థానంలో ఉన్న కాయి లీతో తలపడటంతో ఈ తొలి మ్యాచ్‌లో టై ప్రారంభమైంది. 39 ఏళ్ల ఆమె తన క్లాస్ మరియు అనుభవాన్ని ప్రదర్శించి నాలుగు ఆటలలో, 7–3, 2–7, 7–5, 7–1 తో మ్యాచ్ గెలిచింది, కాయితో జరిగిన



తన హెడ్‌టుహెడ్ రికార్డును 3–0 కి మెరుగుపరిచి భారత్‌కు ప్రారంభ ఆధిక్యాన్ని ఇచ్చింది. ఆ తర్వాత, భారత నంబర్ 1 అభయ్ సింగ్ తన ప్రత్యర్థి క్వాన్ లావుతో జరిగిన మొదటి పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లో కేంద్ర బిందువుగా నిలిచాడు. అభయ్ ప్రత్యర్థిపై వరుస గేమ్‌ల విజయాన్ని (7–1, 7–4, 7–4) సాధించాడు. ఆ తర్వాత, టీనేజర్ అనాహత్ సింగ్ ప్రస్తుత ఆసియా ఛాంపియన్ హో త్జే లోక్‌పై 7–2, 7–2, 7–5 తేడాతో 3–0 తేడాతో విజయం సాధించి, చివరి గోల్ చేసింది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.